RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in



23 మార్చ్ 2025 ఆదివారం | హైదరాబాద్ | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:20 | సంచిక:251

# దక్షిణాది రాష్ట్రాలు, రాజకీయ పార్టీలు ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉంది

## డీలిమిటేషన్‌ను మేం అంగీకరించం..?

## ద్వితీయ శ్రేణి పౌరులుగా మారే ప్రమాదం ఉంది:

## రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు



లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన విషయంలో దక్షిణాది రాష్ట్రాలు, రాజకీయ పార్టీలు విభేదాలను పక్కనపెట్టి తమ వాటా దక్కించుకునేందుకు ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. పునర్విభజన ప్రక్రియపై రాష్ట్ర శాసనసభలో త్వరలోనే తీర్మానం ఆమోదిస్తామని, అదే తరహాలో మిగతా రాష్ట్రాలు చేయాలని విజ్ఞప్తి చేశారు.

నియోజకవర్గాల పునర్విభజనపై తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ చెన్నైలో నిర్వహించిన Fair Delimitation (న్యాయమైన పునర్విభజన) జాయింట్ యాక్షన్ కమిటీ తొలి సమావేశంలో ముఖ్యమంత్రి ప్రసంగించారు. దక్షిణాది రాష్ట్రాలకు నష్టం కలిగించే పునర్విభజనపై ఐక్యంగా పోరాడాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు.

పునర్విభజన అంశంలో సమావేశంలో అనేక కీలక అంశాలను ప్రస్తావించిన ముఖ్యమంత్రి , దీనిపై ఐక్య కార్యాచరణ కోసం త్వరలో హైదరాబాద్‌లో తదుపరి సమావేశం ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ పోరాటంలో ప్రజలను భాగస్వామ్యం చేయడానికి భారీ బహిరంగ సభను నిర్వహిస్తామని చెప్పారు. దక్షిణ భారతదేశ పౌరుల గళాన్ని బలంగా, ఐక్యంగా మొత్తం భారత దేశానికి వినిపిద్దామని పిలుపునిచ్చారు.

“నియోజకవర్గాల పునర్విభజనపై మనందరిని ఏకతాటిపై తెచ్చిన తమిళనాడు ముఖ్యమంత్రి గౌరవ స్టాలిన్‌కు ప్రత్యేక అభినందనలు. ఈ విషయంలో దక్షిణాది రాష్ట్రాలు ఐక్యంగా పోరాడాలని విజ్ఞప్తి చేస్తున్నా.

1971లో జనాభా నియంత్రణ పాటించాలని దేశం నిర్ణయం తీసుకున్నప్పటి నుంచి దక్షిణాది రాష్ట్రాలు దాన్ని అమలు చేశాయి. ఉత్తరాది పెద్ద రాష్ట్రాలు జనాభా నియంత్రణలో విఫలమయ్యాయి. దక్షిణాది రాష్ట్రాలన్నీ వేగంగా ఆర్థిక వృద్ధిని సాధించాయి. జీడీపీ, తలసరి ఆదాయం, వేగంగా ఉద్యోగాల కల్పన, మెరుగైన మౌలిక వసతుల కల్పన, సుపరిపాలన, సంక్షేమ కార్యక్రమాల నిర్వహణలో మంచి ప్రగతి సాధించాయి.

కేంద్ర ఖజానాకు పెద్ద మొత్తంలో నిధులు ఇస్తూ, తిరిగి తక్కువ మొత్తాన్ని పొందుతున్నాం. తమిళనాడు పన్నుల రూపంలో కేంద్రానికి రూపాయి చెల్లిస్తే తిరిగి 29 పైసలే వెనక్కి వస్తుంది. ఉత్తర ప్రదేశ్‌కు 2.73 రూపాయలు వెనక్కి వెళుతున్నాయి. బీహార్ రూపాయి చెల్లిస్తే 6.06 రూపాయలు వెనక్కి వెళుతున్నాయి. కర్ణాటకకు కేవలం 14 పైసలు, తెలంగాణకు 41 పైసలు, కేరళకు 62 పైసలు మాత్రమే వెనక్కి వస్తున్నాయి.

మిగతా 2లో

## దక్షినాది రాష్ట్రాలపై వివక్ష పెరిగింది

## డి లిమిటేషన్ తో అనేక నష్టాలు కేటీఆర్

వార్త 2 లో



## తెలంగాణ కు అన్యాయం జరిగితే ఊరుకునేది లేదు.

## టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్.




చెన్నై డి లిమిటేషన్ జేఏసీ సమావేశలో పాల్గొని ప్రసంగించిన టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్.. అనంతరం చెన్నై లో ప్రెస్ మీట్ లో మాట్లాడిన మహేష్ కుమార్ గౌడ్.

జనాభా లెక్కల పార్లమెంట్ డి లిమిటేషన్ జరిగితే దక్షిణాది రాష్ట్రాలకు తీరని అన్యాయం జరుగుతుంది.

డి లిమిటేషన్ చేయాలంటే దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరగకుండా ఒక సమగ్రమైన ఒక శాస్త్రీయ కమిటీ వేసి అధ్యయనం చేశాక మొదలు పెట్టాలి.

లోక్ సభ నియోజకవర్గ డి లిమిటేషన్ విషయంలో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతున్న విషయంలో జేఏసీ ఏర్పాటు చేసి చొరవ తీసుకున్న తమిళనాడు సీఎం స్టాలిన్ ను అభినందించారు

1976 లో కుటుంబ నియంత్రణ చట్టాన్ని దక్షిణాది రాష్ట్రాలు పకడ్బందీగా అమలు చేసాయి. దాంతో ఇక్కడ జనాభా తగ్గింది. అందుకు మేము నష్టపోవలా.. బీజేపీ ఒక రాజ్యాంగేతర శక్తిగా తయారైంది. రాజ్యాంగ సంస్థలను విద్వంసం చేస్తూ తన స్వంత ఎజెండా ను ప్రజలపై రుద్దుతుంది.తెలంగాణ దేశంలోనే కొత్త రాష్ట్రం.. సోనియాగాంధీ దయ తో 60 ఏళ్ల తెలంగాణ కల సాకారం అయింది.

దేశానికి ఎక్కువ శాతం పన్నులు చెల్లిస్తూ కేంద్రం నుంచి తక్కువ మొత్తంలో లబ్ది పొందుతున్న రాష్ట్రాలు కూడా దక్షిణాది రాష్ట్రాలే.

ఈ విదంగా జనాభా లెక్కలతో డి లిమిటేషన్ జరిపితే మరింత నష్టపోతాము..

ఏప్రిల్ లో హైదరాబాద్ భారీ బహిరంగ సభ నిర్వహిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమావేశంలో ప్రకటించారని మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు.

సమావేశంలో పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ మల్లు రవి ఖైరతాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు డాక్టర్ రోహిన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర వ్యాప్తంగా దావత్ ఏ ఇఫ్తార్ ఘనంగా నిర్వహించండి ....

## డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు



హైదరాబాద్(ప్రజాబలం ప్రతినిధి మార్చి 22 :: దావత్ ఏ ఇఫ్తార్ ను రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అధికారులను ఆదేశించారు. శనివారం అసెంబ్లీ సమావేశ మందిరంలో ఇఫ్తార్ విందు, రంజాన్ పండుగ ఏర్పాట్లను ఆయన మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీతో కలిసి సమీక్షించారు. ప్రతి సంవత్సరం ఆనవాయితీగా నిర్వహించే ఈ కార్యక్రమాలకు ఎలాంటి నిధుల కొరత లేదు అని డిప్యూటీ సీఎం తెలిపారు. ఆహారంలో నాణ్యత, ప్రోటోకాల్, సౌకర్యాల కల్పనలో అధికారులు ఎలాంటి రాజీ పడాల్సిన అవసరం లేదని డిప్యూటీ సీఎం తెలిపారు. ఏర్పాట్లలో అధికారులు ఏమాత్రం అశ్రద్ధ వహించరాదని, చిన్న పొరపాటుకు అవకాశం లేకుండా చూడాలని డిప్యూటీ సీఎం తెలిపారు. లా అండ్ ఆర్డర్, ఎలక్ట్రిసిటీ, మంచినీరు వాటి అంశాలు ఇబ్బంది లేకుండా చూసుకోవాలని కోరారు. ఏర్పాట్లలో ఎలాంటి అనుమానాలు, ఇబ్బందులు ఎదురైనా అధికారులు మొహమాట పడకుండా జిల్లా ఇన్చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ లేదా తన దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు. ఏర్పాట్లకి సంబంధించి రోజువారి సమీక్షను ప్రభుత్వ సలహాదారు, ఏర్పాట్ల కమిటీ వైస్ చైర్మన్ షబ్బీర్ అలీ రోజువారి సమీక్ష చేస్తారని తెలిపారు.సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ రంజాన్ పవిత్ర మాసంలో ముస్లిం సోదరులకు ఏలాంటి అసౌకర్యం లేకుండా ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిందని, దావత్ ఏ ఇఫ్తార్ కు కూడా ఘనంగా ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. ప్రభుత్వ సలహాదారు, మాజీ మంత్రి షబ్బీర్ అలీ మాట్లాడుతూ మా ప్రభుత్వం దావత్ ఏ ఇఫ్తార్ ను ఘనంగా నిర్వహిస్తుందని అన్నారు.సమావేశంలో అన్ని విభాగాల అధికారులు పాల్గొన్నారు.

## ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా నీటిని పొదుపుగా వాడుకుందాం మంత్రి పొన్నం ప్రభాకర్



హైదరాబాద్ భూగర్భ జలాలను కాపాడుకుందాం. ప్రపంచ నీటి దినోత్సవం మనం నీటి గురించి మాట్లాడుకోవాల్సిన అవసరం ఉన్న దినం. అందరం ఒక సంకల్పం తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పక్షాన విజ్ఞప్తి చేస్తున్నా నీటిని పొదుపుగా వాడుకుందాం వచ్చే తరాలకు అవకాశాలు ఇద్దాం. అనవసరంగా నీటిని దుర్వినియోగం చేసి ఈ ఇబ్బందుల్లో గ్రౌండ్ వాటర్ పడిపోతున్న సందర్భంగా గ్రౌండ్ వాటర్ కాపాడుకునే ప్రయత్నాలు తీసుకోవాలి. హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ తీసుకుంటున్న కార్యక్రమాల్లో ప్రజలందరూ భాగస్వామ్యం కావాలి రాష్ట్ర వ్యాప్తంగా నీటిని ప్రతి చుక్కను పొదుపు చేసుకుంటూ కాపాడుకోవాలి. భవిష్యత్ తరాలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని కోరుతున్న ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా అందరూ స్ఫూర్తిదాయక కార్యక్రమాలు చేయాలి

నీటిని పొదుపు చేసే చర్యలు తీసుకోవాలి. ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా

## బంజారాహిల్స్ లో రూ. 1.71 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

### మురుగు నీటి పరిష్కారానికి కృషి



సనత్‌నగర్ ప్రజాబలం ప్రతినిధి:హైదరాబాద్, మార్చి 22: నగర అభివృద్ధి పై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి ప్రజలకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తుందని నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు. శనివారం బంజారాహిల్స్ డివిజన్ ఎమ్మెల్యే కాలనీలో రూ. 1.71 కోట్ల వ్యయంతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు మేయర్ శంకుస్థాపన చేశారు.

ఫ్లాట్ నెం. 160/ఎ నుండి ఒమెగా హాస్పిటల్ వరకు రూ. 1.21 కోట్ల వ్యయంతో మురుగు నీటి పైప్ లైన్ ను పున:నిర్మాణం, రూ. 22 లక్షల వ్యయంతో ఎమ్మెల్యే కాలనీ గల జీహెచ్ఎంసీ పార్కు నుండి ఎమ్మెల్యే కాలనీ రోడ్ 12 వరకు మురుగు నీటి లీకేజీ, ఓవర్ ఫ్లో నివారణకు ప్రధాన సీవరేజ్ పైప్ లైన్ ఏర్పాటుకు, రూ. 28 లక్షల వ్యయంతో ఎమ్మెల్యే కాలనీ ఫ్లాట్ నెం 11 బి నుండి 2బి వరకు మురుగు నీరు నిల్వకుండా సీవరేజ్ స్థానంలో 300 ఎం.ఎం ఆర్.సి.సి ఎన్.పి.ఎస్ శివరేజ్ లైన్ వేయుటకు మేయర్ శంకుస్థాపనలు చేశారు.

ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ... మురునీటి సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. మురునీటి నిల్వలు, ఓవర్ ఫ్లో, లీకేజీల సమస్యల పరిష్కారానికి ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటూ ప్రజలకు మెరుగైన మురుగునీటి వ్యవస్థ అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు తెలిపారు. పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో వాటర్ వర్క్స్ జీ.ఎం హరిశంకర్, మేనేజర్ రాంబాబు, జీహెచ్ఎంసీ ఈఈ విజయ్ కుమార్, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాబలం

23 మార్చ్ 2025 ఆదివారం

## చమురు సంక్షోభం పొంచివున్నదా?

పశ్చిమాసియాలో ఎలాంటి సంఘర్షణలు ఎదురైనా భారతీయ వాణిజ్య రంగానికి సంక్షోభం తప్పదు. చమురు, సహజ వాయువు, ఎరువులు, తదితర ముఖ్య అవసరాలు సరిగ్గా సరఫరా కాక, వాణిజ్యంలోనే కాదు, ప్రజల జీవన విధానంలో కూడా ఒడిదుడుకులు ఎదురవుతుంటాయి. ముఖ్యంగా చమురు సంక్షోభం సంభవిస్తే అంతర్జాతీయ మార్కెట్‌లో క్రూడాయిల్ ధర ఒక్కసారిగా పెరిగిపోతుంది. మనకు ఎక్కువగా చమురును, గ్యాస్‌ను సరఫరా చేసేది రష్యా, ఇరాన్ దేశాలే. ఆయా దేశాల నుంచి సరఫరాకు ఆటంకాలు ఏర్పడితే మన దేశం భారీగా అంతర్జాతీయ మార్కెట్‌కు మూల్యం చెల్లించుకోవలసి వస్తుంది. ఈ పరిస్థితుల్లో ఈ ఏడాది ఫిబ్రవరిలో రష్యా నుంచి మనదేశానికి ముడి చమురు దిగుమతులు రోజువారీ సరాసరిన (మిలియన్ పెర్ డే) 1.41 మిలియన్ బ్యారెళ్ల వంతున తగ్గిపోవడం ఆందోళన కలిగించే అంశం. గత సంవత్సరం జనవరి నాటికి రోజువారీ 1.49 మిలియన్ బ్యారెళ్ల వంతున తగ్గిపోగా అంతకన్నా ఇప్పుడు తగ్గడం గమనార్హం. కార్గో ట్రాకింగ్ ఏజెన్సీ వోర్టెక్స్ వివరాల ప్రకారం ఈ ఏడాది ఫిబ్రవరిలో రోజువారీ మొత్తం 4.77 మిలియన్ బ్యారెళ్లుగా చమురు దిగుమతులు జరిగాయి. జనవరిలో రోజువారీ మొత్తం 4.76 మిలియన్ బ్యారెళ్ల చమురు దిగుమతులు కాగా పెద్దగా మార్పు లేదు. అయితే ఈ మార్చి, ఏప్రిల్ నెలల్లో మరింతగా చమురు దిగుమతులు క్షీణిస్తాయని వోర్టెక్స్ చెబుతోంది. దీనికి కారణం అమెరికా ఆఫీస్ ఆఫ్ ఫారెన్ అసెట్స్ కంట్రోల్ (ఒఎఫ్‌ఎసి) జనవరి 10 న విధించిన ఆంక్షలే. అయితే ఈ లోటును పశ్చిమాసియా దేశాలు భర్తీ చేస్తాయని ఎపిఎసి అనాలిసిస్ వోర్టెక్స్ అధినేత ఇవాన్ మేథ్యూ వెల్లడించారు. రష్యా చమురు ఉత్పత్తిదారులైన గాజ్‌ప్రోమ్ నెఫ్ట్, సర్గుట్ నెఫ్ట్ గ్యాస్‌లతో పాటు దాదాపు 180 ట్యాంకర్లపై తాజాగా జనవరి 10న అమెరికా ఆంక్షలు విధించింది. రష్యాకు రెవెన్యూ రాకుండా అడ్డుకోవడమే దీని వెనుక ఉన్న ఆంతర్యం. ఉక్రెయిన్‌పై యుద్ధం సాగించడానికే రష్యా ఈ ఆదాయాన్ని ఖర్చు పెడుతోందని అమెరికా ఆరోపిస్తోంది. ఫలితంగానే రష్యా చమురు కార్గో నౌకలు ఫిబ్రవరి 27 నాటికి అమెరికా ఆంక్షల సుడిలో చిక్కుకోవలసి వచ్చింది. 2024 మొదటి ఏడు మాసాలు (జనవరి జులై) ఇజ్రాయెల్, జోర్డాన్, లెబనాన్ దేశాలకు భారత్ నుంచి వాణిజ్యంలో సంఘర్షణలు తప్పలేదు. భారత్ నుంచి ఇజ్రాయెల్‌కు 63.3 శాతం వరకు ఎగుమతులు పతనమయ్యాయి. దీని విలువ 1.3 బిలియన్ డాలర్లు. ఆర్గానిక్ కెమికల్స్, పెట్రోలియం ఉత్పత్తులు, డైమండ్స్, ఎగుమతులకు గండి పడిందని వాణిజ్య విభాగం వెల్లడించింది. అలాగే జోర్డాన్‌కు ఎగుమతుల్లో 38 శాతం అంటే 638 మిలియన్ డాలర్ల వరకు, లెబనాన్‌కు 7% అంటే 198 మిలియన్ డాలర్ల వరకు ఎగుమతులు పతనమై భారత్‌కు నష్టాలు సంభవించాయి. 2024 వరకు అంతకు ముందు ఏడేళ్లుగా ఏటా 3% వంతున ముడిచమురు ఉత్పత్తిలో తగ్గుదల కనిపిస్తోంది. ఉత్పత్తిలో తగ్గుదల ఉంటున్నా వినియోగం పెరుగుతుండడంతో భారత్ దిగుమతులపై ఎక్కువగా ఆధారపడవలసి వస్తోంది. 2017 నుంచి 2024 వరకు 86 నుంచి 89 శాతం వరకు దిగుమతులపైనే దేశం ఆధారపడవలసి వచ్చింది. భారత ఇంధన వినియోగ చిత్ర 2024 ఆర్థిక సంవత్సర నివేదికలో ఇదో భాగం. దేశం ఇంధనాన్ని సేకరించడం, ఉత్పత్తి, వినియోగం తాలూకు ఆమూలాగ్ర డేటాను ఈ నివేదిక అందిస్తోంది. కేంద్ర ఇంధన మంత్రిత్వశాఖ నేతృత్వంలో బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ (బిఇఇ)ఈ నివేదికను రూపొందించింది.

2024 ఆర్థిక సంవత్సరంలో మొత్తం సరఫరా అయిన ఇంధనం 910 మిలియన్ టన్నులు కాగా, ఇందులో బొగ్గు నుంచి 60%, చమురు నుంచి 28%, గ్యాస్ నుంచి 7%, శిలాజేతర వనరుల నుంచి 5% సరఫరా అయింది. స్వదేశీ చమురు ఉత్పత్తి 2017 ఆర్థిక సంవత్సరంలో 36 మిలియన్ టన్నులు కాగా, 2024 నాటికి 29.4 మిలియన్ టన్నులకు తగ్గిపోయింది. వార్షిక రేటు 3% వరకు తగ్గుతూ వస్తోంది. ఈ తగ్గుదలకు అనేక కారణాలు దోహదం చేస్తున్నాయి. ఈ కొరతను అధిగమించడానికి కేంద్ర ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోంది. ఈ మేరకు 2019లో హైడ్రోకార్బన్ ఎక్స్‌ప్లొరేషన్ అండ్ లైసెన్సింగ్ (హెచ్ఇఎల్‌పి) వంటి ప్రక్రియను అమలుచేసే చర్యలను తీసుకుంది. ఎంపికైన చమురు క్షేత్రాల్లో తగిన సాంకేతిక విధానాలు అమలు చేసి చమురు ఉత్పత్తిని సాధించడమే ఈ విధానం లక్ష్యం. చిన్న, మధ్యతరహా స్థాయిలో చమురు పరిశోధనలను కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ద్వారా ఆయా సంస్థలను ప్రోత్సహిస్తోంది. ప్రభుత్వ నిర్వహణలోని ఒఎన్‌జిసి, ఆయిల్ ఇండియా సంస్థలు క్రమంగా 65 శాతం, 11 శాతం వరకు 20232024 సంవత్సరంలో చమురును అందించగలిగాయి. మిగతా 24 శాతం ముడిచమురు ఉత్పత్తి ప్రొడక్షన్ షేరింగ్ కాంట్రాక్ట్ (పిఎస్‌సి) లేదా రెవెన్యూ షేరింగ్ కాంట్రాక్ట్ (ఆర్ఎస్‌సి) ద్వారా లభించింది. 2024 ఏప్రిల్ 1 నాటికి సమతుల్యతలో తిరిగి పొందగలిగిన చమురు నిల్వలు 671.4 మిలియన్ టన్నులుగా భారత్ అంచనా వేసింది. అంతకు ముందు సంవత్సరం నాటి 669.47 మిలియన్ టన్నుల నిల్వలతో పోల్చుకుంటే 0.3 శాతం ఎక్కువ. స్వదేశీ చమురు ఉత్పత్తి కన్నా డిమాండ్ ఎక్కువగా ఉండడంతో చమురు దిగుమతులపై ఆధారపడడం మరింత ఎక్కువ అవుతుందని ఫిచ్ రేటింగ్స్ అంచనా వేస్తోంది. ప్రపంచంలోనే మూడో అతి పెద్ద చమురు దిగుమతి దారైన భారత్ 2024లో 234 మిలియన్ టన్నుల చమురును సేకరించుకోగలిగింది. సరఫరా కావలసి చమురులో 86% 2017లోను, 89% 2024 లోనూ దిగుమతి చేసుకోవలసి వచ్చింది. కొవిడ్ మహమ్మారి సమయంలో చమురు దిగుమతులు తాత్కాలికంగా 202122 లో తగ్గాయి. భారీ స్థాయిలో దిగుమతి చేసుకున్నామంటే రిఫైన్డ్ పెట్రోలియం ఉత్పత్తుల వినియోగం భారీగా పెరుగుతున్నట్టే భావించక తప్పదు. 2024 ఏప్రిల్ 1నాటికి ఏడాదికి 256.8 మిలియన్ టన్నుల చమురును రిఫైనింగ్ చేసే సామర్థ్యం భారత్‌కు ఉందని తేలింది. దీంతో ప్రపంచంలో అమెరికా, చైనా, రష్యా తరువాత నాలుగో రిఫైనర్‌గా భారత్ నిలుస్తోంది.

## దక్షిణాది రాష్ట్రాలు, రాజకీయ పార్టీలు ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉంది

మొదటి పేజీ తరువాయి

అదే సమయంలో మధ్య ప్రదేశ్ రూపాయి పన్ను రూపంలో కేంద్రానికి ఇస్తే వెనక్కి రూ.1.73 పైసలు వెళుతున్నాయి.

దక్షిణాది రాష్ట్రాలకు కేంద్రం కేటాయింపులు, పన్ను చెల్లింపులు క్రమంగా తగ్గిస్తోంది. చివరకు జాతీయ ఆరోగ్య మిషన్ కేటాయింపుల్లోనూ ఉత్తరాది రాష్ట్రాలకు 60 నుంచి 65 శాతం నిధులు దక్కుతున్నాయి.

మనది ఒకే దేశం. మనం దానిని గౌరవిస్తాం. కానీ ఈ నియోజకవర్గాల పునర్విభజనను అంగీకరించం. ఎందుకంటే రాజకీయంగా దక్షిణాది రాష్ట్రాలను కుదించడమే. మంచి ప్రగతి సాధిస్తున్న రాష్ట్రాలను ఈ ప్రక్రియ ద్వారా శిక్షిస్తోంది. ఈ అసమగ్రమైన పునర్విభజన ప్రక్రియ చేపట్టకుండా అడ్డుకోవలసిన అవసరం ఉంది.

ముఖ్యంగా..

1). సీట్లు పెంచొద్దు. ఉన్న సీట్లతోనే పునర్విభజన ప్రక్రియ చేపట్టాలి. 1976లో ఇందిరా గాంధీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఆ రకంగానే పునర్విభజన చేపట్టారు. లేదంటే రాష్ట్రాల మధ్య రాజకీయ అసమానతలు ఏర్పడేవి. 2001లో ప్రధానమంత్రి వాజ్‌పేయి నేతృత్వంలోని ప్రభుత్వం పునర్విభజన ప్రక్రియను కూడా ఇదే రకంగా చేపట్టారు. లోక్‌సభ సీట్లను అదే సంఖ్యలో ఉంచుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అదే విధంగా చేయగలరా?

2). జనాభా దామాషా ప్రాతిపదికను పునర్విభజన దక్షిణాది వ్యతిరేకిస్తోంది. బీజేపీ ప్రతిపాదిస్తున్న జనాభా దామాషా పద్ధతిలో పునర్విభజనను చేపడితే దక్షిణాది రాష్ట్రాలు రాజకీయ గళం కోల్పోతాయి. దక్షిణాది రాష్ట్రాలు ఉత్తరాదిలో ద్వితీయ శ్రేణి పౌరులుగా తగ్గించిబడుతుంది.

జనాభా ప్రాతిపదికన పునర్విభజన చేపడితే ఉత్తరప్రదేశ్, బీహార్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ వంటి రాష్ట్రాలు దేశంపై ఆధిపత్యం చలాయిస్తాయని అందరూ అంగీకరిస్తున్నారు. ఏ పరిస్థితుల్లోనూ ఈ ప్రతిపాదనను అంగీకరించకూడదు.

3) ప్రొరేటా విధానాన్నీ అంగీకరించలేం. ప్రొరేటా విధానం కూడా దక్షిణాదికి నష్టమే కలగజేస్తుంది. ప్రొరేటా ప్రక్రియ కూడా రాజకీయ అంతరాలను పెంచుతుంది. ప్రొరేటా విధానాన్ని పాటిస్తే సీట్ల మధ్య తేడా కేంద్ర ప్రభుత్వ ఏర్పాటును నిర్ణయిస్తుంది. ఒక్క సీటు కూడా కేంద్రంలో ప్రభుత్వాలను నిర్ధేశించగలదు. దేశంలో ఒక్క సీటుతో కేంద్ర ప్రభుత్వం పడిపోయిన చరిత్ర మన అనుభవంలో ఉంది.

ఆమోదయోగ్య ప్రతిపాదనలు

మరో 25 ఏళ్లపాటు లోక్‌సభ సీట్లలో ఎటువంటి మార్పు తీసుకురావద్దు. సీట్ల సంఖ్యలో మార్పు లేకుండా పునర్విభజన ప్రక్రియ చేపట్టాలి. పునర్విభజనకు రాష్ట్రాన్ని యూనిట్ గా తీసుకొని చేయాలి. రాష్ట్రాల్లోని జనాభా ఆధారంగా పునర్విభజన చేపట్టాలి.

రాష్ట్రాల్లోని నగరాలు, గ్రామాల్లోని జనాభా ఆధారంగా లోక్‌సభ సీట్ల హద్దులను మార్పు చేయాలి. తాజా జనాభా లెక్కల ప్రకారం రాష్ట్రాల్లో ఎస్సీ, ఎస్టీ సీట్ల సంఖ్య పెంచాలి. ప్రతి రాష్ట్రంలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలి. లోక్ సభ స్థానాల పెంపును మరో 25 ఏళ్లపాటు వాయిదా వేయాలి.

జనాభా నియంత్రణలో ప్రగతి సాధించిన దక్షిణాది రాష్ట్రాలను శిక్షించే విధానానికి కేంద్రం స్వస్తి చెప్పాలి. జనాభా దామాషా ప్రాతిపదికన పునర్విభజన చేపట్టొద్దని దక్షిణాది రాష్ట్రాలు డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో లోక్‌సభ నియోజకవర్గాలకు సంబంధించి దేశంలోని ఇతర రాష్ట్రాలతో సంబంధం లేకుండా చిన్న రాష్ట్రాలు, ఈశాన్య రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో సీట్లను ఏర్పాటు చేసినట్లే దక్షిణాదికి అవకాశం ఇవ్వాలి.

మంచి ప్రగతి సాధించిన దక్షిణాది రాష్ట్రాలకు పార్లమెంట్ సీట్లలో మంచి వాటా ఇవ్వడం ద్వారా ఇతర రాష్ట్రాలు ఆర్థిక వృద్ధి, సుపరిపాలనపై దృష్టి సారించేలా చేయాలి.

ప్రధాన డిమాండ్లు

543 సీట్లు ఉన్న లోక్‌సభలో ప్రస్తుతం దక్షిణాది రాష్ట్రాల సీట్ల సంఖ్య 130. ఇది మొత్తం సీట్లలో 24 శాతం. పునర్విభజన తర్వాత ఏర్పడే నూతన లోక్‌సభలో దక్షిణాది రాష్ట్రాలకు 33 శాతం సీట్లు ఇవ్వాలి.

దేశవ్యాప్తంగా 50 శాతం సీట్లను పెంచాలనుకుంటే అలా పెరిగే 272 సీట్లతో మొత్తం లోక్‌సభ సీట్ల సంఖ్య 815 అవుతుంది. ఇందులో 33 శాతం అంటే దక్షిణాది రాష్ట్రాల లోక్‌సభ సీట్లు 272 గా ఉండాలి. ఈ సీట్లను దక్షిణాదిలోని తమిళనాడు, కర్ణాటక, కేరళ, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, పుదుచ్చేరిలకు ఇప్పుడున్న ప్రొరేటా ప్రాతిపదికన పంచవచ్చు.

దేశంలో మిగిలిన సీట్లను ఉత్తరాది, ఇతర రాష్ట్రాలకు కేంద్రం పంచవచ్చు. అనుకున్న దానికంటే దక్షిణాది రాష్ట్రాలకు సీట్ల సంఖ్య తగ్గిస్తే అది దేశ రాజకీయ రంగంపై ప్రతికూల ప్రభావం చూపుతుంది." అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివరించారు.

## దక్షిణాది రాష్ట్రాలపై వివక్ష పెరిగింది

## డి లిమిటేషన్ తో అనేక నష్టాలు కేటీఆర్




చెన్నైలో జరుగుతున్న డీలిమిటేషన్ సదస్సులో భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మాట్లాడారు.

ఇది కేవలం పార్లమెంటులో ప్రాతినిధ్యానికి సంబంధించిన అంశం మాత్రమే కాదు. నిధులు కేంద్రీకృతం కావడంతో పాటు ఆర్థిక నియంతృత్వానికి దారితీస్తుందని. దక్షిణాది భవిష్యత్తును కాలరాస్తుందని వివరించారు. దేశం ప్రజాస్వామిక దేశమైనా, భిన్న అస్తిత్వాలు, సంస్కృతులు కలిగిన ఒక సమాఖ్య రాష్ట్ర అన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని అఅన్నారు.

కెసిఆర్ ఆధ్వర్యంలో 14 సంవత్సరాలపాటు తెలంగాణ ఉద్యమం నడిపించారు. మెజార్టీ నియంతృత్వం మందబలం ఉన్నప్పుడు జరిగే నష్టాలు మా తెలంగాణ ప్రజలకు తెలుసు.. తెలంగాణ ఉద్యమ కాలంలో ఢిల్లీలో ఉన్న మంద బలంతో పాటు సమైక్యరాష్ట్రంలోని మెజార్టీ నాయకత్వం పైన పోరాటం చేసి 14 సంవత్సరాల అనంతరం తెలంగాణ ప్రజల ఆకాంక్షను నెరవేర్చుకున్నామని అన్నారు. దీనివల్లనే 14 సంవత్సరాల పట్టింది అనేక ఉద్యమాలు చేయాల్సి వచ్చింది. తమిళనాడు ప్రజల నుంచి అనేక అంశాలు స్ఫూర్తి తీసుకుంటాము.

అస్తిత్వం కోసం, హక్కుల కోసం కొట్లాడడంలో తమిళనాడు స్ఫూర్తినిచ్చింది? ద్రవిడ ఉద్యమం సమైక్య దేశంలో తమ హక్కులు సాధించుకోవడానికి రాష్ట్రాలకు ఒక దిక్సూచి లెక్క పనిచేస్తుంది. కేంద్ర ప్రభుత్వ ప్రస్తుత డిలిమిటేషన్ వల్ల అనేక నష్టాలు జరుగుతున్నాయి. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వ వివక్షపూరిత విధానాల వలన దక్షిణాదికి అనేక నష్టాలు జరుగుతున్నాయి.

దేశ అభివృద్ధి కోసం పని చేసినందువలన ఈరోజు నష్టం జరుగుతుంది. మనమంతా ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య వ్యవస్థలో ఉన్నాం. ప్రజాస్వామ్యం మందబలం ఆధారంగా నడవరాదని అన్నారు. మందబలం ఉన్నందువలన నియంతత్వం రావద్దు. దేశ అభివృద్ధిలో ముందు వరుసలో ఉన్న రాష్ట్రాలకు నష్టం కలిగిస్తూ? దేశాన్ని వెనక్కి నెడుతున్న రాష్ట్రాలకి ఈ డిలిమిటేషన్ విధానం లాభం చేకూరుస్తుంది. పరిపాలన ఆర్థిక అభివృద్ధిలో దక్షిణాది రాష్ట్రాలు దేశానికి ఆదర్శంగా ఉన్నాయి కానీ దానివల్లనే తీవ్రమైన నష్టాన్ని ఎదుర్కొంటున్నాయి. దేశానికి 36% జిడిపిలో భాగస్వామ్యం ఉన్న దక్షిణాది రాష్ట్రాలు శిక్షింపబడుతున్నాయి. డీలిమిటేషన్ అంశం కేవలం పార్లమెంట్ ప్రాతినిధ్యం తగ్గడానికి పరిమితం కాదు. ఆర్థికపరమైన నిధుల కేటాయింపుల్లో కూడా తీవ్రమైన నష్టం జరగబోతుంది. వీటి కేటాయింపుల్లో కూడా అధికారం పూర్తిగా కేంద్రీకృతమై నియంతృత్వం వైపు దారితీసే అవకాశం ఉన్నది. ఆర్థిక వనరుల కేంద్రీకృతం జరగడం వలన భవిష్యత్తులోనూ ప్రస్తుతం ఉన్న దక్షిణాది రాష్ట్రాలకు జరుగుతున్న నిధుల కేటాయింపులు అన్యాయం మరింతగా పెరుగుతుంది.

దక్షిణాది రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వ వివక్ష కొత్త కాదు. కానీ ఈ మధ్యకాలంలో ఈ వివక్ష అన్యాయం మరింత పెరిగింది. ప్రస్తుతం బిజెపి సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వం దీన్ని మరింత పెంచేలా డీ లిమిటేషన్ అంశాన్ని ముందుకు తీసుకువచ్చింది. కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన బుల్లెట్ రైలు వంటి ప్రాజెక్టులన్ని ఉత్తరాదికే పరిమితం అవ్వడం ఇందుకు ఒక ఉదాహరణ అని అన్నారు.

బిజెపి సారథ్యంలోని కేంద్రం ఈ విధంగా దక్షిణాది రాష్ట్రాలకు జరుగుతున్న అన్యాయం పైన పుండుపైన ఉప్పురుద్దినట్టుగా వ్యవహరిస్తున్నది. ఆదర్శవంతమైన సమైక్య రాష్ట్ర దేశంలో ఒక ప్రాంతం ఇంకో ప్రాంతం పైన ఆధిపత్యం చలాయించే విధంగా ఉండరాదన్నది ప్రజాస్వామ్యస్ఫూర్తి. ఇది కేవలం ఉత్తర దక్షిణాది రాష్ట్రాల వ్యవహారం కాదు అభివృద్ధి చెందిన రాష్ట్రాలు ప్రాంతాలకు నష్టం జరుగుతున్న అంశం. కేవలం జనాభా ఆధారంగా సీట్ల పెరుగుదల గనుక జరిగితే దేశ సమాఖ్య స్ఫూర్తికి తీవ్ర విఘాతం కలిగే ప్రమాదం ఉన్నది. మనమంతరం భారతీయులం?అయితే మనందరికీ ఆయా ప్రాంతాల అస్తిత్వం ఉందన్న విషయాన్ని మర్చిపోవద్దు. విభిన్న భాషలు సాంస్కృతిక అస్తిత్వాలతో కూడిన ఒక సమైక్య దేశం అన్న విషయాన్ని మర్చిపోకూడదు. వెనుకబడిన రాష్ట్రాలకు నిధులు ఇచ్చే అంశాన్ని మేము ఏమి వ్యతిరేకించడం లేదు కానీ? నిధుల కేటాయింపుల వివక్షను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం. 1971 తర్వాత ఉన్న పార్లమెంటు సీట్లు కేటాయింపు తర్వాత జరిగిన జనాభా నియంత్రణ వలన ఈరోజు దక్షిణాదికి నష్టం జరగడం అన్యాయం. జనాభా నియంత్రణను దేశ అభివృద్ధి కోసం దక్షిణాది రాష్ట్రాలు పాటించాయి. ఉత్తరాది రాష్ట్రాలు జనాభా నియంత్రణలో విఫలమైనందువలన వారికి ఈరోజు డీలిమిటేషన్లో లబ్ధి జరగడం ఏ విధంగా కూడా సరైంది కాదని అన్నారు. ఇది దేశాన్ని వెనుక వేసిన వాళ్లకి రివార్డు ఇవ్వడం లాంటిదని అన్నారు.

## సయ్యద్ అలీ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు




**అంబర్‌పేట్ ప్రజాబలం ప్రతినిధి:** ఖైరతాబాద్ జిల్లా యూత్ కాంగ్రెస్ సెక్రటరీ సయ్యద్ అలీ ఆధ్వర్యంలో జరిగిన ఇఫ్తార్ విందులో ముఖ్య అతిథులుగా మాజీ రాజ్యసభ సభ్యులు వి హనుమంతరావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఫెరోజ్ భాయ్, టిపిసిసి ప్రధాన కార్యదర్శి ఆర్ లక్ష్మణ్ యాదవ్, టిపిసిసి కార్యదర్శి శంభుల శ్రీకాంత్ గౌడ్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మోతరోహిత్, మాజీ కార్పొరేటర్ పులి జగన్, మైనార్టీ సెల్ చైర్మన్ జమీర్ భాయ్, కోటం అనిల్, సర్ఫ్ రోష్, సమీవుల్లా తదితరులు పాల్గొన్నారు.ఖ

# యువతకు స్ఫూర్తి భగత్ సింగ్

భగత్ సింగ్ (1907 సెప్టెంబరు 28-1931 మార్చి 23) భారత స్వాతంత్ర్య సమరయోధుడు, కరుడుకట్టిన ఉద్యమకారుడు. ఢిల్లీ వీధిలో ఎర్ర కాగితాలు చల్లి ప్రజలను చైతన్య పరిచాడు. విప్లవం వర్ధిల్లాలి అనే నినాదాన్ని ఇచ్చింది కూడా భగత్ సింగే. భారత స్వాతంత్ర్యోద్యమము లో పోరాడిన అత్యంత ప్రభావశీల విప్లవ కారులలో ఆయన ఒకడు. ఆ కారణంగానే షహీద్ భగత్ సింగ్‌గా నేటికీ కొనియాడ బడుతున్నాడు. భగత్ సింగ్ పూర్వపు పంజాబ్‌లో, ప్రస్తుత పాకిస్తాన్‌లో ఉన్న లాయల్ జిల్లా బంగా సమీపంలోని ఖత్కర్ కలాన్ గ్రామంలోని సంధు ఝాట్ కుటుంబంలో సర్దార్ కిషన్ సింగ్, విద్యావతి దంపతులకు జన్మించాడు. భగత్ అనే పదానికి "భక్తుడు" అని అర్థం. భగత్ సింగ్ మూడేళ్ళ పిల్లాడిగా ఉన్నప్పుడు తండ్రి కిషన్ సింగ్, భగత్ సింగ్‌ను చంకకెత్తుకొని, కొత్తగా వేస్తున్న తోటను చూడ్డానికి పొలాల్లోకి వెళ్ళాడు. వెంటనే కిందికిదిగిన భగత్‌సింగ్ ఆ మట్టిలో ఆడుకుంటూనే చిన్నచిన్న గడ్డిపరకలను నాటడం మొదలు పెట్టాడు. తండ్రి "ఏం చేస్తున్నావ్ నాన్నా" అని ప్రశ్నిస్తే, భగత్ సింగ్ "తుపాకులు నాటుతున్నా" అని బదులిచ్చాడు. భవిష్యత్తుకు బాల్యం మొలకలు వేసే వయస్సులో తుపాకులను మొలకెత్తించాలని చూడడం ఆయన వ్యక్తిత్వానికి మచ్చుతునక. 13 ఏళ్ల ప్రాయంలోనే మహాత్మా గాంధీ సహాయ నిరాకరణో ద్యమానికి సింగ్ ప్రభావితుడయ్యాడు. ఆ సమయంలో బ్రిటీష్ ప్రభుత్వానికి ఎదురుతిరిగిన భగత్ ప్రభుత్వ పాఠశాల పుస్తకాలు, బ్రిటీషు దిగుమతి దుస్తులను తగులబెట్టడం ద్వారా గాంధీ సిద్ధాంతాలను అనుసరించాడు. లాలాలజ్‌పత్ రాయ్ మరణం, సాండర్స్ హత్యల తరువాత 1928లో భారత్‌లోని వర్ధమాన రాజకీయ పరిస్థితిపై నివేదికను కోరుతూ సర్ జాన్ సైమన్ నేతృత్వంలో బ్రిటీష్ ప్రభుత్వం ఒక కమిషన్‌ను ఏర్పాటుచేసింది. భారత దేశానికి వచ్చిన సైమన్ కమిషన్లో ఒక్క భారతీయుడైనా లేనందుకు నిరసనగా, ఉద్యమంలో లాల్‌జీ కీలక పాత్ర వహించి, సైమన్ కమిషన్‌ను బహిష్కరించాలి అంటూ పంజాబ్ అసెంబ్లీలో ఆయన తీర్మానం పెట్టి గెలిపించారు. ఇది ప్రభుత్వానికి కంటగిం పుగా మారింది.అక్టోబర్ 30, 1928న ఆ కమిషన్ లాహోర్ రాగా, లాల్‌జీ కూడా అహింసతో, మౌనంగా సైమన్ వ్యతిరేక కార్యక్రమాన్ని నిర్వహించారు. మౌనంగా ఉద్యమి స్తున్న వారిపైన కూడా లాఠీ చార్జికి ఆదేశించాడు పోలీసు సూపరింటెం డెంట్ జేమ్స్ ఏ స్కాట్. తను స్వయంగా లాల్‌జీ మీద దాడి చేసి, లాల్‌జీ ఛాతీ మీద లాఠీ తో స్కాట్ తీవ్రంగా కొట్టాడు. ఆ దెబ్బలతోనే లాల్‌జీ నవంబర్ 17న చని పోయారు. ఈ సంఘటనను కళ్లారా చూసిన భగత్ సింగ్ ప్రతీకారం తీర్చు కోవాలని నిర్ణయించు కున్నాడు. పోలీసు అధికారి స్కాట్‌ను హత మార్చడానికి విప్లవకారులు శివరామ్ రాజ్‌గురు, జైగోపాల్, సుఖ్‌దేవ్ థాపర్‌లతో ఆయన చేతులు కలిపాడు. డీఎస్పీ జే. పీ. సాండర్స్ కనిపించినప్పుడు పొర పాటుగా స్కాట్ అనుకుని, జైగో పాల్ ఆయన్ను కాల్చమంటూ సింగ్‌కు సంకేతాలిచ్చాడు. ఫలితం గా స్కాట్‌కు బదులు సాండర్స్ హతమయ్యాడు. ఫిరోజ్ పూర్లో బ్రిటిష్ పోలీసు అధికారి జె.పి.సాండర్స్ ను హత మార్చి నందుకు గాను వారికి 1930లో అక్టోబర్ 7వ తేదీని ఈ మరణ శిక్షను ఖరారు చేశారు. భగత్ సింగ్ సహా ముగ్గురికి ఉరిశిక్ష ఖరారు చేసిన తీర్పు వివరాలను 2015లో ప్రచురించారు. ఝుతీతీఝుత్ శీట జుఇవఏబ్అశీఅ ాఅ ావత్వఅఎవ ాట ఐమ్ఫ్త్ర అనే విడుదల చేసిన పత్రంలో 1930 అక్టోబర్ 7వ తేదీన ఉరిశిక్ష విధిస్తూ తీర్పిచ్చినట్లు స్పష్టంగా ఉంది. 1931, మార్చి 23న ఉరిశిక్ష అమలు చేసినట్లు మరో పత్రంలో వివరాలు ఉన్నాయి. జైలు సూపరింటెండెంట్ సంతకం చేసిన పేపర్‌ను టైమ్స్ ఫ్యాక్ట్ చెక్ గుర్తించి బహిర్గతం చేసి, లాహోర్ లోని పంజాబ్ శాఖలో ఈ పత్రాలను ఇటీవల ప్రదర్శనకు ఉంచారు. 1930 అక్టోబర్ 7 న న్యాయస్థానము తీర్పును వెలువరించింది. తీర్పు 281 పేజీల్లో ఇవ్వబడింది. విచారణ ఎదుర్కొన్న వారందరికీ ఇలా శిక్షలు ఇవ్వబడ్డాయి. ఉరిశిక్ష: 1.భగత్ సింహ్ 2. సుఖఃదేవ్ 3. రాజగురులకుబీ అలాగే ఆజన్మాంతర జీవిత ఖైదు: 1.కిశోరీలాల్ 2. మహావీర్ సింహ్ (అండమాన్లో 9 రోజులు నిరాహార దీక్ష చేసి అమరుడయ్యాడు. 3. విజయ్ కుమార్ సింహ్ 4. శివవర్మ 5. గయా ప్రసాద్ 6. జయదేవ్ కపూర్ 7. కమల్నాథ్ తివారిలకుబీ అలాగే జీవిత ఖైదు: 1.కుందాన్లాల్ ( 7 సంవత్సరాలు) 2. ప్రేమదత్ ( 5 సంవత్సరాలు)లకుబీ అలాగే అజయ్ ఘోష్, సురేంద్రనాథ్ పాండియ ఇంకా జితేంద్రనాథ్ సన్యాల్‌లను విడిచిపెట్టారు. విచారణలో ఉన్నవారందరూ కోర్టులను బహిష్కరించడం వలన తీర్పును లాహోర్ లోని సెంట్రల్ జైలు లో వినిపించారు. తమను యుద్ధ ఖైదీలుగా గుర్తించడం ద్వారా ఉరి తీయ కుండా కాల్పుల బృందం చేత హతమార్చాలని జైలులో ఉన్నప్పుడు భగత్ సింగ్, మరో ఇద్దరు వైస్రాయికి లేఖ రాశారు. క్షమాభిక్ష ముసాయిదా లేఖపై సంతంకం కోసం భగత్ సింగ్ మిత్రుడు ప్రన్నత్ మెహతా ఆయన్ను ఉరితీయడానికి నాలుగు రోజుల ముందు మార్చి 20న జైలులో కలిశాడు. అయితే సంతకం చేయడానికి సింగ్ నిరాకరించాడు. మార్చి 23న ఉరితీసినట్లు జైలు అధికారులు మరణ ధ్రువీకరణ పత్రాన్ని విడుదల చేశారు. అప్పటి సూపరింటిండెంట్ ఆఫ్ పోలీస్ వి.ఎన్. స్మిత్ ప్రకారం, భగత్ సింగ్‌ను ముందుగానే ఉరితీశారు. సాధారణంగా ఉదయం 8 గంటలకు ఉరితీసేవారు. అయితే ఏమి జరిగిందో ప్రజలు తెలుసుకునే లోగానే ఆయన్ను ఉరితీయాలని నిర్ణయించుకుని..సుమారు రాత్రి 7 గంటల ప్రాంతంలో ఉరి తీశారు. భగత్ సింగ్ వీర మరణం వృథా కాలేదు, ఎందరో యువకులను భారత స్వాతంత్ర్యోద్యమము వైపుకు మరల్చింది.భగత్ సింగ్ మరణం భారత స్వాతంత్ర్యోద్యమ కొనసాగింపుకు సాయపడేలా వేలాది మంది యువకుల్లో స్ఫూర్తిని నింపింది. ఆయన ఉరి అనంతరం ఉత్తర భారతాన పలు ప్రాంతాల్లో బ్రిటీష్ ప్రభుత్వమునకు వ్యతిరేకంగా నిరసన ప్రదర్శనలు వెల్లువెత్తాయి.

## మానవ సేవలో శాస్త్ర సాంకేతిక పాత్ర

నేడు ప్రపంచవ్యాప్తంగా 75వ 'ప్రపంచ వాతావరణ శాస్త్ర సంస్థ' అవతరణ దినోత్సవం ఘనంగా నిర్వహించుకుంటున్న వేళ 2025 ఏడాదిని "ముందస్తు హెచ్చరికల వాతావరణశాస్త్ర సాంకేతికతలో గ్యాప్‌లను తగ్గించడం" అనే ఇతివృత్తం తీసుకొని ప్రచారం చేయడం జరుగుతున్నాయి. తీవ్రమైన ప్రమాదకర వాతావరణ పరిస్థితులు ముందస్తు తెలుసుకోవడం వల్ల జరగనున్న ఆస్తి ప్రాణ నష్టాలను తగ్గించడానికి మానవాళికి సరైన సమయం దొరకడం, సష్ట నివారణ చర్యలు తీసుకోవడం జరుగుతూ వస్తున్నది. వాతావరణ హెచ్చరికల రంగంలో వస్తున్న నూతన విప్లవాత్మక మార్పులను స్వాగతిస్తూ, మరింత ముందంజ వేయడానికి ప్రతి ఏట 23 మార్చిన "ప్రపంచ వాతావరణ శాస్త్ర దినోత్సవం" లేదా "వరల్డ్ మెటీరియొలాజికల్ డే" నిర్వహించడం ఆనవాయితీగా మారింది. హరికేన్లు, అకాల వర్షాలు, కరువుకాటకాలు, మండుటెండలు, తుఫాన్లు, తీవ్రమైన గాలుల లాంటి వాతావరణ ప్రతికూల పరిస్థితులను ముందుగానే ఖచ్చితమైన అంచనాలతో పసిగట్టడంతో పాటు ఆయా ప్రాంతాల ప్రభుత్వాలు, ప్రజలను ముందస్తు హెచ్చరించడం నిరంతరం కొనసాగడానికి నవ్య వాతావరణ శాస్త్ర సాంకేతికతలు, ఏఐ టెక్నాలజీలను వినియోగించడం నేటి మానవాళికి వరంగా మారింది. గతంలో రేడియో లేదా ప్రభుత్వ యంత్రాంగాల ద్వారా వాతావరణ ప్రతికూలాల హెచ్చరికలు జరుగుతూ ఉండేవి. నేటి డిజిటల్ యుగంలో క్షణాల్లో హెచ్చరికల వార్తలు ప్రజల ముంగిట్లో ప్రత్యక్షం కావడంతో నష్ట నివారణ విజయవంతంగా జరుగుతున్నది. 2025 ప్రపంచ వాతావరణ శాస్త్ర దినోత్సవం ఇతివృత్తంగా "అన్ని కాలాలకు, అన్ని వర్గాల ప్రజలకు కొలతలు" అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం చేయడం జరుగుతున్నది. 'మీటర్ కన్వెన్షన్' ఏర్పడి నేడు 150వ వార్షికోత్సవం జరుపుకుంటున్న వేళ ఈ ఇతివృత్తం అధిక ప్రాధాన్యతను సంచరించుకున్నది. నేడు పర్యావరణ కాలుష్యం కోరలు చాస్తున్న వేళ అకాల వర్ష వడగళ్లు, తీవ్రమైన రువుకాటకాలు, ఆకస్మిక పెను తుఫాన్లు మంచు వర్షాలు, అడవుల్లో కార్చిచ్చులు, అపరిమిత ఉష్ణోగ్రతలు లాంటి వాతావరణ మార్పులను ముందుగానే పసిగట్టి ప్రజలను చైతన్య పరచడం జరుగుతోంది. ప్రజల ప్రాణాలు కాపాడడం, జీవనోపాధులను పరిరక్షించడం, పౌరసమాజాన్ని అన్ని వేళ్ల జాగరూకతతో ఉంచడం, అత్యవసర సేవలను సిద్ధం చేయడం, విపత్తు నివారణ విభాగాలను సర్వ వేళల్లో సిద్ధంగా ఉంచడంలో ముందస్తు వాతావరణ హెచ్చరికలు తోడ్పడుతున్నాయి. నేటి ప్రపంచ దేశాల్లో దాదాపు 108 దేశాలు ఆధునిక వాతావరణ శాస్త్ర సాంకేతికతలను వినియోగిస్తున్నప్పటికీ అల్పాదాయ దేశాల్లో నేటికీ పరిస్థితులు భిన్నంగానే ఉన్నాయి. గత కొన్ని ఏళ్లలో దాదాపు 39 శాతం వరకు ముందస్తు హెచ్చరికల వ్యవస్థల్లో అభివృద్ధి సాఘధించడం గమనార్హం. నేటి విపరీత పరిస్థితుల్లో వాతావరణ ప్రతికూల మార్పులు, తీవ్రమైన వాతావరణ ప్రతిచర్యలకు సమాధానంగా ప్రపంచ దేశాలు ప్రభుత్వాలు, వాతావరణ శాస్త్ర అత్యాధునిక పరిశోధనా సంస్థలు, వాతావరణ శాస్త్ర విభాగాలను పదును పెట్టాల్సిన సమయం ఆసన్నమైందని తెలుసుకోవాలి. వాతావరణ ప్రతికూల మార్పుల వెనుక దాగి ఉన్న కారణాలతో పాటు వాటిని ప్రతిఘటించడం, ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండడం, కనిష్ట నష్టాలను నమోదు చేసుకోవడం లాంటి అంశాలకు అవగాహన పర్చుకోవడానికి ప్రతి ఒక్కరు ప్రాధాన్యం ఇవ్వాలి. వాతావరణ విధ్వంసాలను అరికట్టడానికి కార్బన్ ఉద్గారకాలను తగ్గించడం, మొక్కలు నాటడం, పర్యావరణ హిత పాలసీల అమలు, పర్యావరణ పరిరక్షణ ప్రయత్నాలు, అవగాహనలు కొనసాగుతూనే ఉండాలి. ప్రభుత్వ వాతావరణ శాస్త్ర విభాగం ద్వారా వాతావరణ హెచ్చరికలు, తుఫాన్ల ముందస్తు అంచనాలు, విపత్తు నివారణ వ్యవస్థల నిర్వహణలు, భూకంపాల తీవ్రత హెచ్చరికలు, పరిశోధనల్లో ముందడుగులు, సమాచార గణాంకాల విశ్లేషణలు, సముద్ర వైమానిక తోడ్పాట్లు, ప్రజా చైతన్యాలు నిరంతరం జరిగితేనే ప్రపంచ మానవాళి సురక్ష జరుగుతుందని తెలుసుకుందాం.

# అమర వీరులు త్యాగాలు

ఎందరో స్వాతంత్ర్య సమరయోధులు, అందరికీ వందనాలు. 1858 నుంచి 1947 వరకు బ్రిటీష్ వన్య పాలకుల పాలనలో ఎందరో మహానుభావులు స్వేచ్ఛ కోసం పిడికిలి బిగించి పోరాడి తుదకు ప్రాణాలు సహితం అర్పించారు. భరతమాత దాస్య శృంఖలాలను ఛేదించి స్వేచ్ఛను సమకూర్చే మహాయజ్ఞంలో ప్రాణాలర్పించిన నిస్వార్థ దేశ భక్తులు ఎందరో. అలాంటి అమరుల జాబితాలో మహాత్మాగాంధీతో మొదలు అసంఖ్యాక యోధులు ఎనలేని పోరాట పటిమ ప్రదర్శించి తెల్ల తోలు పాలకుల గుణడెల్లో గుబులు పుట్టించారు. ఆ జాబితాలో అమరులైన ప్రముఖులుగా భగత్ సింగ్, సుఖ్‌దేవ్, రాజ్‌గురు యువ త్రయం ముందు వరుసలో ఉంటారు. 23 మార్చి 1931న అపర దేశ భక్తులు భగత్ సింగ్, సుఖ్‌దేవ్, రాజ్ గురు త్రయం దేశ సేవలో తమ ప్రాణాలను తృణప్రాయంగా అర్పించిన స్వాతంత్ర్య సమర యోధులను ఉరికంబం ఎక్కించిన రోజుగా దేశ స్వాతంత్ర్య పోరాట చరిత్రలో చెరగని ముద్రను వేసింది. 23 మార్చి షహీదా దివస్ లేదా అమరుల దినంతో పాటు ఇతర భరతమాత ముద్దు బిడ్డలు ప్రాణాలర్పించిన 30 జనవరిని మహాత్మాగాంధి వర్ధంతి, మే 19న అస్సాం అమరవీరుల దినం, 13 జూలైన కాశ్మీర్ అమరవీరుల దినం, 21 అక్టోబర్‌న పోలీస్ అమరవీరుల దినం, 17 నవంబర్‌న ఒరిస్సాలో లాలా లజపతిరాయి రాయ్ వర్ధంతి, 19 నవంబర్‌న ఝూన్సీ లక్ష్మీభాయ్ జన్మదినం, 24 నవంబర్‌న సిక్కు గురు తేగ్ బహదూర్ వర్ధంతి లాంటి పలు అమరవీరుల జ్ఞాపకార్థ కార్యక్రమాలు నిర్వహించడం భారత దేశవ్యాప్తంగా జరుగుతున్నది. దేశభక్తిని నరనరాన జీర్ణించుకున్న యువకులు భగత్ సింగ్, సుఖ్‌దేవ్ తాపర్, శివరామ్ రాజ్‌గురు త్రయం "హిందుస్థాన్ సోషలిస్టు రిపబ్లికన్ అసోసియేషన్ సభ్యులుగా స్వాతంత్ర్య ఉద్యమ కెరటాల వలె ఎగిసిపడి బ్రిటీష్ పాలనను వ్యతిరేకిస్తూ యువ విప్లవ జ్యోతులుగా వెలుగొందారు. లాలా లజపతిరాయి మరణానికి స్పందనగా నాటి బ్రిటీష్ అధికారి జె పి సార్స్‌ను చంపారనే అభియోగాల మీద ఈ ముగ్గురు యువకులను అరెస్టు చేసి "లాహోర్ కాన్స్పరసీ కేసు"ను కొనసాగించిన బ్రిటీష్ వలస పాలకులు ఈ యువ త్రయానికి ఉరి శిక్ష విధించడం జరిగింది. అంతర్జాతీయ పౌర సమాజం క్షమాభిక్ష పెట్టాలని వేడుకున్నప్పటికీ కక్ష పూరితంగా వలస పాలకులు 23 మార్చి 1931న ఈ ముగ్గురిని ఉరి తీయడం జరిగింది. భగత్ సింగ్ త్రయం 08 ఏప్రిల్ 1929న ఇంక్విలాబ్ జిందాబాద్? అని నినదిస్తూ సెంట్రల్ లెజిస్లేటివ్ అసెంబ్లీపై బాంబులు విసరడంతో కేసును నమోదు చేసి లాహోర్ జైల్‌లో ఉరి శిక్ష అమలు చేసారు. దేశవాసుల అశ్రునయనాల మధ్య వారి పార్థివ దేహాలను సుత్లజ్ నదీ తీరాన దహన సంస్కారాలునచేయడం జరిగింది. ఈ ముగ్గురు అగ్గి రవ్వలు చూపిన తెగువ, దేశభక్తి, అంకితభావం, త్యాగగుణం, ధైర్య సాహసాలు నేటి భారతీయ యువతకు దారి దీపాలుగా నిలుస్తున్నాయి. వారి త్యాగాలను గుర్తు చేసుకుంటూ, వారు అందించిన స్వాతంత్ర్యాన్ని భాధ్యతాయుతంగా అనుభవిస్తూ దేశ అభ్యున్నతికి సమిధలుగా మారాలని కోరుకుందాం. భగత్ సింగ్, సుఖ్‌దేవ్, రాజ్‌గురుల త్యాగాలను గుర్తు చేసుకుంటూ 23 మార్చిన వారి చిత్రపటాలకు నివాళులు అర్పించడం, విద్యాలయాల్లో అవగాహనలు, ప్రజలను చైతన్యపరచడం, దేశభక్తి కేంద్రంగా ర్యాలీలు నిర్వహించడం, వారి జీవిత చరిత్రకు సంబంధించిన సినిమాల ప్రదర్శనలు, రక్తదాన శిబిరాలు, క్యాండిల్ లైట్ ర్యాలీలు, కవితా పోటీలు లాంటి కార్యక్రమాలను నిర్వహించి వారి రుణం తీర్చుకుందాం. మహానుభావుల త్యాగాలకు ప్రతిఫలం ఈ స్వతంత్రం, మన కర్తవ్యాలను నిర్వహిద్దాం. స్వేచ్ఛ ఉచితంగా రాలేదు, ప్రాణ త్యాగం చేసిన వారికి సదా రుణపడి ఉందాం. అమరవీరులా ఎన్నడు మన హృదయాల్లో జీవించే ఉంటారు. నేటి యువభారతానికి ఉజ్వల యువ కెరటాలైన భగత్ సింగ్, సుఖ్‌దేవ్, రాజ్‌గురు త్రయానికి ఘన నివాళులు అర్పిద్దాం.

## రాధా... రాం...రాం..

విజయవాడ, మార్చి 22, వంగవీటి రాధా.. ఈ పేరు ఉమ్మడి కృష్ణా, గుంటూరు, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో చాలా ఫేమస్. అందుకు కారణం ఆయన తండ్రి రంగా. కాపుల కోసం ఎన్నో ఉద్యమాలు చేసిన రంగా.. దారుణ హత్యకు గురయ్యారు. ఆ తర్వాత రాజకీయాల్లోకి వచ్చిన రాధా.. ఒక్కసారి ఎమ్మెల్యే అయ్యారు. ఆ తర్వాత ఏ పదవీ రాలేదు.ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లోనే రాజకీయ రాజధాని విజయవాడ. అలాంటి బెజవాడలో రాజకీయంగా చక్రం తిప్పింది వంగవీటి కుటుంబం. వంగవీటి రాధా (రంగా సొదరుడు) హత్య తర్వాత విజయవాడ రాజకీయం పూర్తిగా మారిపోయింది. రంగా ప్రవేశంతో వేడెక్కింది. 1985లో రంగా కాంగ్రెస్ పార్టీ తరఫున ఎమ్మెల్యే అయ్యారు. ఆ తర్వాత జరిగిన పరిణామాల నేపథ్యంలో.. రంగా జైలుకు వెళ్లాల్సి వచ్చింది. రంగా జైల్లో ఉండగానే.. 1988 జులై 10న జరిగిన కాపునాడు సభలో ఆయనను తమ నాయకుడిగా ఎన్నుకున్నారు. ఆ తర్వాత జైలు నుంచి విడుదలైన రంగా.. జనచైతన్య యాత్ర చేసి ఎన్.టి.రామారావు ప్రభుత్వ విధానాలను ఎండగట్టారు. పోలీసులు ఆధిపత్యం చెలాయిస్తున్నారని పోరాడారు. పేదల కోసం, బలహీన వర్గాల కోసం ఆయన అనేక ఉద్యమాలు చేశారు. విజయవాడలోని గిరిపురంలోని పేదల ఇళ్ల పట్టాల కోసం ఆయన నిరాహార దీక్ష చేశారు. కాపు సామాజిక వర్గాన్ని ఏకతాటిపైకి తెచ్చేందుకు ప్రయత్నించారు.1988 డిసెంబర్ 26న పేదల ఇళ్ల పట్టాల కోసం నిరాహార దీక్ష చేస్తున్న రంగాను.. ప్రత్యర్థులు దారుణంగా హత్య చేశారు. ఆయన హత్య తర్వాత కోస్తాంధ్రలో పెద్ద ఎత్తున హింస చెలరేగింది. కేసులు, అరెస్టులు, గొడవలు, ధర్నాలు జరిగాయి. చాలా రోజుల తర్వాత రంగా కుమారుడు రాధా రాజకీయ రంగప్రవేశం చేశారు. 2004లో ఎమ్మెల్యేగా విజయం సాధించారు. ఆ తర్వాత చిరంజీవి స్థాపించిన ప్రజారాజ్యం పార్టీలో చేరారు2009లో విజయం దక్కలేదు. ఆ తర్వాత కొన్నాళ్లకు జగన్ సారథ్యంలోని వైసీపీలో చేరారు వంగవీటి రాధా. 2014లోనూ అదృష్టం వరించలేదు. 2019 ఎన్నికలకు ముందు టీడీపీలో చేరారు. అప్పుడు ఎక్కడా పోటీ చేయలేదు. పార్టీ అధికారంలోకి వస్తే.. ఎమ్మెల్సీ పదవి ఇస్తారని ప్రచారం జరిగింది. కానీ.. టీడీపీ అధికారంలోకి రాలేదు. ఎమ్మెల్సీ పదవి ఇవ్వలేదు. 2019 నుంచి 2024 వరకూ ఆయన తెలుగుదేశం పార్టీలోనే కొనసాగారు.2024 అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఎక్కడా పోటీ చేయలేదు. కానీ.. పార్టీకోసం ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల్లోని పలు నియోజకవర్గాల్లో ప్రచారం చేశారు. ముఖ్యంగా కాపులు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో రాధా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కూటమి అధికారంలోకి వచ్చింది. ఇక రాధాకు పదవీ ఖాయం అని ఆయన అనుచరులు అనుకున్నారు. మొదటి నామినేటెడ్ పోస్టు వస్తుందని ఆశించారు. రాలేదు.ఆ తర్వాత రాజ్యసభకు పంపుతారనే ప్రచారం జరిగింది. అదీ కుదరలేదు. ఇక ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో రాధాకు ఎమ్మెల్యే కోటాలో అవకాశం వస్తుందని ఊహించారు. అదీ జరగలేదు. దీంతో ఆయన అనుచరులు.. తీవ్ర అసంతృప్తితో ఉన్నారనే టాక్ ఉంది. ఇన్నాళ్లుగా ఏ పదవి లేదని.. ఇప్పుడు అధికారంలో ఉన్నా.. ఎందుకు ఇవ్వడం లేదని రాధా అనుచరులు ప్రశ్నిస్తున్నారు.అటు రాధా కూడా ఆయనకు కనీస గౌరవం దక్కలేదని, తన సేవలను గుర్తించలేదని తీవ్ర అసంతృప్తికి లోనవుతున్నట్లుగా తెలుస్తోంది. దీంతో ఏ పార్టీలోకి వెళ్లినా ఇదే పరిస్థితి ఉంటుందని భావించిన రాధా.. రాజకీయాలకు పూర్తిగా గుడ్ బై చెప్పే యోచనలో ఉన్నారని ప్రచారం జరుగుతోంది. ఈ మధ్య రంగా, రాధా మిత్రమండలి సమావేశంలో కూడా తీవ్ర నైరాశ్యంతో మాట్లాడినట్టు సోషల్ మీడియాలో పోస్టులు వచ్చాయి. దీంతో ఆయన రాజకీయాలకు గుడ్ బై చెప్పే ఆలోచనలో ఉన్నారనే వార్తలు చక్కర్లు కొడుతున్నాయి.. 'రాధా రాజకీయాలకు ఎందుకు గుడ్ బై చెప్తారు.. అలాంటిది ఏం లేదు. ఆయన చాలా కంఫర్ట్‌గా ఉన్నారు. రాధాకు ఎప్పుడు ఏ పదవి ఇవ్వాలో పార్టీ నిర్ణయిస్తుంది. అప్పటివరకు ఓపికగా ఉంటాం. కొందరు కావాలని తప్పుడు చేస్తున్నారు. రాధా రాజకీయాల్లోనే ఉంటారు. ఆ మధ్య కాస్త అనారోగ్య సమస్యల వల్ల యాక్టివ్‌గా లేరంతే' అని రాధా మిత్రుడు చెప్పారు.

## చెరువుల తవ్వకాలకు బ్రేక్...

కాకినాడ, మార్చి 22, ఒకప్పుడు ఆహ్లాదకరమైన సువిశాల సాగర తీరం ఉండేది. సునామీ, తుపాన్లు వంటి విపత్తుల నుంచి కాపాడేలా ఇసుక తెన్నెలు పుష్కలంగా కనపడేవి. కానీ ఇప్పుడు కనుచూపు మేరలో చెరువులే కనిపిస్తున్నాయి. తీరం వెంబడి పచ్చని గోడలా సరుగుడు తోటలతో గ్రీన్ బెల్ట్ ఉండేది. కానీ ఇప్పుడు మొత్తం ఆక్వా కాలుష్యంతో నిండిపోయింది. ఏకంగా సముద్రానికి ఆనుకుని మరీ చెరువులు తవ్వేయడం ఆందోళనకరంగా మారింది. ఈ అక్రమ కార్యకలాపాల వల్లనే సముద్రకోతకు గురి అవుతోంది. సీఆర్‌జడ్ పరిధి నానాటికీ ముందుకు చొచ్చుకు వచ్చే పరిస్థితి ఉత్పన్నమైంది. విచిత్రమేంటంటే సీఆర్‌జడ్ పరిధిలోకి వచ్చే ఈ ఆక్వా చెరువులకు ఎటువంటి అనుమతులు లేవు. అయినా ప్రభుత్వం అందించే సబ్సిడీ విద్యుత్తు సరఫరా పుష్కలంగా లభిస్తోంది. ఆక్వా చెరువుల దందాపై కొందరు జాతీయ గ్రీన్ ట్రైబ్యునల్‌ను ఆశ్రయించారు. దీంతో గ్రీన్ ట్రైబ్యునల్ సభ్యులు అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండల పరిధిలోని అంతర్వేదిలో పర్యటించారు. స్వయంగా అక్కడ జరిగే అక్రమాలను సభ్యులు పరిశీలించారు. తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. తీరం వెంబడి అక్రమంగా తవ్వేసిన ఆక్వా చెరువులను ధ్వంసం చేసి పూడ్చాలని ఆదేశించారు. లేకుంటే స్థానిక అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. స్పందించిన జిల్లా యంత్రాంగం ఆదిశగా చర్యలకు ఉపక్రమించింది.ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో అంతర్వేది నుంచి తుని మండలం అద్దరిపేట వరకు సముద్ర తీరం విస్తరించి ఉంది. ఇందులో అంబేడ్కర్ కోనసీమ జిల్లావ్యాప్తంగా విస్తరించి ఉన్న సముద్రతీరం వెంబడి విచ్చలవిడిగా చెరువులు తవ్వకాలు చేసి ఆక్వాసాగు చేస్తున్నారు. ప్రధానంగా అంతర్వేది గ్రామ పరిధిలో తీరప్రాంతం మొత్తం ఆక్వాసాగుగా మారిపోయింది. ఈ చర్యల వల్ల భారీగా తీరం కోతకు గురవుతోంది. ఈ అక్రమ ఆక్వా చెరువులపై జిల్లా అధికారులకు ఎన్నోసార్లు ప్రజలు ఫిర్యాదు చేశారు. చెరువులు ధ్వంసం చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రయోజం లేకపోవడంతో రాజోలు ప్రాంతానికి చెందిన ఎన్‌ఆర్‌ఐ యనుమల రాజా గ్రీన్ ట్రైబ్యునల్‌లో పిటిషన్ వేశారు. హైకోర్టును కూడా ఆశ్రయించారు.

# విశాఖపట్టణం కోసం మాస్టర్ ప్లాన్

విశాఖపట్టణం, మార్చి 22, విశాఖపట్నం.. వేగంగా అభివృద్ధి చెందే నగరం. అందుకే ప్రభుత్వం వైజాగ్‌పై స్పెషల్ ఫోకస్ పెట్టింది. తాజాగా మంత్రి నారాయణ విశాఖ కొత్త మాస్టర్ ప్లాన్‌పై రివ్యూ చేశారు. ఈ సందర్భంగా కీలక నిర్ణయం తీసుకున్నారు. 4 నెలల్లో కొత్త మాస్టర్ ప్లాన్ రూపొందించనున్నట్టు స్పష్టం చేశారు.నాలుగు నెలల్లో విశాఖపట్నం మహా నగరపాలక సంస్థ కొత్త మాస్టర్ ప్లాన్ తయారు చేస్తామని.. పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ వెల్లడించారు. విశాఖ కొత్త మాస్టర్ ప్లాన్‌పై సచివాలయంలో ఆయన అధికారులు, విశాఖపట్నం ఎమ్మెల్యేలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మీడియాతో మాట్లాడారు.

'మే నెలాఖరులోగా విశాఖపట్నం మెట్రో రైలు టెండర్లు పూర్తి చేయాలని నిర్ణయించాం. ఫైనాన్షియల్ సిటీ విశాఖ మాస్టర్ ప్లాన్‌పై సమీక్ష నిర్వహించాం. ప్రజలు, నేతల అభిప్రాయాలతో నాలుగు నెలల్లో కొత్త మాస్టర్ ప్లాన్ రూపొందిస్తాం. విశాఖ మెట్రో రైల్‌పైనా సమావేశంలో చర్చించాం. టీడీఆర్ బాండ్ల విషయంలో గతంలో అక్రమాలు జరిగాయి. విశాఖలో 600కు పైగా టీడీఆర్ బాండ్లు పెండింగ్‌లో ఉన్నాయి. వీటిని విశాఖ కలెక్టర్ త్వరగా క్లియర్ చేయాలని ఆదేశించాం. భోగాపురం విమానాశ్రయానికి ఇబ్బంది లేకుండా రోడ్లు ఏర్పాటు చేస్తాం. వైసీపీ హయాంలో మాస్టర్ ప్లాన్‌కు విరుద్ధంగా డీవియేషన్ జరిగింది' మంత్రి నారాయణ ఆరోపించారు.

6 ముఖ్యమైన అంశాలు..

1.విశాఖపట్నం అభివృద్ధికి వీఎంఆర్‌డీఏ కొత్త విజన్‌ను రూపొందించింది.

2.విశాఖపట్నంలో ట్రాఫిక్ సమస్యను తగ్గించడానికి కొత్త మాస్టర్ ప్లాన్‌ను రూపొందిస్తున్నారు.

3.విశాఖపట్నం, విజయనగరం జిల్లాలకు చెందిన ఎమ్మెల్యేలు ఇటీవల అసెంబ్లీలో రోడ్ల అభివృద్ధి గురించి ప్రశ్నలు వేశారు.

4.విశాఖపట్నం మాస్టర్ ప్లాన్‌లో అవకతవకలు జరిగాయని, 4 నెలల్లో కొత్త మాస్టర్ ప్లాన్ రెడీ చేస్తామని మంత్రి నారాయణ చెప్పారు.

5.విశాఖపట్నం మహా నగర ప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ) రూపొందించి, అమలు చేస్తున్న మాస్టర్ ప్లాన్-2041పై కొత్త ప్రభుత్వం దృష్టిసారించింది.

6.విశాఖపట్నం, భీమునిపట్నం, భోగాపురం, విజయనగరం, అనకాపల్లి, అచ్యుతాపురం తదితర ప్రాంతాల్లో వందలాది ఎకరాలు కొనుగోలు చేసిన వైసీపీ నేతలు వాటికి భవిష్యత్తులో మేలు జరిగేలా మాస్టర్ ప్లాన్‌ను మార్చుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

విశాఖ అభివృద్ధికి ఏం చేయాలి..

మెరుగైన రహదారులు, వంతెనలు, ప్రజా రవాణా వ్యవస్థను నిర్మించాలి. నీటి సరఫరా, మురుగునీటి పారుదల, విద్యుత్ వంటి ప్రాథమిక సదుపాయాలను మెరుగుపరచాలి. విమానాశ్రయం, ఓడరేవులను విస్తరించాలి. ఐటీ, ఫార్మాస్యూటికల్స్, పర్యాటక రంగాలను అభివృద్ధి చేయడానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. చిన్న, మధ్య తరహా పరిశ్రమలను ప్రోత్సహించడానికి రాయితీలు, ప్రోత్సాహకాలు అందించాలి. విశాఖపట్నాన్ని ఒక ఆర్థిక కేంద్రంగా అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకోవాలి.

ప్రోత్సాహం ఇవ్వాలి..

విశాఖపట్నం సహజ అందాలను, చారిత్రక ప్రదేశాలను ప్రోత్సహించడానికి చర్యలు తీసుకోవాలి. పర్యాటకుల కోసం మెరుగైన వసతి, రవాణా సౌకర్యాలు కల్పించాలి. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడానికి నైపుణ్యాభివృద్ధి శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేయాలి. విశ్వవిద్యాలయాలు, కళాశాలల్లో పరిశోధన, అభివృద్ధిని ప్రోత్సహించాలి. కాలుష్యాన్ని తగ్గించడానికి, పర్యావరణాన్ని పరిరక్షించడానికి చర్యలు తీసుకోవాలి. చెట్లు నాటడం, పచ్చదనాన్ని పెంచడం వంటి కార్యక్రమాలు చేపట్టాలి. అప్పుడు విశాఖ తొందరగా అభివృద్ధి చెందుతుందని నిపుణులు చెబుతున్నారు.

# టీడీపీ గూటికి రాపాక

విజయవాడ, మార్చి 22, జనసేన పార్టీ తొలి ఎమ్మెల్యేగా నెగ్గి తెలుగు రాష్ట్రాల్లో ఒక్కసారిగా గుర్తింపు పొందిన రాజోలు మాజీ ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు ప్రస్తుతం దారెటు..? ఆయన ఏ పార్టీ వైపు చూస్తున్నారు. ఇప్పుడు కోనసీమలో ఇదే చర్చ జరుగుతోంది. ఎందుకంటే ఆయన కదలికలు గమనిస్తున్న పలువురు ఆయన టీడీపీ నాయకులతో టచ్‌లో ఉన్నారననే టాక్ ఆసక్తిగా మారింది. రాజోలు నియోజకవర్గంలో టీడీపీకి సరైన నాయకుడు లేకపోవడం ఈ ప్రచారనికి మరో కారణంగా కనిపిస్తోంది. రాజోలులో వ్యక్తిగత ఓటు బ్యాంకు కలిగిన నాయకునిగా గుర్తింపు ఉన్న రాపాక వరప్రసాదరావుకు ఇప్పుడు ఇదే అంశం కలిసొచ్చే అవకాశాలున్నాయని పొలిటికల్ సర్కిల్‌లో చర్చ జరుగుతోంది. రాజోలు నియోజకవర్గంలో టీడీపీ ఇంచార్జ్‌గా ఉన్న గొల్లపల్లి సూర్యారావు మొన్నటి సాధారణ ఎన్నికలకు ముందు టీడీపీకి షాకు ఇచ్చి వైసీపీలో చేరి టిక్కెట్టు దక్కించుకున్నారు. 2019 ఎన్నికల్లో రాష్ట్రంలో జనసేన పార్టీకి ఏకైన ఎమ్మెల్యేగా గెలుపొందిన రాపాక జనసేనకు షాక్ ఇచ్చి వైసీపీలో గూటికి చేరారు. 2024లో వైసీపీ టికెట్టు తనదే అనుకున్న సమయంలో ఎన్నికలకు ముందు వైసీపీలో చేరిన గొల్లపల్లికి అసెంబ్లీ టికెట్టు ఇచ్చి రాపాకకు వైసీపీ షాక్ ఇచ్చింది. అయితే అమలాపురం ఎంపీ టికెట్టు ఇచ్చినా అయిష్టతతోనే ఆయన పోటీలో ఉండాల్సిన పరిస్థితి తలెత్తింది. ఎన్నికల అనంతరం ఆయన జగన్‌పై తీవ్ర విమర్శలు చేస్తూ వైసీపీకు గుడ్‌బై చెప్పారు. గొల్లపల్లి వైసీపీకి వెళ్లిపోవడంతో అప్పటి నుంచి రాజోలులో టీడీపీకి నాయకుడు లేడు. ఇప్పుడు రాపాక చూపులు టీడీపీ వైపు పడటం వెనుక కారణమిదే అంటున్నారు. రాజోలులో టీడీపీకి ఇంచార్జ్ లేకపోవడం రాపాకకు కలిసొచ్చే అంశమని, రాపాక రాకకు మార్గం సుగమం అవుతుందంటున్నారు. మొన్నటి సాధరణ ఎన్నికల తరువాత వైసీపీకి గుడ్‌బై చెప్పిన రాపాక వరప్రసాదరావు టీడీపీ కీలక నేతలతో టచ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ మధ్య కాలంలో రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, యనమల రామకృష్ణుడు, ఎమ్మెల్యేలు నిమ్మకాయల చినరాజప్ప, గోరంట్ల బుచ్చయ్య చౌదరి, ఆదిరెడ్డి వాసు తదితరులను కలిసినట్లు టాక్. ప్రస్తుతం రాపాక ఎటూ వెళ్లక సైలెంట్‌గా ఉన్నా కూడా ఆయన మాత్రం టీడీపీలోకి చేరేందుకు అన్ని ప్రయత్నాలను ముమ్మరం చేస్తున్నారని మాత్రం స్థానికంగా తీవ్రంగా చర్చజరుగుతోంది.. టీడీపీలోకి రాపాక రాకను జనసేన ఓకే చెబుతుందా లేకుంటే వ్యతిరేకిస్తుందా అనేది మాత్రం క్లారిటీ లేదు. గెలిచిన వ్యక్తికి సరైన ప్రాధాన్యత ఇస్తే వెళ్లిపోవడంతో ఆయనపై జనసేన చాలా కోపంతో ఉంది. ఇప్పుడు అలాంటి వ్యక్తిని టీడీపీలోకి చేరనిస్తారా అనేది తేలాల్సిన అంశం. కూటమి పార్టీల్లో నాయకుల చేరికలు పరస్పర అంగీకారంతోనే సాగుతున్నాయనే టాక్ ఒకటి ఉంది. అందుకే చాలా మంది వైసీపీ నేతలు వివిధ పార్టీల్లో చేరేందుకు సిద్ధంగా ఉన్నప్పటి మిత్ర పక్షాల నుంచి గ్రీన్ సిగ్నల్ లేకపోవడం ఒక కారణ. ఆయా నియోజకవర్గాల్లో ఉన్న పరిస్థితులు రెండో కారణంగా కనిపిస్తోంది. ఇప్పుడు రాపాక విషయంలో ఏం జరుగుతుందో చూడాలి

# ఆపరేష్ గరుడ...

కడప మార్చి 22, ఏపీలో మెడికల్ షాపులపై అధికారులు కొరడా ఝుళిపిస్తున్నారు. ఆపరేషన్ గరుడలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా మెడికల్ షాపులపై దాడులు జరుగుతున్నాయి. మెడికల్ షాపులతో పాటు ఏజెన్సీలపైనా దాడులు కొనసాగిస్తున్నారు. ఈగల్ టీమ్, విజిలెన్స్ అండ్ ఎన్ ఫోర్స్ మెంట్, లోకల్ పోలీసులతో పాటు డ్రగ్ కంట్రోల్ బృందాలు సంయుక్తంగా సోదాలు చేపడుతున్నారు. దాదాపు 100 బృందాలు ఏపీ వ్యాప్తంగా తనిఖీలు, దాడులు చేస్తున్నాయి. విజయవాడ, నెల్లూరు, శ్రీకాకుళం, శ్రీసత్యసాయి జిల్లాలతో పాటు ఇతర జిల్లాల్లోనూ ఈ దాడులు కొనసాగుతున్నాయి.ఆపరేషన్ గరుడలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా మెడికల్ షాపుల్లో విస్తృత తనిఖీలు చేపట్టారు. విశాఖపట్నం, నెల్లూరు, అనంతపురం, కడప, ఒంగోలు, విజయవాడల్లో విజిలెన్స్, ఈగల్, డ్రగ్ అధికారులు సోదాలు నిర్వహించారు. దాదాపు 100కు పైగా బృందాలతో మెడికల్ షాపుల్లో తనిఖీలు చేశారు. డాక్టర్ ప్రిస్కిప్షన్ లేకుండా మందులు అమ్ముతున్న మెడికల్ షాపు నిర్వాహకులపై కేసులు నమోదు చేశారు.కాలం చెల్లిన మందులు విక్రయిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. డ్రగ్స్‌కు సంబంధించి ఎటువంటి సమాచారం ఉన్నా.. 1912 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫిర్యాదు చేయవచ్చని అధికారులు సూచించారు. ఆపరేషన్ గరుడ అనేది ఆంధ్రప్రదేశ్ లోని వివిధ నేరాలను అరికట్టడానికి ఉద్దేశించిన ఒక కార్యక్రమం. ఇది ప్రధానంగా రెండు అంశాలపై దృష్టి పెడుతుంది.ఆంధ్రప్రదేశ్‌లో డ్రగ్స్ వాడకం, అమ్మకం పెరగడం వల్ల యువత చెడిపోతున్నారు. దీనిని అరికట్టడానికి రాష్ట్ర ప్రభుత్వం "ఆపరేషన్ గరుడ" పేరుతో ఒక ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఈ కార్యక్రమం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా డ్రగ్స్ సరఫరాను అరికట్టడానికి, డ్రగ్స్ వాడేవారిని గుర్తించి వారిపై చర్యలు తీసుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా మెడికల్ షాపులలో ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు అమ్మడం, ఇతర డ్రగ్స్ అమ్మడం వంటి వాటిపై దాడులు చేసి, తనిఖీలు చేస్తున్నారు.వైద్యుడి ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు అమ్మడం నేరం. డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ చట్టం, 1940 ప్రకారం.. కొన్ని రకాల మందులను వైద్యుడి ప్రిస్క్రిప్షన్ లేకుండా విక్రయించడం చట్టవిరుద్ధం. ఇలాంటి మందులను ప్రిస్క్రిప్షన్ లేకుండా అమ్మితే.. అమ్మిన వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవచ్చు. కొన్ని సందర్భాల్లో, మందులు కొన్న వ్యక్తిపై కూడా చర్యలు తీసుకునే అవకాశం ఉంది.ఈ చట్టం కింద, కొన్ని రకాల మందులు మాత్రమే ప్రిస్క్రిప్షన్ లేకుండా అమ్మడానికి అనుమతి ఉంది. వీటిని ఓవర్ ది కౌంటర్ మందులు అంటారు. ఈ మందులు సాధారణంగా జ్వరం, తలనొప్పి, జలుబు వంటి చిన్న ఆరోగ్య సమస్యలకు ఉపయోగిస్తారు. అయితే, కొన్ని రకాల మందులు మాత్రం తప్పనిసరిగా వైద్యుడి ప్రిస్క్రిప్షన్ తోనే కొనాలి. వీటిలో యాంటీబయాటిక్స్, యాంటీవైరల్స్, యాంటీఫంగల్స్, యాంటీడిప్రెసెంట్స్, యాంటీసైకోటిక్స్, పెయిన్ కిల్లర్స్, స్టిరాయిడ్స్, హార్మోన్ థెరపీ మందులు మొదలైనవి ఉన్నాయి.

# పోసాని చుట్టూ కేసుల వలయం



గుంటూరు మార్చి 22, పోసాని కృష్ణమురళికి సీఐడీ కోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఈ కేసులో పోలీసులు ఇప్పటికే ఆయనను ఓ రోజు కస్టడీకి తీసుకుని విచారించారు. బెయిల్ పిటిషన్ దాఖలు చేయడంతో విచారణ జరిపిన కోర్టు బెయిల్ మంజూరు చేసింది. మార్ఫింగ్ ఫోటోలు చూపించి చంద్రబాబు,లోకేష్, పవన్ లను దూషించిన వ్యవహారంపై ఆయనపై ఓ టీడీపీ నాయకుడు కేసు పెట్టారు. సమాజంలో వర్గాల మధ్య ద్వేషాన్ని పెంచి అల్లర్లు చెలరేగే కుట్ర చేశాడన్న కారణంగా ఆయనను అరెస్టు చేశారు. ఇప్పటికే ఆయనపై ఇతర కేసులు చాలా ఉన్నాయి. వాటిలో ఆయనకు బెయిల్ మంజూరు అయింది. ఇక కర్నూలు జైలు నుంచి విడుదల అవుతారు అనుకున్న సమయంలో సీఐడీ పోలీసులు పీటీ వారెంట్ పై అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు. సీఐడీ కోర్టులో హాజరుర పరిచినప్పుడు 70 ఏళ్ల వయసులో తనను అనేక ప్రాంతాల్లో తిప్పుతున్నారని... అసలు ఎన్ని కేసులు ఉన్నాయో చెప్పడంలేదని వాపోయారు. అన్యాయంగా వాదనలు వినిపిస్తున్న పబ్లిక్ ప్రాసిక్యూటర్‌కు తనకు లైడిటెక్టర్ పరీక్షలు నిర్వహించాలని కోర్టుకు విన్నవించుకున్నారు. తనకు ఆరోగ్యం సరిగా లేదని ఇప్పటికే రెండుసార్లు స్టంట్లు వేశారని గొంతు చికిత్స కూడా జరిగిందని ఆరోగ్యం సహకరించడం లేదని పోసాని న్యాయమూర్తికి చెప్పుకున్నారు. తాను తప్పు చేసినట్టు తేలితే నరికేయాలని కోరారు. రెండు రోజుల్లో బెయిల్ ఇవ్వకపోతే ఆత్మహత్య చేసుకుంటాన్నారు.పోసానిపై ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా 30కిపైగా ఫిర్యాదులు వచ్చాయి. అందులో 17 కేసులు నమోదు అయ్యాయి. ఫిబ్రవరి 26న అన్నమయ్య జిల్లా ఓబులవారిపల్లె పీఎస్‌లో నమోదైన కేసులో ఆయన అరెస్ట్ చేశారు. అప్పట్నుంచి రాష్ట్రంలోని పలు పోలీస్ స్టేషన్లకు తిరుగుతూనే ఉన్నారు. ఇంకా పోసానిపై ఇంకా అనేక చోట్ల కేసులు నమోద అయి ఉన్నందున ఆయనను ఏ జిల్లా నుంచి అయినా పోలీసులు వచ్చి పీటీ వారెంట్‌తో అదుపులోకి తీసుకుంటారా లేకపోతే విడుదలవుతారా అన్న ఉత్కంఠ ఏర్పడింది. ఏ పోలీస్ స్టేషన్ నుంచీ ఎవరూ పీటీ వారంట్ తో రాకపోతే శనివారం ఉదయం పోసాని విడుదలయ్యే అవకాశం ఉంది. పోసాని కృష్ణమురళి వైసీపీలో అత్యంత అసభ్యంగా మాట్లాడే నేతగా గుర్తింపు తెచ్చుకున్నారు. గతంలో ఆయనపై కోర్టులు కూడా కేసులు పెట్టాలని ఆదేశించాయి. నారా లోకేష్ మంగళగిరి కోర్టులో ప్రైవేటు పిటిషన్ కూడా దాఖలు చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కూడా ఆయన అదే భాషను కొనసాగించారు. అయితే పలు చోట్ల కేసులు నమోదు కావడంతో తూచ్ అన్నారు. తనకు ఇక రాజకీయాలతో సంబంధం లేదని ప్రకటించారు . ఆ తర్వాత సైలెంట్ అయ్యారు. కానీ పోలీసులు మాత్రం ఆయనను వదిలి పెట్టలేదు. ఇంకా ఆయన చుట్టూకేసుల వలయం ఉందని భావిస్తున్నారు.

# ముగ్గురు ముఖ్య నేతల బ్యాక్ స్టెప్ ఎందుకు..

ఒంగోలు, మార్చి 22, అపోజిషన్‌లో ఉన్న పార్టీ నుంచి వలసలు కామన్. తెలుగు స్టేట్స్‌లో గత కొంతకాలంగా మనం ఇది చూస్తూనే ఉన్నాం. ఇటు తెలంగాణలో బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి జంపింగ్స్ జరిగితే..ఏపీలో ప్రతిపక్ష వైసీపీ నుంచి కూటమి పార్టీలోకి వెళ్తున్నారు లీడర్లు. ఇదంతా రాజకీయాల్లో కొత్తేమి కాకపోయినా..వైసీపీని వీడిన, వీడుతున్న పలువురు నేతల విషయంలోనే ఆసక్తికర చర్చ జరుగుతోంది. వైసీపీని వీడిన ముగ్గురు నేతల ఎపిసోడ్ ఇంట్రెస్టింగ్‌గా మారింది.బాలినేని శ్రీనివాస్‌రెడ్డి, విజయసాయిరెడ్డి, లేటెస్ట్‌గా మర్రి రాజశేఖర్‌రెడ్డి..ఈ ముగ్గురు వైసీపీని వీడారు. ఇందులో బాలినేని శ్రీనివాస్‌రెడ్డి జగన్‌కు వరుసకు మామయ్య అవుతారు. విజయసాయిరెడ్డి జగన్‌తో పాటు 16నెలలు జైలులో ఉండి వచ్చారు. ఇక మర్రి రాజశేఖర్ అయితే జగన్ పార్టీ పెట్టినప్పటి నుంచి ఆయన వెంట నడిచి లాయల్‌గా ఉన్నారు.పదవులు వచ్చినా రాకున్నా..టికెట్ ఇచ్చిన ఇవ్వకున్నా అధినేత మాటే శాసనంగా పార్టీలో కొనసాగారు. తనకు ఇష్టం లేకపోయినా 2019లో విడదల రజినికి టికెట్ ఇస్తే ఆమె గెలుపునకు సహకరించారు. తనకు మంత్రి పదవి ఇస్తానన్న హామీ నిలబెట్టుకోకపోగా.. విడదల రజినికి మినిస్ట్రీ ఇచ్చినా కూడా సర్దుకుపోయారు మర్రి రాజశేఖర్ఇలా ఎన్ని త్యాగాలు చేసినా గుర్తింపు లేదు.. కనీసం బుజ్జగింపులు లేవని ఆయన తన దారి తాను చూసుకుంటున్నారు.ఈ ముగ్గురు నేతలు పార్టీ వీడటం వైసీపీ క్యాడర్‌తో పాటు ఏపీ పాలిటిక్స్‌లోనూ చర్చనీయాంశంగా ఉంది. అయితే పార్టీని వీడుతూనే..జగన్ టార్గెట్‌గా వాళ్లు చేస్తున్న విమర్శలు వైసీపీలో చర్చకు దారి తీస్తున్నాయి.నిజానికి బాలినేని వైసీపీని వీడుతారని చాలా రోజులు ప్రచారం జరిగింది. ఆయన పవన్ కల్యాణ్‌తో టచ్‌లోకి వెళ్లారని వార్తలు వచ్చాయి. జనసేనలో ఆయన చేరిక కొన్నిరోజులు వాయిదా కూడా పడింది. అయినా బాలినేని బుజ్జగించలేకపోయారు. జగన్ బాలినేనిని పిలిచి మాట్లాడ లేదంటున్నారు. ఆ తర్వాత విజయసాయిరెడ్డి విషయంలోనూ ఇదే జరిగిందంటున్నారు. రాజకీయాలకు దూరంగా ఉంటానని ఆయన చెప్పగా..అందుకు అభ్యంతరం చెప్పలేదని మీ ఇష్టం అన్నట్లుగా రెస్పాండ్ అయినట్లు టాక్ నడుస్తోంది.ఇక లేటెస్ట్‌గా మర్రి రాజశేఖర్ వైసీపీని వీడి ఎమ్మెల్సీ పదవికి రిజైన్ చేశారు. ఆయన అసంతృప్తితో ఉన్నట్లు ఆరు నెలలుగా ప్రచారం జరుగుతోంది. పార్టీకి అంటీముట్టనట్లుగా ఉంటున్నారు. అయినా మర్రి రాజశేఖర్‌ను సెట్ రైట్ చేయలేకపోయారు. ఆయన చివరకు టీడీపీలో చేరాలని డిసైడ్ చేసుకున్నాక..బొత్స సత్యనారాయణతో పాటు పలువురు నేతలతో నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. కానీ ఆయన వైసీపీలో ఉండేది లేదని తేల్చి చెప్పారు.ఈ ముగ్గురు కీలక నేతలు. బాలినేని, విజయసాయి, మర్రి రాజశేఖర్ జగన్‌కు ఆప్తులు. పార్టీ పెట్టినప్పటి నుంచి ఆయన వెంట నడిచిన ముఖ్యులు. ఈ ముగ్గురు పార్టీని వీడుతారని తెలిసినా వైసీపీ అధిష్టానం ఎందుకు సీరియస్‌గా తీసుకోలేదన్న చర్చ జరుగుతోంది. అసంతృప్తిగా ఉన్నారని తెలిసినా పోతే పోనీలే అని లైట్ తీసుకున్నారన్న అన్న టాక్ వినిపిస్తోంది. లేకపోతే ఉన్నోళ్లే మనోళ్లు..వెళ్లాలనకునేవారిని ఆపొద్దని డిసైడ్ అయ్యారా అన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.వైసీపీ అధినేత తీరుకు కూడా ఇక్కడ ఇంట్రెస్టింగ్ చర్చగా మారింది. తానే పార్టీ..పార్టీనే తాను అన్నట్లుగా జగన్ ఆలోచన అని..పోయేవాళ్లు పోతే కొత్త నాయకులను తయారు చేసుకోవడం పెద్ద కష్టమేమి కాదన్న థాట్‌లో ఫ్యాన్ పార్టీ అధినేత ఉన్నట్లు నేతలు చర్చించుకుంటున్నారు. తాను పార్టీ పెట్టినప్పుడు ఎంతమంది ఉండే..ఇప్పుడు ఎంత మంది ఉన్నారో లెక్కలు వేసుకుంటున్నారట. పార్టీ బీఫామ్ ఇస్తామంటే క్యూ కట్టే వాళ్లలో ఒక్కో నియోజకవర్గంలో పదుల మంది నేతలు ఉన్నట్లు చెప్పుకుంటున్నారట. పైగా తనను చూసే జనం ఓట్లేస్తారని జగన్ అభిప్రాయమట. 2019 ఎన్నికలకు ముందు ఓ ఇంటర్వ్యూలో జగన్ ఇదే విషయం చెప్పారని గుర్తు చేస్తున్నారు.సిచ్యువేషన్స్, ఈక్వేషన్స్, క్యాలిక్యులేషన్స్.. అన్నీ చూసుకున్నాకే అసంతృప్తుల జంపింగ్స్‌ను సీరియస్‌గా తీసుకోవడం లేదన్న టాక్ నడుస్తోంది. ఉండేవాళు ఉంటారు.. పోయే వాళ్లు పోతారు..బతిమాలి పార్టీలో ఉంచితే.. వాళ్ల డిమాండ్స్ నెక్స్ట్ లెవల్ ఉంటాయని భావిస్తున్నారట. అందుకే ఎవరూ పార్టీని వీడుతున్నారని తెలిసినా..వైసీపీ పెద్దలుగా పేరున్నా నేతలే వారితో మాట్లాడుతున్నారట.మళ్లీ మనమే అధికారంలోకి వస్తామ్..ఆలోచించండి అని చెప్పడం తప్ప..అసంతృప్తుల నేతలను అధినేత పిలిచి మాట్లాడిన దాఖలాలు లేవంటున్నారు. అందుకే పార్టీ మారిన నేతలు కూడా జగన్‌ను టార్గెట్ చేస్తున్నారట. ఇబ్బంది పడుతున్నామ్..తమకు న్యాయం జరగలేదని అని చెప్తే మీ ఇష్టం..మీరెక్కడున్నా బాగుండాలని కోరుకుంటానంటూ చెప్తున్నారట ఫ్యాన్ పార్టీ బాస్. కనీసం ఉండండి..భవిష్యత్‌లో మంచి అవకాశాలు ఇస్తామన్న మాట కూడా చెప్పట్లేదట.ఒకరు పోతే పది మంది నాయకులు పుట్టుకొస్తారనే ధీమాలో ఉన్నారట. ఏదైనా పార్టీ పెట్టినప్పటి నుంచి..జగన్ వెంట నడిచిన నేతలు వైసీపీని వీడటం క్యాడర్‌కు నిరాశ కలిగిస్తోందట. కానీ అధినేతే అల్టిమేట్..ఆయనే బలం, అతడే ఓ సైన్యం..అని లైన్స్‌కు లీడర్లు, క్యాడర్ కట్టుబడి ఉంటున్నారట. అలకబూనుతున్న జగన్ ఆప్తుల లిస్టులో ఇంకెవరెవరు ఉన్నారో చూడాలి మరి.

# ఆత్రేయపురం పూతరేకులకు కల్తీ నెయ్యి

అమలాపురం, మార్చి 22, స్వీట్లలో ఆత్రేయపురం పూతరేకులకున్న పేరు అంతా ఇంతా కాదు. చిన్న పిల్లల నుంచి పెద్దల వరకు ఇష్టంగా తినే మిఠాయి. నోట్లో పెట్టుకుంటే ఇట్టే కరిగిపోయే పూతరేకులంటే చాలా మందికి మక్కువ. దేశ విదేశాలకు కూగా ఎగుమతి అవుతోన్న ఆత్రేయపురం పూతరేకుల బ్రాండ్‌కు భౌగోళిక గుర్తింపు కూడా దక్కింది. అంతటి పేరున్న ఈ పూతరేకుల్లో కల్తీ రేకులు కూడా చేరుతున్నాయి. పూతరేకుల్లో కల్తీ అనేది కేవలం ఆరోపణలే కాదు. అధికారులు తనిఖీలు చేసి సేకరించిన శాంపిల్స్‌లో కీలకాంశాలు వెలుగు చూశాయి. వీటి తయారీలో వాడిన పదార్థాల్లో కల్తీ అవశేషాలు ఉన్నట్లు పరీక్షల్లో బహిర్గతమైంది. దీంతో ఆత్రేయపురం పూతరేకులంటే ఇష్టపడే స్వీట్ ప్రియులు పూతరేకులు తినాలంటే ముందు వెనుక ఆలోచించే పరిస్థితి వచ్చింది. జరిగిన నష్టాన్ని గ్రహించిన ఆత్రేయపురం పూతరేకుల తయారీ అసోసియేషన్ కీలక నిర్ణయాలు తీసుకుంది. పెద్దలు ఇటువంటి అపకీర్తికి కారణమైన వారిని అసోసియేషన్ నుంచి తొలగిస్తామని హెచ్చరించింది. ఆత్రేయపురం పూతరేకుల్లో కల్తీ పదార్థాలు వాడుతున్నారనే ఆరోపణలతో ఫుడ్ సేఫ్టీ అధికారులు ఫిబ్రవరి 17న నాలుగు బృందాలుగా ఏర్పడి తనిఖీలు చేశారు. ముడిసరకు అమ్మే దుకాణాల్లో, పాలకోవా తయారీ కేంద్రాల్లో లోకల్‌గా తయారు చేసిన నెయ్యి స్వాధీనం చేసుకున్నారు. దీంతో పూతరేకుల దుకాణాల వద్ద తనిఖీలు చేసి నమూనాలను సేకరించారు. ఇలా సేకరించిన నమూనాలను ల్యాబ్‌కు పంపిస్తేనే కల్తీనా కాదా అనేది నిర్ధారించగలమని అధికారి శ్రీనివాస్ అప్పట్లో చెప్పారు. వాటిని హైదరాబాద్‌లోని ల్యాబ్‌కు పంపించారు. ఇప్పుడు ఆ రిపోర్టులు వచ్చాయి. ఆత్రేయపురంలో సేకరించిన శాంపిల్స్‌లో మూడింటి నమూనాల్లో కల్తీ జరిగినట్లు గుర్తించినట్లు ఆహార భద్రతా అధికారి బి.శ్రీనివాస్ తెలిపారు. ఆత్రేయ డ్రైఫ్రూట్స్ అండ్ నెయ్యి విక్రయదారుడు, శివపార్వతి పాలకోవా, పూతరేకుల తయారీదారులు, షణ్ముక డిస్పోజల్ ముడిసరకు అమ్మకందారుడి నుంచి సేకరించిన శాంపిల్స్‌లో కల్తీ జరిగినట్లు తేలింది. దీనిపై సంబంధిత యజమానులకు నోటీసులు జారీ చేశామని చెప్పారు. ఆత్రేయపురంలో తయారయ్యే పూతరేకుల్లో పలు దుకాణాల్లో కల్తీనెయ్యి వాడుతున్నట్లు గుర్తించిన అధికారులు తయారీ దారులను గట్టిగానే హెచ్చరించారు. బ్రాండ్ ఉన్న నెయ్యిలనే వినియోగించాలని సూచించారు. దీంతో ముడిసరకులు అమ్మే దుకాణదారుల నుంచి ఇకపై నెయ్యి, ఇతర ముడిసరకులు కొనుగోళ్లు ఆపివేయాలని వారంతా నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. అయితే ఆత్రేయపురం పూతరేకుల బ్రాండ్‌ను దెబ్బతీసే విధంగా కల్తీ నెయ్యి, ఇతర ముడిసరకులను విక్రయించిన వారిని శాశ్వతంగా బహిష్కరిస్తామని, పూతరేకుల తయారీదారులు ఈ విషయాన్ని ఎప్పటికప్పుడు గమనిస్తూ జాగ్రత్తలు తీసుకోవాలని వీరి అసోసియేషన్ సూచించింది..

# ఉమ్మడి నల్గొండలో విజృంభిస్తున్న బర్డ్ ఫ్లూ

నల్గొండ ఉమ్మడి జిల్లాలో బర్డ్ ఫ్లూ విజృంభిస్తుంది. భూదాన్ పోచంపల్లి మండలం, దోతిగూడెం పౌల్ట్రీ ఫామ్లో బర్డ్ ఫ్లూ కేసు నమోదు అయింది. శుక్రవారం సుమారు 52 వేల కోళ్లను అధికారులు చంపి పాతిపెట్టారు. పరిసర ప్రాంతాలను రెడ్ జోన్ ప్రకటించారు. నెలరోజుల క్రితం చౌటుప్పల్ మండలం నేలపట్లలో తెలంగాణలోనే తొలి బర్డ్ ఫ్లూ కేసు నమోదు అయిన విషయం తెలిసిందే. చిట్యాల మండలం, గుండ్రానిపల్లి గ్రామంలో కోళ్ల ఫారంలో బ్రాయిలర్ కోళ్లకు బర్డ్ ఫ్లూ నిర్ధారణ అయింది. సుమారు 2 లక్షల కోళ్లను భూమిలో పాతిపెట్టే ప్రక్రియ వెటర్నరీ డాక్టర్లు చేపట్టారు. చుట్టుపక్కల ప్రాంతంలో "రెడ్ జోన్" ప్రకటించారు.

# తునిలో హిజ్రాల అందోళన

తుని కాకినాడ జిల్లా తుని పట్టణంలో హిజ్రాలు గొల్ల అప్పారావు సెంటర్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. అనకాపల్లిలో హిజ్రా దీపును పెళ్లి చేసుకుని అత్యంత కిరాతకంగా హత్య చేసిన బన్నీని కఠినంగా శిక్షించి ఉరితీయాలని డిమాండ్ చేశారు. అనంతరం తుని పట్టణ ప్రధాన వీధుల్లో నిరసన ర్యాలీ చేపట్టారు. పట్టణ నలుమూలల ఉన్నటువంటి హిజ్రాలు పెద్ద ఎత్తున చేరుకొని వుయ్ వాంట్ జస్టిస్ అంటూ నినాదాలు చేశారు.

# జల్లెడ పట్టి మరీ ఏరేస్తున్నారు...

ఐదు దశాబ్దాలుగా దేశంలో అతి పెద్ద శాంతిభద్రత సమస్యగా కొనసాగిన మావోయిస్టు ఉద్యమం చివరి దశకు చేరుకుందా? అవుననే అనిపిస్తోంది. 2026 మార్చి నాటికి 'మావోయిస్టు రహిత భారత్'గా దేశాన్ని మారుస్తామని గత ఏడాది కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఏ ఉద్దేశంతో ప్రకటించారో తెలియదు కానీ అప్పటినుంచి మావోయిస్టులకు స్థావరంగా ఉన్న బస్తర్ ప్రాంతంలో పెద్ద ఎత్తున మావోస్టులను ఏరివేస్తున్నారు.

గురువారం ఒకే రోజు ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్, కాం కేర్ జిల్లాల్లో జరిగిన వేర్వేరు ఎన్‌కౌంటర్లలో పెద్ద సంఖ్యలో మావోయిస్టులు మృతి చెందినట్లుగా వార్తలు వస్తున్నాయి. ఈ ఎదురు కాల్పుల్లో ఓ జవాను కూడా చనిపోయినట్లు చెబుతున్నారు. గత ఏడాది ఛత్తీస్‌గఢ్‌లో బీజేపీ నేతృత్వంలోని ప్రభుత్వం ఏర్పాటయిన తర్వాత మావోస్టుల ఏరివేత ఉధృతమైంది.ఓ నివేదిక ప్రకారం ఈ ఏడాది జనవరి 22 నాటికి 344 మంది మావోస్టులు మృతి చెందగా ఒక్క ఛత్తీస్‌గఢ్‌లోనే 283 మంది చనిపోవడం గమనార్హం. ఛత్తీస్‌గఢ్‌లో ఈ ఏడాది చోటు చేసుకున్న అతిపెద్ద ఘటనల్లో తాజా ఎన్‌కౌంటర్ రెండోది. గత ఫిబ్రవరి 9న బీజాపూర్ జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో 31మంది మావోయిస్టులు మృతి చెందా రు. ఈ ఏడాది మూడు నెలల్లోనే దాదాపు 90 మంది నక్సల్స్ మృతి చెం దినట్లు అంచనా.వీరిలో పలువురు మావోయిస్టు అగ్రనేతలు కూడా ఉన్నారు. 2026 మార్చి చివరినాటికల్లా దేశాన్ని 'మావోయిస్టు రహిత భా రత్'గా మారుస్తామని అమిత్ షా ప్రకటించడం వెనుక పక్కా ప్రణాళిక ఉ న్నట్లు కనిపిస్తోంది. గత దశాబ్దకాలంగా ప్రభుత్వం తీసుకున్న చర్యల ఫలితంగా మావోయిస్టు ఉద్యమం గణనీయంగా బలహీనమయినట్లు అమిత్ షా చెబుతున్నారు.గత ఏడాది కాలంగా బస్తర్‌లో మావోయిస్టు కార్యకలాపాలు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో పౌరులు, భద్రతా జవాన్ల మర ణాలు అతి తక్కువగా ఉన్న మాట వాస్తవమే. అదే సమయంలో పెద్ద సం ఖ్యలో మావోయిస్టు కేడర్, నేతలు పోలీసుల ఎదుట లొంగిపోయి జనజీవన స్రవంతిలో కలిశారు. అయినా ఇంకా కొందరు మాత్రం లొంగి పోవడానికి ఇష్టపడడం లేదని, వారు తీవ్ర పరిణామాలను ఎదుర్కోవలసి వస్తుందని అమిత్ షా అనేక సందర్భాల్లో హెచ్చరించారు.

ఒకప్పుడు భద్రతా దళాలు అడుగు పెట్టడానికి భయపడే బస్తర్ ప్రాం తంలో మావోయిస్టు ఉద్యమం అంతిమ దశకు చేరుకోవడానికి కారణాలేమిటి? ప్రభుత్వం అనుసరిస్తున్న మూడంచెల వ్యూహమే దీనికి ప్రధాన కారణం.మావోయిస్టుల హింసను అదుపు చేయడానికి కౌంటర్ టెర్రరి జం దళాల ఆపరేషన్‌ను పెద్ద ఎత్తున చేపట్టడంతో పాటు స్థానిక ప్రజలను మావోయిస్టునుంచి దూరం చేయడానికి ప్రభావిత ప్రాంతాల్లో పెద్ద ఎత్తు న అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేయడం, లొంగిపోయే మావోయిస్టులకు పునరావాసం కల్పించడం ద్వారా వారిని జనజీవన స్రవంతిలోకి తీసుకు రావడం ఈ వ్యూహంలోని ప్రధాన అంశాలు.ఛత్తీస్‌గఢ్‌లోని బీజే పీ ప్రభుత్వం స్థానిక ప్రజల హక్కులు, భూమి హక్కులను కాపాడడంపై ప్రధానంగా దృష్టిపెట్టడం దీనికి మరింత బలం చేకూరుస్తోంది. 2014 నుంచి ఇప్పటివరకు ఓ వైపు 1700 మందికి పైగా మావోయిస్టులు హతం కాగా, మరోవైపు 6,487 మందిని అరెస్టు చేయడం జరిగింది. 11,413 మంది లొంగిపోయారు. అయితే మావోయిస్టులు కొన్ని ప్రాంతాలకే పరిమితమైన నేపథ్యంలో ఇంత పెద్ద ఎత్తున ఎన్‌కౌంటర్లు జరగడంపై విమర్శ లు వస్తున్నాయి.ఉద్యమం బలహీనమైనందున మావోయిస్టులతో చర్చలకు ఎందుకు ప్రయత్నించడం లేదన్న ప్రశ్నలు కూడా వినిపిస్తున్నాయి. అయితే ప్రభుత్వం ఇప్పు డు చూపిస్తున్న దూకుడును గమనిస్తే చర్చలకు అవకాశమే లేదని అర్థమవుతుంది. గత పదేళ్లలో మొత్తం 343 మంది మావోయిస్టు నేతలు మృతిచెందారు. ఇదే భద్రతా బలగాలకు వరంగా మా రింది. నక్సల్స్‌ను టార్గెట్‌గా చేసుకుని ఏరివేస్తున్నారు. ఛత్తీస్ గఢ్‌లోని కాంకేర్, నారాయణ్ పూర్ అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్ కౌంటర్ లో నలుగురు మావోయిస్టులు మృతి చెందారు. బీనగుండా, పురుషోడు అటవీ ప్రాంతంలో ఉత్తర బస్తర్ మాద్ డివిజన్ కమిటీ సభ్యులు ఉన్నారన్న సమాచారంతో బీఎస్ఎఫ్, డీఆర్‌జీ సంయుక్త బలగాలు ఆపరేషన్ చేపట్టాయి. ఈ ఎదురుకాల్పుల్లో నలుగురు మావోయిస్టులు మృతిచెందగా, డీఆర్‌జీ జవాను ఒకరు వీరమరణం పొందారని ఉన్నతాధికారులు తెలిపారు. మావోయిస్టుల మృతదేహాలతో పాటు భారీగా పేలుడు పదార్థాలు, ఆయుధాలు స్వాధీనం చేసుకున్నారు. మావోయిస్టులు రెండు ప్రాంతాల్లో క్యాంపులను ఏర్పాటు చేసుకొని సమావేశం అయ్యారన్న సమాచారంతో పోలీస్ సెర్చ్ ఆపరేషన్ మొదలుపెట్టారు. గురువారం ఉదయం బలగాలకు మావోయిస్టులు ఎదురుపడడంతో ఇరువైపుల నుంచి కాల్పులు కొనసాగాయి. గురువారం మధ్యాహ్నం వరకు కొనసాగిన ఎదురుకాల్పుల్లో ఓ చోట 26 మంది, మరో ఎన్ కౌంటర్ లో నలుగురు మావోయిస్టులు చనిపోయినట్లు బస్తర్ ఐజీ సుందర్ రాజ్ తెలిపారు. వెల్లడించారు.

# కర్ణాటకను కుదిపేస్తున్న హనీ ట్రాప్

బెంగళూరు, మార్చి 22, (న్యూస్ పల్స్) కర్ణాటక సహకార శాఖ మంత్రి కె.ఎన్. రాజన్న అసెంబ్లీలో రాజకీయ నేతలపై హనీ ట్రాప్ జరిగిందని ఆరోపించారు. 48 మంది రాజకీయ నాయకులు హనీ ట్రాప్ లో పడ్డారన్నారు. వీరిలో రాష్ట్ర నాయకులతో పాటు కేంద్ర స్థాయి నాయకులు కూడా ఉన్నారని చెప్పారు. స్వయంగా మంత్రి అసెంబ్లీలో ఇలాంటి వ్యాఖ్యలు చేయడంతో రాజకీయవర్గాల్లో కలకలం రేగింది. విచారణ చేయించాలన్న డిమాండ్లు వినిపిస్తున్నాయి. ప్రతిపక్ష బీజేపీ ఎమ్మెల్యేలు సీడీలను చూపించి హనీ ట్రాప్ వీడియోలు అని ఆరోపించారు. అయితే రోజుల్లో సీడీలు, సీడీ ప్లేయర్లు లేవు కాబట్టి .. వాటిని వినియోగిచేవారు దాదాపుగా లేరు కాబట్టి అవన్నీ ఉత్తవేనని భావిస్తున్నారు.సహకార మంత్రి రాజన్న చేసిన ఆరోపణలపై హోం మంత్రి జి. పరమేశ్వర్ స్పందించారు. తోటి మంత్రి చేశారు కాబట్టి ఆధారాలను తీసుకుని దర్యాప్తు చేయిస్తామని ప్రకటించారు. అవసరమైతే ఉన్నత స్థాయి దర్యాప్తును ఆదేశిస్తామని ప్రకటించారు. కానీ ఇంకా విధి విధానాలు ప్రకటించలేదు. హనీ ట్రాప్ రాజకీయాలు కర్ణాటకలో కొత్తేమీ కాదు. పలువులు రాజకీయ నేతలు గతంలో హనీ ట్రాప్ లో ఇరుక్కున్నారు. 2019లో బెంగళూరు పోలీసులు ఒక హనీ ట్రాప్ గ్యాంగ్‌ను అరెస్టు చేశారు. ఈ గ్యాంగ్ రాజకీయ నాయకులు మరియు వ్యాపారవేత్తలను లక్ష్యంగా చేసుకుని, వారి వ్యక్తిగత క్షణాల వీడియోలను రికార్డ్ చేసి బ్లాక్‌మెయిల్ చేసిందని పోలీసులు ప్రకటించారు. అయితే సహకార మంత్రి రాజన్న రాజకీయ ఉద్దేశాలతో హనీ ట్రాప్ ఆరోపణలు చేశారన్న అభిప్రాయాలు కూడా వినిపిస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీలోని అంతర్గత పోరు ఈ ఆరోపణలకు కారణం అని భావిస్తున్నారు. బీజేపీ నాయకుడు బసనగౌడ పాటిల్ ఈ హనీ ట్రాప్ ఆరోపమలు.. ఓ కాంగ్రెస్ సీనియర్ సీఎం పదవి కోసం చేస్తున్న రాజకీయం అని ఆరోపించారు. హనీ ట్రాప్ ఆరోపణలపై సీఎం సిద్దరామయ్య స్పందించారు. హనీ ట్రాప్ కు ఎవరైనా పాల్పడి ఉంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. కానీ స్వతంత్ర దర్యాప్తునకు ఆదేశించాలని విపక్షాలు డిమాండ్ చేశాయి.

# తండ్రి బాటలో మహేష్ బాబు


**హైదరాబాద్‌ప్రజాబలం ప్రతినిధి మార్చి 22,** నిర్మాతల హీరో అని అప్పట్లో సూపర్ స్టార్ కృష్ణ ని పిలిచేవారు. ఒక్క మాటలో చెప్పాలంటే నిర్మాతలకు కృష్ణ ఒక దేవుడు. ఒక సినిమా అట్టర్ ఫ్లాప్ అయితే, మరుసటి సినిమాకు అదే నిర్మాతను పిలిచి ఉచితంగా సినిమా చేసేవాడు. కృష్ణ పారితోషికం తీసుకోకుండా సినిమాలు చేస్తానని చెప్పినా అప్పట్లో కొంతమంది నిర్మాతలు 'మా దగ్గర కొబ్బరి కాయ కొట్టడానికి కూడా డబ్బులు లేవు సార్..ఏమి సినిమా తియ్యమంటారు చెప్పండి' అని అనేవారట. అప్పుడు కృష్ణ తానే ఫైనాన్షియర్స్ ని పిలిపించి, ఇతనికి డబ్బులు ఇవ్వండయ్యా.., నేను గ్యారంటీ గా ఉంటాను అని సంతకాలు పెట్టేవాడట. అలా నష్టపోయిన నిర్మాతలతో సినిమాలు చేసి, వాళ్లకు సూపర్ హిట్స్ ని అందించి వాళ్ళ జీవితాలను నిలబెట్టాడు. అలాంటి వాళ్లంతా ఇప్పుడు ఇండస్ట్రీ లో ఉన్నత స్థాయిలో ఉన్నారు. దేశంలో ఏ హీరో అయినా ఇలా ఉంటాడా చెప్పండి?.కృష్ణ లాంటి అతి మంచి తనం చూపించకపోయిన, ఆయన తనయుడు సూపర్ స్టార్ మహేష్ బాబు చాలా కాలం నుండి నిర్మాతలను ఆదుకునేందుకు ఒక సరికొత్త పద్దతిని అనుసరిస్తున్నాడు. స్టార్ హీరోలందరూ అడ్వాన్స్ ఇస్తే కానీ డేట్స్ ఇవ్వని పరిస్థితి ఉన్న ఈరోజుల్లో, మహేష్ బాబు ఒక్క రూపాయి అడ్వాన్స్ కూడా తీసుకోకుండా సినిమాలు చేస్తున్నాడట. దూకుడు నుండి ఆయన ఇదే ఫార్ములా ని అనుసరిస్తూ ఉన్నాడు. సినిమా కి బిజినెస్ జరిగి, అది విడుదలై సూపర్ హిట్ అయిన తర్వాత మాత్రమే ఆయన వచ్చే లాభాల్లో వాటాలు తీసుకుంటాడట. నష్టాలు వస్తే తీసుకోడట. ఇప్పుడు రాజమౌళి తో చేస్తున్న సినిమా విషయం లో కూడా ఆయన ఇదే ఫార్ములా ని అనుసరిస్తున్నాడు. సినిమా విడుదలై సూపర్ హిట్ అయ్యాక లాభాల్లో 35 శాతం మహేష్ కి వెళ్తుంది. ఈ సినిమా బంపర్ హిట్ అయితే మహేష్ బాబుకు వందల కోట్ల రూపాయిలు వచ్చి చేరుతాయి.ఫ్లాప్ అయినా కూడా వస్తాయి కానీ, అది చాలా తక్కువ మొత్తంలో మాత్రమే ఉంటుందట. మహేష్ బాబు లాగా మిగతా హీరోలు ఎందుకు చేయకూడదు?, నిర్మాతల మేలు కోరి అడ్వాన్స్ తీసుకోకుండా ఉండలేరా. ఒక హీరోకి అడ్వాన్స్ ఇస్తే, సదరు నిర్మాత ఆ సినిమా పూర్తి అయ్యి బిజినెస్ జరిగే వరకు వడ్డీలు కడుతూ ఉండాలి, ఎంత నష్టం మీరే ఆలోచించండి?, అదే హీరోలు అడ్వాన్స్ తీసుకోకుండా చేస్తే నిర్మాతకు బోలెడంత ఒత్తిడి తగ్గుతుంది. నిర్మాత లేనిదే సినిమా లేదు, సినిమా ఇండస్ట్రీ లేదు. నిర్మాత దేవుడితో సమానం అంటారు, మన మానవ జాతి మనుగడకు రైతు ఎంత ముఖ్యమో, సినీ ఇండస్ట్రీ కి నిర్మాత కూడా అంతే ముఖ్యం. అలాంటి నిర్మాతను మహేష్ బాబు తరహాలో అలోచించి ఇతర స్టార్ హీరోలు కూడా అనుసరిస్తారో లేదో చూడాలి.

# కర్ణాటకలో లైంగిక విద్య...

## వచ్చే విద్యాసంవత్సరం నుంచే అమలు..

బెంగళూరు, మార్చి 22, (న్యూస్ పల్స్) పాఠశాల స్థాయి విద్యకు సంబంధించి కర్ణాటక ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పాఠశాలల్లో 8వ తరగతి నుంచి 12వ తరగతి వరకు లైంగిక విద్యను ప్రవేశపెట్టనుంది. కౌమారదశలో ఉన్న విద్యార్థులకు శారీరక భావోద్వేగ ,హార్మోన్ల మార్పులు గురించి కనీస పరిజ్ఞానం ఉండాల్సిన అవసరముందని ప్రభుత్వం స్పష్టంచేసింది. దీంతో పాఠశాలల్లో లైంగిక విద్యను ప్రవేశపెట్టిన మొదటి రాష్ట్రంగా కర్ణాటక రాష్ట్రం నిలిచింది. వీటితోపాటు సైబర్ పరిశుభ్రత, విద్యార్థుల వ్యక్తిగత ఆరోగ్యంపై ప్రభుత్వం దృష్టి సారించింది.పాఠశాల విద్యలో 8వ తరగతి నుంచి 12వ తరగతుల విద్యార్థులకు లైంగిక విద్యను వచ్చే విద్యాసంవత్సరం నుంచి బోధించనున్నట్లు కర్ణాటక విద్యాశాఖ మంత్రి ప్రకటించారు. విద్యార్థుల్లో కౌమార దశలో చోటుచేసుకునే శారీరక, భావోద్వేగ, హార్మోన్ల మార్పుల గురించి అవసరమైన జ్ఞానాన్ని అందించే లక్ష్యంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు. వైద్య నిపుణుల ద్వారా వారానికి రెండుసార్లు లైంగిక విద్య తరగతులు నిర్వహించనున్నాట్లు మంత్రి చెప్పారు. ఏడాదికి రెండుసార్లు విద్యార్థులు ఆరోగ్యం, అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. పరిశుభ్రతపై విద్యార్థులకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సిబ్బంది అవగాహన కల్పిస్తారని చెప్పారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది విద్యార్థులకు పరిశుభ్రత, అంటు వ్యాధులు, డ్రగ్స్ వినియోగం, ప్రమాదాల గురించి అవగాహన కల్పిస్తారని చెప్పారు. లైంగిక విద్యతో పాటు.. డిజిటల్ ఎడిక్షన్, ప్రీమెచ్యూర్ సెక్సువల్ యాక్టివిటీ, టీనేజ్ ప్రెగ్నెన్సీ వంటి సమస్యలపై ప్రత్యేక తరగతులు ప్రారంభించాలని ప్రభుత్వం భావిస్తోంది. మరోవైపు 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులకు నైతిక విద్య సబ్జెక్టును తప్పనిసరి చేయనుంది. వచ్చే విద్యా సంవత్సరం నుంచి వారానికి రెండుసార్లు సెషన్‌లు నిర్వహించే అవకాశం ఉంది. ఈ పాఠ్యాంశాలు సమగ్రత, నిజాయితీ,సహనం వంటి విలువలను విద్యార్థుల్లో అలవర్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని మంత్రి అన్నారు

# జిల్లాలో టెన్త్ పేపర్ లీక్....



**నల్గొండప్రజాబలం ప్రతినిధి** నకిరేకల్ పట్టణం కడపర్తి రోడ్ లోని ఎస్ఎల్ బీసీ బాలుర గురుకుల పాఠశాల సెంటర్ లో తెలుగు పేపర్ లీక్ కలకలం రేపింది. విద్యాశాఖ,పోలీసుల నిర్లక్ష్యం బయటపడింది. శు క్రవారం ఉదయం విద్యార్దులకు ప్రశ్నా పత్రం ఇచ్చిన 10 సెకన్ ల వ్యవధిలోనే సోషల్ మీడియాలో ప్రశ్నాపత్రం చక్కర్లు కొట్టింది. పేపర్ లీక్ వ్యవహారంలో విద్యాశాఖ అధికారుల ప్రమేయం విద్యార్థి సంఘాలు పై అనుమానం వ్యక్తం చేస్తున్నాయి. విషయం బయటకు పొక్కకుండా అధికారులు జాగ్రత్త పడ్డారు. గుట్టు చప్పుడు కాకుండా విచారణ చేపట్టారు. ఎగ్జామ్ సెంటర్ లోకి మొబైల్ ఎలా వెళ్లిందనే దానిపై ఆరా తీస్తున్నారు. ఎగ్జామ్ సెంటర్ నుంచి వాట్సాప్ ద్వారా ప్రశ్నపత్రం బయటకు వచ్చింది. క్షణాల్లో సదరు ఎగ్జామ్ సెంటర్ కు జీరాక్స్ ద్వారా ఆన్సర్ షీట్స్ అందించారన్న ఆరోపణలు వచ్చాయి. ప్రైవేట్ స్కూల్స్ తో విద్యాశాఖ అధికారులు కుమ్మక్కైనట్టు విద్యార్థి సంఘాల ఆరోపణ.

## ఖమ్మం స్టేషన్ దిశ తిరిగినట్టే

**ఖమ్మంప్రజాబలం ప్రతినిధి మార్చి 22,** తెలంగాణలో అత్యంత ప్రాముఖ్యత కలిగిన ఖమ్మం రైల్వే స్టేషన్ కూడా ఈ ప్రాజెక్టులో భాగంగా మెరుగుపడుతోంది. 19వ శతాబ్దంలో స్థాపించబడి.. హైదరాబాద్ – విజయవాడ రైలు మార్గం లో భాగంగా.. ఖమ్మం రైల్వే స్టేషన్ అనేక సంవత్సరాలుగా కీలకమైన మౌలిక సదుపాయాల కేంద్రంగా నిలిచింది. ఈ స్టేషన్.. దక్షిణ భారతదేశంలో ఉత్తర – దక్షిణ రైలు మార్గాల కలయికకు ఒక ముఖ్యమైన పాయింట్ గా మారింది. అలాగే.. ఈ ప్రాంతంలో గనుల రవాణా, ముఖ్యంగా సింగరేణి కాలరీల నుండి బొగ్గు రవాణా వంటి వాణిజ్య కార్యకలాపాలు ఈ స్టేషన్ ద్వారా జరుగుతుంటాయి.అయితే.. ప్రస్తుత అవసరాలను దృష్టిలో పెట్టుకుని.. ఖమ్మం రైల్వే స్టేషన్‌లో ఎన్నో మౌలిక సదుపాయాలు ఆవిష్కరించబడుతున్నాయి. రూ. 25.41 కోట్ల వ్యయంతో.. ఈ స్టేషన్‌లో ఏసీతో కూడిన వేచియుండు గదులు, మెరుగైన టాయిలెట్లు, 12 మీటర్ల వెడల్పు గల ఫుట్ ఓవర్ బ్రిడ్జి, ఎస్కలేటర్లు, లిఫ్టులు, ప్రయాణికుల సౌకర్యానికి కొత్త ఆధునిక సదుపాయాలను కలిపేలా పనిచేస్తున్నాయి.ప్రస్తుత పునరాభివృద్ధి పనులు ఇప్పటికే 45 శాతం వరకు పూర్తయినట్లుగా అధికారులు పేర్కొన్నారు. ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం, కొత్త జనరల్ వెయిటింగ్ హాల్, రిటైరింగ్ గదులు, గోడల పనులు మొదలైన వాటి నిర్మాణాలు ప్రాముఖ్యత పొందాయి. వీటితో పాటు.. ప్లాట్ ఫారమ్ పై అదనపు కప్పు ఏర్పాటు.. సి.ఓ.పి నిర్మాణాలు, సౌకర్యాల పెంపుదల కూడా కొనసాగుతున్నాయి.ఇలాంటి ప్రాజెక్టులు రాష్ట్ర ఆర్థిక అభివృద్ధి, ప్రజల సౌకర్యానికి మేలు చేకూర్చుతాయి. జాతీయ రైల్వే నెట్‌వర్క్ లో భాగంగా.. ఈ రైల్వే స్టేషన్లు కేవలం రవాణా కేంద్రాలుగా మాత్రమే కాకుండా.. ప్రాంతీయ వ్యాపార, వాణిజ్య, పర్యాటక కేంద్రాలుగా కూడా మారాయి. కావునా.. ఖమ్మం స్టేషన్ చుట్టు ఆర్థిక, సామాజిక, వాణిజ్య రంగాలలో ఎక్కువగా వృద్ధి జరగనుంది.ఈ ప్రణాళికను తేవడం.. భారతీయ రైల్వే పథకాల్లో మరొక గొప్ప అడుగు. 'అమృత్ భారత్ స్టేషన్ స్కీమ్' కింద అన్నివర్గాల ప్రయోజనాలకోసం తీసుకోబడిన ఈ చర్యలు.. రైల్వే ప్రయాణాలను మరింత సౌకర్యవంతంగా, సమర్థవంతంగా చేయడం కోసం పెద్ద మార్పులు తీసుకురావడంతో పాటు.. ప్రజల జీవన ప్రమాణాలను కూడా పెంచనున్నాయి.

# బీసీ రిజర్వేషన్ కు కేంద్రం మోకాలడ్డు

**హైదరాబాద్‌ప్రజాబలం ప్రతినిధి మార్చి 22,** లంగాణ రాష్ట్ర ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతూ తీసుకున్న నిర్ణయంపై భారతీయ జనతా పార్టీవైఖరి వెల్లడించడంతో సమన్వయం లోపించింది. ఇతర వెనుకబడిన తరగతుల అభ్యున్నతి, సంక్షేమం విషయంలో మొదటి నుంచి సానుకూల దృక్పథంతో వ్యవహరిస్తున్న కమలదళం.. తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతించాలా.. లేక వ్యతిరేకించాలా.. ఈ రెండూ కాకుండా మధ్యేమార్గంగా తటస్థంగా ఉండాలా అన్న విషయంపై ఎలాంటి స్పష్టత లేకుండానే అసెంబ్లీలో తీర్మానాన్ని బీజేపీ ఎమ్మెల్యేలు సమర్థించారు. కానీ ఆ తర్వాతే అసలు కథ మొదలైంది.బీఆర్ఎస్ హయాంలో నాడు అలా..! బీసీ రిజర్వేషన్ల విషయంలో భారత రాష్ట్ర సమితి అధికారంలో ఉన్నప్పుడు ముస్లిం మైనారిటీలను బీసీల జాబితాలో చేర్చడాన్ని బీజేపీ నేతలు తీవ్రంగా వ్యతిరేకించారు. జాతీయ నాయకత్వం సైతం తాము అధికారంలోకి వస్తే ముస్లిం రిజర్వేషన్లను రద్దు చేస్తామంటూ ఆ పార్టీ అగ్రనేతల్లో ఒకరైన అమిత్ షా స్వయంగా ప్రకటించారు. మతం ఆధారంగా రిజర్వేషన్లు కల్పించడం రాజ్యాంగ విరుద్ధమని ఆ పార్టీ నేతలు అనేక సందర్భాల్లో వ్యాఖ్యానించారు. ముస్లింలను బీసీల్లో చేర్చడం ద్వారా బీసీలకు దక్కాల్సిన ప్రయోజనాలకు విఘాతం కల్గిస్తున్నారని దుయ్యబట్టారు. బీసీలకు జరిగే ఈ అన్యాయాన్ని తాము సహించబోమంటూ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. బీసీ జాబితాలో ముస్లింలను తొలగించి ప్రతిపాదనలు పంపిస్తే వాటికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలుపుతుందని బీజేపీ నేతలు అప్పట్లో ప్రకటించారు. అయితే ముస్లిం రిజర్వేషన్ల విషయంలో నాడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భిన్న వైఖరి అవలంబించడంతో నాటి బీఆర్ఎస్ సర్కారు కేంద్రానికి పంపించిన రిజర్వేషన్ల పెంపు ప్రతిపాదన అటకెక్కిందితెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత కుల గణన జరిపి, బీసీ కులాల లెక్కలను రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. అందులో ముస్లిం జనాభాలో దాదాపు 80% మందిని బీసీలుగా చూపించడంతో బీజేపీ నేతలు మరోసారి అగ్గిమీద గుగ్గిలమయ్యారు. గతంలో బీఆర్ఎస్, మళ్లీ ఇప్పుడు కాంగ్రెస్ కూడా మైనారిటీల మెప్పు కోసం బీసీలకు అన్యాయం చేస్తున్నాయంటూ బండి సంజయ్ వంటి నేతలు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. అయినా సరే రాష్ట్ర ప్రభుత్వం కులగణనతో సరిపెట్టకుండా, ఆ గణాంకాలను ఆధారంగా చేసుకుని బీసీ రిజర్వేషన్ల శాతాన్ని 28–29 శాతం నుంచి 42 శాతానికి పెంచుతూ రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానం సైతం చేసింది. విద్య, ఉద్యోగాలతో పాటు స్థానిక సంస్థల్లోనూ ఈ రిజర్వేషన్ల పెంపు అమలవుతుందని, ఇదొక విప్లవాత్మక నిర్ణయమని ఆ పార్టీ నేతలు ఎక్కడికక్కడ సంబరాలు చేసుకుంటున్నారు. అగ్రవర్ణాలకు చెందిన నేతలైన రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి బీసీల కోసం ఇంత చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంటే, తాను బీసీని అని చెప్పుకునే ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ రిజర్వేషన్ల పెంపును పార్లమెంటులో ఆమోదించి రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో పెట్టాలని కాంగ్రెస్ ఎంపీలు డిమాండ్ చేస్తున్నారు.భారతీయ జనతా పార్టీ రాజకీయంగా మాత్రమే కాదు.. విధానపరంగానూ ముస్లింలకు రిజర్వేషన్లు కల్పించడాన్ని మొదటి నుంచి వ్యతిరేకిస్తోంది. 'మతం' ఆధారంగా రిజర్వేషన్లు కల్పించడం రాజ్యాంగ విరుద్ధమని, ఆ పార్టీ వాదన. రిజర్వేషన్లు సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ అసమానతల ఆధారంగా కల్పించాలని, సామాజిక అసమానతలకు 'కుల వివక్ష' ఒక కారణమని విశ్లేషిస్తున్నారు. సాంఘికతంగా 'కులం' అన్నదే లేని మతంలో కుల ఆధారిత రిజర్వేషన్లు ఎలా ఇస్తారన్నది కమలదళ నేతల ప్రశ్న. ముస్లింలలో ఆర్థికంగా, విద్య, ఉద్యోగ రంగాల్లో వెనుకబాటు ఉన్నప్పటికీ.. కుల వివక్ష, సామాజిక అసమానతలు ఉండవని.. అలాంటప్పుడు "కులం" ఆధారంగా రిజర్వేషన్లు ఇవ్వడం కుదరదన్నది వారి వాదన. రిజర్వేషన్ల ఫలాలు అందుకోలేని అగ్రవర్ణాల కోసం "ఎకనమికల్లీ వీకర్ సెక్షన్ పేరుతో ఆర్థికంగా వెనుకబడిన అగ్రవర్ణాలు, రిజర్వేషన్ ఫలాలు అందుకోలేకపోతున్న వర్గాలకు 10 శాతం రిజర్వేషన్లను ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సారథ్యంలోని తమ ప్రభుత్వమే ఇచ్చిందని బీజేపీ నేతలు గుర్తుచేస్తున్నారు. కానీ మైనారిటీ ఓట్ల మెప్పు కోసం ఆ వర్గాలకు చెందినవారిని బీసీల జాబితాలో చేర్చి బీఆర్ఎస్, కాంగ్రెస్ వంటి రాజకీయ పార్టీలు బీసీలకు నిజానికి మేలు కంటే కీడే ఎక్కువ చేస్తున్నాయన్నది కమలదళం నేతల వాదన.రాష్ట్ర ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ల పెంపు తీర్మానం విషయంలో బీజేపీ ఎమ్మెల్యేలు వ్యవహరించిన తీరుపై ఆ పార్టీ అగ్రనాయకత్వం అసహనం వ్యక్తం చేసింది. పార్టీ వైఖరి ఏంటో తెలుసుకోకుండా సొంత నిర్ణయాలు తీసుకోవడం తగదని కాస్త గట్టిగా క్లాస్ పీకినట్టు తెలిసింది. కొత్తగా ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికలతో పాటు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపొందిన మల్క కొమురయ్య, అంజి రెడ్డిలను గురువారం ఢిల్లీలో బీజేపీ అగ్రనాయకత్వం దగ్గరకు రాష్ట్ర ముఖ్య నేతలు తీసుకెళ్లారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా, బీజేపీ జాతీయాధ్యక్షులు అమిత్ షాను నేతలు కలిశారు. ఈ సందర్భంగా బీసీ రిజర్వేషన్ల అంశం చర్చకు రాగా.. "బీసీ రిజర్వేషన్లకు బీజేపీ ఎప్పుడూ వ్యతిరేకం కాదని, కానీ ఆ పేరుతో ముస్లింలకు రిజర్వేషన్లు కల్పించడాన్ని మాత్రం అడ్డుకోవాలని" అమిత్ షా స్పష్టం చేశారు. ఈ విషయాన్ని నేతలు బయటికొచ్చిన తర్వాత మీడియాకు వెల్లడించారు.అమిత్ షా స్పందన, బండి సంజయ్ వంటి నేతలు ముందు నుంచి చేస్తున్న ప్రకటనలను బట్టి చూస్తుంటే.. తెలంగాణ ప్రభుత్వం తీర్మానించిన 42 శాతం బీసీ రిజర్వేషన్లను కేంద్ర ప్రభుత్వం ఆమోదించే ప్రసక్తే లేదని అర్థమవుతోంది. ముస్లింలను బీసీ జాబితా నుంచి తొలగిస్తే తప్ప ఈ తీర్మానానికి సైతం మోక్షం లభించే అవకాశం కనిపించడం లేదు..!

# శంషాబాద్ ఎయిర్ పోర్ట్ లో ప్రయాణికుల ఆందోళన

**రంగారెడ్డి ప్రజాబలం ప్రతినిధి**శంషాబాద్ ఎయిర్ పోర్టు లో ప్రయాణికులు అందోళనకు దిగారు. శ్రీనగర్ వయా శంషాబాద్ – బెంగళూరు వెళ్లాల్సిన ఎయిర్ ఇండియా విమానం అలస్యం అయింది. శంషాబాద్ ఎయిర్ పోర్ట్ నుండి బెంగళూరు వెళ్లాల్సిన 150 మంది ప్రయాణికులు పడిగాపులు గాచారు. విమానం ఆలస్యం పై ఎయిర్ లైన్స్ ఆధికారులతో వాగ్వాదానికి దిగారు. శ్రీనగర్ నుండి విమానం రాకుండానే బోర్డింగ్ ఎందుకు ఇచ్చారని ప్రయాణికులు ప్రశ్నించారు. ఎయిర్ లైన్స్ ఆధికారులు సరైన సమాధానం ఇవ్వకపోవడంతో వివాదం మొదలయింది.

# రోడ్డు ప్రమాదంలో పోలీసు అధికారి దుర్మరణం



**హయత్ నగర్ ప్రజాబలం ప్రతినిధి**హయత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని లక్ష్మారెడ్డి పాలెం కాలనీ జాతీయ రహదారి పై రోడ్ ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ఘటన లో ఆడిషన్ ఎస్పీ టి ఎమ్ నందీశ్వర బాబ్జీ అక్కడిక్కడే మరణించారు. శనివారం ఉదయం 4.30 గంటలకి వాకింగ్ వెళ్ళడానికి జాతీయ రహదారి దాటుతుండగా మొదటగా ఒక బస్ డీ కొట్టడం తో కిందపడ్డారు. వెనకాల వస్తున్న నూజివీడు డిపోకు చెందిన బస్ డి కొట్టడం తో అయన అక్కడిక్కడే మృతి చెందారు. గత మూడు రోజుల క్రితం బాబ్జీ కి ఏసీపీ నుండి ఆడిషన్ ఎస్పీ గా ప్రమోషన్ వచ్చింది,ప్రస్తుతం రాచకొండ కమిషనరేట్ లో కంట్రోల్ రూమ్ లో విధులు నిర్వహిస్తున్నారు.ఇంకో మూడు రోజుల్లో డిజిపి ఆఫీస్ లో రిపోర్ట్ చెయ్యాల్సి ఉండగా ఇంతలోనే ప్రమాదం చోటుచేసుకుంది.


# ఛెన్నైలో బీఆర్ఎస్, కాంగ్రెస్ చెట్టాపట్టాల్ ?

**హైదరాబాద్(ప్రజాబలం ప్రతినిధి మార్చి 22,** సీఎం రేవంత్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మధ్య ఏ అంశంలోనూ ఏకాభిప్రయం ఉండదని అనుకుంటారు. కానీ.. దక్షిణాదికి అన్యాయం విషయంలో ఇద్దరి మధ్య ఏకాభిప్రాయం వచ్చింది. స్టాలిన్ నేతృత్వంలో పోరాడేందుకు వారు సిద్ధమయ్యారు. శనివారం చెన్నైలో నిర్వహించిన దక్షిణాది రాష్ట్రాలకు చెందిన కీలక పార్టీల నేతల సమావేశానికి రేవంత్ తో పాటు కేటీఆర్ కూడా హాజరయ్యారుభారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం చెన్నైకి వెళ్లింది. డీలిమిటేషన్ విధానంపై చర్చించేందుకు చెన్నైలో జరగనున్న దక్షిణాది రాష్ట్రాల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సదస్సులో ప్రస్తుత డీలిమిటేషన్ విధానం వల్ల దక్షిణాది రాష్ట్రాలకు జరుగుతున్న , భవిష్యత్తులో జరగబోయే నష్టాలను ఎండగడుతూ, ఈ అన్యాయాన్ని నివారించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై కేటీఆర్ ప్రసంగించారు. కేటీఆర్ నాయకత్వంలో పలువురు బిఅర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులతో కూడిన బృందం ఈ సమావేశంలో పాల్గొంది. ప్రస్తుత డీలిమిటేషన్ విధానం దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యాన్ని బలహీనపరుస్తుందని, దీని వల్ల దేశ ఆర్థికాభివృద్ధికి కీలక పాత్ర పోషిస్తున్న ఈ రాష్ట్రాలకు తీవ్ర నష్టం జరుగుతుందని కేటీఆర్ ఈ సందర్భంగా హెచ్చరించారు. ఆది నుంచి ఈ విధానాన్ని పూర్తిగా వ్యతిరేకిస్తున్న బీఆర్ఎస్, తన పార్టీ విధానాన్ని సమావేశంలో వివరించింది. దక్షిణాది రాష్ట్రాలకు జరుగుతున్న అన్యాయాన్ని గుర్తించి, దాన్ని ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజేస్తూ, ఈ అంశంలో అందరికన్నా ముందుండి పోరాడుతున్న పార్టీ భారత రాష్ట్ర సమితి అని కేటీఆర్ పేర్కొన్నారు. దక్షిణాది రాష్ట్రాలన్నీ ఏకతాటిపైకి వచ్చి, దేశ ప్రగతికి బాటలు వేసిన ఈ రాష్ట్రాల ప్రజల భవిష్యత్తు కోసం కలిసి నిలబడతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సమావేశం దక్షిణాది రాష్ట్రాల ఐక్యతను బలోపేతం చేసి, కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న డీలిమిటేషన్ విధానంపై బలమైన వ్యతిరేకతను కేంద్రానికి చాటనుందని బీఆర్ఎస్ నాయకత్వం భావిస్తోంది.మరో వైపు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ హాజరయ్యారు. కర్ణాటక నుంచి డిప్యూటీ సీఎం శివకుమార్ హాజరు కాగా... తెలంగాణ సీఎం కూడా హాజరవ్వాలని శుక్రవారమే నిర్ణయించుకున్నారు.. స్టాలిన్ ఇండియా కూటమిలో కీలక నేత. ఆయన నిర్వహించే సమావేశానికి స్థాయి తగ్గకుండా వెళ్లాలని హైకమాండ్ సూచించడంతో రేవంత్ కూడా వెళ్లారు. ముందుగా పీసీసీ చీఫ్ ను పంపాలనుకున్నారు.ఇప్పుడు ఇద్దరూ చెన్నైకి చేరుకున్నారు.ఇప్పుడు బీఆర్ఎస్ పార్టీ తెలంగాణలో కాంగ్రెస్ పై పోరాడుతోంది.మరో వైపు ఆ పార్టీ తో కలిసి బీజేపీపై పోరాడేందుకు సిద్ధమవుతోంది. ఇది తెలంగాణలో కొన్ని రాజకీయ సమీకరణాలను మార్చే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటి వరకూ బీజేపీని .. బీఆర్ఎస్ పల్లెత్తు మాట అనడం లేదు. ఇప్పుడు కాంగ్రెస్ తోనూ కలిసి పని చేయాల్సిన పరిస్థితి వచ్చింది. దీన్ని బీఆర్ఎస్ ఎలా తన రాజకీయ విధానాలకు అనుగుణంగా మార్చుకుంటారన్నది ఆసక్తికరం.

# ఎంపీలు నో అంటుంటే... ఎమ్మెల్యేలు ఎస్

**హైదరాబాద్(ప్రజాబలం ప్రతినిధి మార్చి 22,** కాంగ్రెస్ సర్కార్ తెచ్చిన బీసీ రిజర్వేషన్ బిల్లు.. తెలంగాణ బీజేపీలో రచ్చకు దారి తీసింది. బీసీ రిజర్వేషన్ల పెంపునకు కేంద్రం అనుమతివ్వాలని కోరుతూ అసెంబ్లీలో బిల్లు పెట్టింది రేవంత్ ప్రభుత్వం. బీసీ రిజర్వేషన్ బిల్లుకు బీజేపీ ఎమ్మెల్యేలు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. బీసీ బిల్లుపై చర్చ సందర్భంగా బీజేపీ తరఫున ఆ పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ పాయల్ శంకర్ మాట్లాడుతూ అనేక అంశాలను ప్రస్తావించారు.ముందు నుంచి రాహుల్ గాంధీ ప్రస్తావిస్తున్న కులగణనపై విమర్శలు చేస్తున్న బీజేపీ జాతీయ నాయకత్వం ఇక్కడి ఎమ్మెల్యేల తీరుతో సమాధానం చెప్పుకునే పరిస్థితి వచ్చిందట.ఆయన ప్రస్తావించిన మాటలు పార్టీలో సెగలు పుట్టిస్తున్నాయి. పార్టీ లైన్‌కు క్వైట్ అపోజిట్‌గా..అసెంబ్లీలో పాయల్ శంకర్ కామెంట్స్ చేశారని అంటున్నాయి పార్టీ శ్రేణులు. ముఖ్యంగా మేమెంతో మాకంతే అనే కాంగ్రెస్ నినాదాన్ని ఆయన ఎలా ప్రస్తావిస్తారని ప్రశ్నిస్తున్నారు. జడ్పీటీసీలు, ఎంపీటీసీలే కాదు శాసనసభలో కూడా బీసీ రిజర్వేషన్లు కావాలని డిమాండ్ చేశారు పాయల్ శంకర్. ఈ కామెంట్స్ బీజేపీలో ఎమ్మెల్యేలు వర్సెస్ ఎంపీలుగా అన్నట్లుగా మారాయట.బీసీ రిజర్వేషన్ల బిల్లును బీజేపీ వ్యతిరేకిస్తుందని కాంగ్రెస్ అనుకుంది. కాంగ్రెస్ అలా అనుకోవడానికి కారణం ముస్లింలను బీసీల్లో కలిపి రిజర్వేషన్లు ఇవ్వాలని నిర్ణయించడమే. బీసీలతో కలిపి ముస్లింలకు రిజర్వేషన్లు ఇవ్వడాన్ని బీజేపీ ముందు నుంచి వ్యతిరేకిస్తుంది. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలోనూ ఇదే అంశాన్ని అమిత్ షా పదే పదే ప్రస్తావించారు. ముస్లిం రిజర్వేషన్లు తొలగించి ఆ రిజర్వేషన్లను బీసీలకు ఇస్తామని ప్రకటించారు.కానీ అందుకు భిన్నంగా అసెంబ్లీలో ముస్లింలతో కలిపి ఉన్న బీసీ రిజర్వేషన్ బిల్లుకు బీజేపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు మద్దతు తెలపడం ఇప్పుడు పార్టీలో అంతర్గత చర్చకు దారితీసింది. ఎమ్మెల్యేలు బీసీ బిల్లుపై అసెంబ్లీలో మాట్లాడిన మాటలను బీజేపీ ఎంపీలు వ్యతిరేకిస్తున్నారట. పార్టీ లైన్‌లో ఉన్నవారు ఎవరైనా ముస్లింలతో కలిపి బీసీ రిజర్వేషన్లు ఉన్న బిల్లును వ్యతిరేకిస్తారని..అలాంటి బిల్లుకు బీజేపీ ఎమ్మెల్యేలు ఎలా సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నారని అంటున్నారట. బీజేపీ ఎమ్మెల్యేలు అసెంబ్లీ వేదికగా మాట్లాడిన ప్రతి మాట జాతీయ నాయకత్వాన్ని ఇరకాటంలో పెట్టేలా ఉందంటున్నారట.తమ పార్టీని ఇరకాటంలో పెట్టడంలో సీఎం రేవంత్ రెడ్డి సక్సెస్ అయ్యారని బీజేపీ నేతలు గుసగుసలు పెట్టుకుంటున్నారట. బీసీలకు రిజర్వేషన్లు అంటూ ముస్లింలతో కూడిన బీసీ రిజర్వేషన్ల బిల్లుకు బీజేపీ ఎమ్మెల్యేల మద్దతు తీసుకోవడంతో బీజేపీ జాతీయ నాయకత్వం ఇరకాటంలో పడ్డట్టు అయిందట. 9వ షెడ్యూల్‌లో బీసీ రిజర్వేషన్లు చేర్చేందుకు కేంద్రం దగ్గరకు సీఎం రేవంత్ రెడ్డి డెలిగేషన్ తీసుకెళ్తే బీజేపీ నేతలు వెళ్ళాలా లేదా అన్న దానిపై చర్చ నడుస్తోంది. బీజేపీలో ఉన్న కేంద్ర మంత్రులు, ఎంపీలు ముస్లింలతో కూడిన రిజర్వేషన్లను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు.పైగా పార్టీ లైన్‌కు విరుద్ధంగా ముస్లింతో కూడిన బీసీ రిజర్వేషన్ బిల్లుకు ఎమ్మెల్యేలు మద్దతు ఎలా ఇస్తారంటూ అగ్గిమీద గుగ్గిలం అవుతున్నారట. ఇప్పుడు బీజేపీ ఎమ్మెల్యేలు చేసిన పనికి జాతీయ నాయకత్వం తలలు పట్టుకునే పరిస్థితి వస్తుందని ఎంపీలు టెన్షన్ పడుతున్నారట.ముందు నుంచి రాహుల్ గాంధీ ప్రస్తావిస్తున్న కులగణనపై విమర్శలు చేస్తున్న బీజేపీ జాతీయ నాయకత్వం ఇక్కడి ఎమ్మెల్యేల తీరుతో సమాధానం చెప్పుకునే పరిస్థితి వచ్చిందట. బీసీ బిల్లుకు బీజేపీ ఎమ్మెల్యేలు మద్దతు తెలిపే విధంగా చేయడంలో రేవంత్ రెడ్డి సక్సెస్ కావడంతో బీజేపీ ఇరకాటంలో పడింది. ఇదే ఇప్పుడు తెలంగాణ బీజేపీలో ఎంపీలు వర్సెస్ ఎమ్మెల్యేలు అన్నట్లుగా మార్చిందట. ఈ ఇష్యూ ఎటు వైపు టర్న్ తీసుకుంటుందో..బీజేపీ జాతీయ నాయకత్వం ఎలా స్పందిస్తుందో చూడాలి మరి.

# నేడు ప్రపంచ వాతావరణ శాస్త్ర దినోత్సవం




ప్రపంచ వాతావరణ శాస్త్ర దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం మార్చి 23న నిర్వహిస్తారు. ప్రకృతి సహజ ఆవసాలపై వాతావరణ మార్పులు చూపే ప్రభావం గురించి ప్రజలకు అవగాహన కలిగించడంకోసం ఈ దినోత్సవం జరుపుకుంటారు. సమాజపు భద్రత, శ్రేయస్సు కోసం జాతీయ వాతావరణ, జల సేవలు అందించే సహకారం గురించి ఈరోజు గుర్తుచేసుకుంటారు. వాతావరణంలో చోటుచేసుకుంటున్న మార్పులకు సంబంధించి వాతావరణంపై అధ్యయనం చేసేందుకు 1950, మార్చి 23న 180 దేశాల సభ్యత్వంతో ప్రపంచ వాతావరణ సంస్థ ప్రారంభించబడింది. ఆ సంస్థ ఏర్పడిన రోజును ప్రపంచ వాతావరణ శాస్త్ర దినోత్సవంగా నిర్ణయించబడింది. ఐక్యరాజ్య సమితి ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం ఈ దినోత్సవం జరుపబడుతుంది.

వాతావరణ శాఖ నిపుణుల ఆధ్వర్యంలో ప్రజలకోసం అవగాహన సమావేశాలు, ఛాయాచిత్ర ప్రదర్శనలు జరుగుతాయి.

వాతావరణ పరిశోధన చేసిన వాళ్ళకు ఈ దినోత్సవం సందర్భంగా అంతర్జాతీయ వాతావరణ సంస్థ బహుమతి, ప్రొఫెసర్ డాక్టర్ విల్హో వైసెల్ అవార్డు, ది నార్బర్ట్ గెర్బియర్-మమ్ అంతర్జాతీయ అవార్డు లు బహుమతులు అందజేయబడుతాయి.

ఈ దినోత్సవాన్ని జరుపుకోవడానికి చాలా దేశాలు తపాలా బిళ్ళలను, ప్రత్యేక తపాలా స్టాంపు గుర్తులను విడుదల చేస్తాయి.

# బీజేపీ వైపు యాంటి కాంగ్రెస్ ఓటింగ్

**హైదరాబాద్(ప్రజాబలం ప్రతినిధి మార్చి 22,** రాజకీయాల్లో మౌనం కూడా ఓ భాషే అంటారు రాజకీయ విశ్లేషకులు. మౌనం చాలా సమస్యలకు పరిష్కారం అంటారు. మౌనం అనేక భావాలకు ప్రతీక అని ఎవరికి నచ్చిన భావాన్ని వారు తీసుకోవచ్చని కూడా అంటారు. రాజకీయ మౌనం పాటిస్తూ.. అప్పుడప్పుడు పార్టీ క్యాడర్ కు సంకేతాలు పంపుతున్న గులాబీ బాస్ కేసీఆర్ తీరు ఆ పార్టీలో చర్చకు దారి తీస్తోంది. ఎందుకంటే గతంలో ద్విముఖ పోటీగా తెలంగాణ రాజకీయాలు ఉండేవి. అందులో నెంబర్ వన్ పార్టీగా బీఆర్ఎస్, ఆ తర్వాతి స్థానాల కోసం కాంగ్రెస్, బీజేపీలు పోటీ పడ్డాయి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక నెంబర్ గేమ్ మారింది. పోటీలోకి బీజేపీ వచ్చింది. బీఆర్ఎస్ ది రెండో స్థానమో లేక మూడో స్థానమో తెలియని పరిస్థితి ఉంది.

సాంకేతికంగా గత ఎన్నికల్లో ఎమ్మెల్యేలను బట్టి చూస్తే బీఆర్ఎస్ ది రెండో స్థానం. కాని ఆ తర్వాత జరిగిన రాజకీయ పరిణామాలను బట్టి గులాబీ పార్టీ ఏ స్థానంలో ఉంది అన్న ప్రశ్న తలెత్తుతోంది.పదేళ్ల అధికార రాజకీయాలు సాగించిన బీఆర్ఎస్ కు గత శాసన సభ ఎన్నికల్లో గట్టి దెబ్బ తగిలింది. ముచ్చటగా మూడో సారి అధికారంలోకి వచ్చి హ్యాట్రిక్ రికార్డ్ కొడదామనుకున్న కారు పార్టీకి కాంగ్రెస్ బ్రేకులు వేసి అధికార పీఠాన్ని తన్నుకుపోయింది. ఆ తర్వాత వచ్చిన పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఒక్కటంటే ఒక్క ఎంపీ సీటు గెలవలేక చతికల పడింది. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ 8 ఎంపీలు గెలిస్తే, బీజేపీ కూడా మిగతా 8 ఎంపీలను గెలుపించుకోగలిగింది. ఎం.ఐ.ఎం పార్టీ ఒక స్థానంలో గెలిచింది. పార్లమెంట్ లో గులాబీ ప్రాతినిధ్యమే లేకపోయిన పరిస్థితి. మరో వైపు బీజేపీ క్రమ క్రమంగా తన బలం పెంచుకుంటూ వస్తోంది. ఇటీవల జరిగిన 3 ఎమ్మెల్సీ స్థానాల్లో ఎన్నికలు జరిగితే రెండు స్థానాల్లో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీని కాదని బీజేపీ గెలుచుకుంది. ఈ గెలుపు అటు కాంగ్రెస్ ను, ఇటు బీఆర్ఎస్ ను షాక్ కు గురిచేస్తోంది. అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలో ఎక్కువ మంది ఎమ్మెల్యేలను బీజేపీ గెలిపించుకుంది, పార్లమెంట్ ఎన్నికల్లో 8 మందిని గెలిపించుకుంది. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఇద్దరిని ఇలా బీజేపీ క్రమ క్రమంగా చాప కింద నీరులా తెలంగాణలో తన బలం పెంచుకుంటూ పోతోంది.ఎమ్మెల్సీ ఎన్నికల్లో రెండు స్థానాలను బీజేపీ గెలుచుకోవడం ఇప్పుడు బీఆర్ఎస్ లో తీవ్ర చర్చకు దారి తీస్తోంది. ఎంపీ ఎన్నిల్లో, ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీకి బీఆర్ఎస్ సాయం చేసిందన్న చర్చ ఓ వైపు నడుస్తోంది.

ఇది నిజమా కాదా అన్న అయోమయంలో గులాబీ క్యాడర్ ఉంది. ఒక వేళ అదే నిజం అయితే బీఆర్ఎస్ భవిష్యత్తు ఏంటి అన్న ప్రశ్నలను పార్టీలోని లీడర్లు వారితో పాటు క్యాడర్ సంధిస్తున్నారు. అధికారంలో ఉన్న కాంగ్రెస్ ను టార్గెట్ చేస్తూ ఏడాదిగా రాజకీయాలు చేస్తున్నాం, మరో వైపు బీజేపీ ప్రతీ ఎన్నికల్లో తన బలం పెంచుకుంటూ ముందుకు సాగుతోంది. అటు పార్లమెంట్ ఎన్నికల్లో ఒక్క సీటు బీఆర్ఎస్ గెల్చుకోలేకపోయింది. ఇక ఎమ్మెల్సీ ఎన్నికల్లో అసలు బరిలోకే దిగలేదు. ఇదే పరిస్థితి కొనసాగితే వచ్చే ఎన్నికల నాటికి బీజేపీ రెండో స్థానంలో ఉండి బీఆర్ఎస్ మూడో స్థానం కోసం పోటీ పడాల్సి వస్తుందన్న నిరాశలో పార్టీ నేతలు, శ్రేణులు ఉన్నాయి. అటు కేంద్రంలో ఉన్న బీజేపీ, ఇటు రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీల మధ్య బీఆర్ఎస్ నలిగిపోతున్నట్లు పార్టీ కార్యకర్తలు అభిప్రాయపడుతున్నారు.గత ఏడాదిగా కాంగ్రెస్ పార్టీని టార్గెట్ చేస్తూ బీఆర్ఎస్ రాజకీయాలు చేస్తోంది. బీజేపీని మాత్రం చూసీ చూడనట్లు గులాబీ నేతలు వ్యవహరిస్తున్నారు. ఏడాది కాంగ్రెస్ పాలన తర్వాత ఆ పార్టీకి ప్రజల్లో వ్యతిరేకత పెరిగిందని గులాబీ నేతలు అభిప్రాయపడుతున్నారు. అయితే ఆ వ్యతిరేక పవనాలు బీఆర్ఎస్ వైపు కాకుండా బీజేపీకి లాభం చేకూరేలా ఉన్నాయన్న చర్చ సాగుతోంది. కాంగ్రెస్ వ్యతిరేకతను రాజకీయ లబ్ధిగా మార్చుకునే విషయంలో గులాబీ పార్టీ వెనకపడిందన్న అభిప్రాయం పార్టీ ముఖ్య నేతల వద్ద గులాబీ శ్రేణులు వ్యక్తం చేస్తున్నాయి. ఎమ్మెల్సీ ఎన్నికల్లో అభ్యర్థులను పెట్టకపోవడం పైన విమర్శలు గుప్పిస్తున్నాయి. అయితే కేసీఆర్ ముందుఈ విషయాలను ప్రస్తావించేందుకు ముఖ్య నేతలు ప్రస్తావించినా గులాబీ బాస్ మౌనం దాల్చినట్లు సమాచారం. ఇప్పటికైనా పార్టీ అధినేతగా క్యాడర్ కు బీజేపీ విషయంలో అనుసరించాల్సిన వ్యూహం బహిర్గతం చేయకపోతే రానున్న రోజుల్లో రాజకీయ ఇబ్బందులు తప్పవని ముఖ్యనేతలు సైతం అభిప్రాయపడుతున్నారుబీజేపీని దూకుడుగా ఎదుర్కోకపోతే మూడో స్థానంలో నిలవాల్సిన పరిస్థితి కారు పార్టీకి ఏర్పడుతుందని చెబుతున్నారు. అయితే ఏప్రిల్ 27 పార్టీ సిల్వర్ జూబ్లీ వేడుకల సందర్భంగా వరంగల్ లో నిర్వహిస్తున్న భారీ బహిరంగ సభ ద్వారా అయినా పార్టీకి టార్గెట్ పార్టీ ఏంటి, మళ్లీ అధికారంలోకి రావాలంటే ఎలాంటి వ్యూహంతో సాగాలన్న స్పష్టత గులాబీ బాస్ ఇవ్వాలని కోరుతున్నారు. ఇలాగే బీజేపీ విషయంలో మౌనం పాటిస్తే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో ఆపార్టీకి అడ్డుకట్ట వేయడం కష్టమని ఇది రాజకీయంగా పెద్ద దెబ్బ అవుతుందని, ఆ తర్వాత గులాబీ పార్టీ నుండి కమలం పార్టీకి నేతలు వలస వెళ్లే అవకాశం లేకపోలేదని విశ్లేషిస్తున్నారు.

# బెట్టింగ్ యాప్స్ తాట తీస్తున్న పోలీసులు

**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధిమార్చి 22,** తెలుగు రాష్ట్రాల్లో ప్రస్తుతం బెట్టింగ్ యాప్స్, బెట్టింగ్ గేమ్ లపై పోలీసులు ఫోకస్ చేశారు. టీఎస్ఆర్టీసీ ఎండీ సజ్జనార్ బెట్టింగ్ యాప్స్ నిర్వహిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని సూచనలతో ఏపీ, తెలంగాణ పోలీసులు బెట్టింగ్ యాప్స్ ప్రమోట్ చేసిన వారిపై కేసులు నమోదు చేసి విచారణకు నోటీసులు జారీ చేస్తున్నారు. ఈ క్రమంలో హైదరాబాద్ మెట్రో రైలు యాజమాన్యం అప్రమత్తమైంది. మెట్రో రైలు లోపల, మెట్రో రైలు కోచ్ లపై ఆన్ లైన్ బెట్టింగ్ యాప్ ప్రకటనలను తొలగించాలని నిర్ణయం తీసుకుంది.హైదరాబాద్ మెట్రో రైలు కోచ్‌లు, రైలు లోపల ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్ లపై ప్రకటనలు ఉన్నాయని ప్రజల నుంచి అభ్యంతరాలు వ్యక్తమవయ్యాయి. దీనిపై ఎల్ అండ్ టీ హైదరాబాద్ మెట్రో రైలు సంస్థ అప్రమత్తమైంది. మెట్రో రైళ్లలో బెట్టింగ్ యాప్ ప్రకటనలు, బెట్టింగ్ గేమ్ ప్రకటనలు ఉన్నట్లు తన దృష్టికి వచ్చిందని మెట్రో రైలు ఎండీ ఎన్వీస్ రెడ్డి తెలిపారు. తక్షణమే మెట్రో స్టేషన్లలో, మెట్రో రైలు కోచ్‌లపై, రైలు లోపల ఉన్న ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్ ప్రకటనలు తొలగించాలని యాడ్ ఏజెన్సీలను, ఎల్ అండ్ టీ సిబ్బందిని ఆదేశించినట్లు ఓ ప్రకటనలో పేర్కొన్నారు.సైబర్ సెక్యూరిటీ బ్యూరో డీజీ శిఖా గోయల్ ఆన్‌లైన్ బెట్టింగ్ పై స్పందించారు. తెలంగాణలో బెటింగ్ యాప్స్‌పై 2017 నుంచి బ్యాన్ ఉందని తెలిపారు. ఆన్‌లైన్ బెట్టింగ్ ఆడడం ఇల్లీగల్ అని, చట్ట ప్రకారం కేసులు నమోదు చేసి చర్యలు ఉంటాయన్నారు. తాము ఆన్‌లైన్ నుంచి ఇప్పటివరకు 108 బెట్టింగ్ యాప్స్ తొలగించినట్లు తెలిపారు. తెలంగాణ వ్యాప్తంగా ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లపై 800 వరకు కేసులు నమోదయ్యాయని శిఖా గోయాల్ వెల్లడించారు.యువత, విద్యార్థులు అక్రమ బెట్టింగ్ యాప్స్,గేమ్ యాప్‌లకి అలవాటు పడి అప్పులపాలై ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. అక్రమ బెట్టింగ్ యాప్స్‌లలో బెట్టింగ్‌కి పాల్పడిన, ఆన్‌లైన్ గేమింగ్ యాప్‌లలో గేమ్స్ ఆడిన, ప్రోత్సాహించిన కఠిన శిక్షలు తప్పవని కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావ్ హెచ్చరించారు.నేటి సమాజంలో సాంకేతిక పరిజ్ఞానం, సోషల్ మీడియా ప్రభావం బాగా పెరిగిందని తెలిపారు. ప్రతిఒక్కరికీ ఇంటర్నెట్ అందుబాటులో ఉండడం, కొన్ని సందర్భాల్లో అవగాహన లోపం వల్ల చాలామంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు అన్నారు. మోసపూరిత ప్రకటనలు, సందేశాలు చూసి మోసపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఆన్లైన్ బెట్టింగులు పెట్టడం, ఆన్లైన్‌లో గేమ్స్ ఆడటం, గుర్తింపు లేని సంస్థల్లో డబ్బు పెట్టుబడి పెట్టి ఆర్థిక నష్టాల బారిన పడుతున్నారని హెచ్చరించారు. తద్వారా జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారని తెలిపారు. అవగాహన లేక అత్యాశకు పోయి ఆన్లైన్‌లో పెట్టుబడులు పెట్టడం వల్ల మోసాలబారిన పడుతున్నారన్నారు. బెట్టింగ్ యాప్‌లు చాలా ప్రమాదకరమైనవి, వీటిల్లో ఒక్కసారి చిక్కుకుంటే బయటకు రావడం ఇబ్బంది అవుతుందని హెచ్చరించారు. యాప్ నిర్వాహకుల నుంచి బెదిరింపులు వస్తాయి అన్నారు. తక్కువ టైంలో ఎక్కువ డబ్బులు సంపాదించవచ్చన్న భ్రమలో యువత, విద్యార్థులు అక్రమ బెట్టింగ్ యాప్స్, గేమింగ్ యాప్స్‌కి బానిసలుగా మారుతున్నారు. అప్పులపాలపై ప్రాణాలకు మీదకు తెచ్చుకుంటున్నారు. విలువైన ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. ముఖ్యంగా సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయిన్సర్లు సోషల్ మీడియాలో వీటిని ప్రోత్సహించడం వల్ల యువతలో ఈ వ్యసనం పెరుగుతోందని ఆందోళన వ్యక్తమవుతోంది. వీటి కట్టడికి కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా పోలీస్ శాఖ ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.అక్రమ బెట్టింగ్ యాప్స్ లలో బెట్టింగ్ కి పాల్పడిన,ఆన్‌లైన్ గేమింగ్ యాప్‌లలో గేమ్స్ ఆడిన, ప్రోత్సాహించిన కఠిన శిక్షలు తప్పవని హెచ్చరించారు. ఆన్‌లైన్ బెట్టింగ్, గేమింగ్ యాప్‌లు ఆయా యాప్ నిర్వాహకుల సూచనల మేరకే ఆపరేట్ చేస్తారని, ఆన్లైన్ గేమింగ్ మాటున ప్రమాదకర మాల్ ప్రాక్టీస్ ఉంటుంది వ్యక్తి గత సమాచారం, అకౌంట్ వివరాలు తెలుసుకొనే అవకాశం ఉన్నందున గేమింగ్ యాప్‌ల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు.ఈ అక్రమ బెట్టింగ్ యాప్‌లను సోషల్ మీడియా వేదికగా ప్రచారం చేసే ఎవరిపైనా ఉపేక్షించేది లేదని ప్రజలు, యువత అప్రమత్తంగా ఉండి, ఇటువంటి కార్యకలాపాలపై వెంటనే డయల్ 100కు, స్థానిక పోలీస్ వారికి సమాచారం అందిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నార.? కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయిన్సర్లు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, బెట్టింగ్ యాప్‌లకు సంబంధించి ప్రచారాన్ని చేయవద్దన్నారు. ఆన్‌లైన్ బెట్టింగ్, ఆన్‌లైన్ గేమ్స్ వలన కలిగే పరిణామాల గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు

# ఆ ఇంట్లో కండోమ్స్ ఫ్యాక్టరీయే ఉందే

**వరంగల్ ప్రజాబలం ప్రతినిధి మార్చి 22,** వరంగల్ నగరంలో సంచలనం సృష్టించిన మైనర్ బాలిక కిడ్నాప్ కేసును మిల్స్ కాలనీ పోలీసులు చేధించారు. ఈ కేసులో ప్రధాన నిందితులైన వారిని పోలీసులు అరెస్టు చేశారు. మార్చి 11వ తేదీ వరంగల్ లోని మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఒక మైనర్ బాలిక మిస్సింగ్ అయిందని ఫిర్యాదు వచ్చింది. పోలీసులు తక్షణమే విచారణ ప్రారంభించారు. అయితే వారు ఆమెని ములుగు క్రాస్ రోడ్డు వద్ద గుర్తించారు. ఆమెని విచారించగా.. ఆమె చెప్పిన దారుణం అనుకున్నదానికి మించి ఉంది. బాధిత బాలిక చెప్పిన వివరాలు ఇలా ఉన్నాయి. తనను కొంతమంది యువకులు కిడ్నాప్ చేసి గంజాయి తాగించి, అత్యాచారం చేశారని చెప్పింది.డీసీపీ సన్ ప్రీత్ సింగ్, సెంట్రల్ జోన్ డీసీపీ ఆధ్వర్యంలో.. వరంగల్ ఏసీపీ పర్యవేక్షణలో మూడు బృందాలుగా ఏర్పడి నిందితుల కోసం గాలించి.. వారిని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనకి సంబంధించి ప్రధాన నిందితురాలు ములుగు జిల్లా దామెర మండలానికి చెందిన పడుపు వృత్తి చేసే మస్కులతను అదుపులోకి తీసుకున్నారు పోలీసులు. ఆమె దగ్గర మరో మైనర్ నిందితురాలిని కూడా అదుపులోకి తీసుకున్నారు. మైనర్ నిందితురాలి సాయంతో ఆమె బాలికను కిడ్నాప్ చేయించిందని పోలీసులు తెలిపారు.ఈ కిడ్నాప్‌లో మైనర్ బాలిక బాయ్ ఫ్రెండ్ అబ్దుల్ అఫ్సాన్ హస్తం కూడా ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. అబ్దుల్ అఫ్సాన్ సాయంతోనే బాలికకు గంజాయి తాగించి.. తమ ట్రాప్‌లో పడేలా చేశాడని పోలీసులు తెలిపారు. గంజాయితో పాటు.. స్నేహితులతో కలిసి అత్యాచారం కూడా చేశారని మైనర్ బాలిక తెలిపింది. ఆ సమయంలో వీడియో కూడా రికార్డ్ చేసినట్లు తెలిపింది. ఎవరికైనా చెబితే.. వీడియోలను సోషల్ మీడియాలో పెడతామని బెదిరించినట్లు ఆమె పోలీసులకు తెలిపింది. బాలిక ఫిర్యాదు మేరకు అబ్దుల్ అఫ్సాన్, అతడి స్నేహితులను అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు.

# హైటెక్ సిటీలో హైలెవల్ అద్దెలు

**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధిమార్చి 22,** హైదరాబాద్ మహానగరం విశ్వనగరంగా మార్పు చెందుతోంది. ప్రపంచంలోని నలుమూలల నుంచి పెద్ద పెద్ద కంపెనీలు హైదరాబాద్ నగరానికి వస్తున్నాయి. దేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి ఉద్యోగులు నగరానికి వచ్చి ఉద్యోగాలు చేస్తున్నారు. విదేశీయులు కూడా హైదరాబాద్‌కు వచ్చి ఉద్యోగాలు చేస్తుండటం గమనార్హం. అందులోనూ ఐటీ రంగం రోజు రోజుకు అమాంతంగా పెరిగిపోతుండటంతో.. నగరం వేగంగా అభివృద్ధి చెందుతోంది.

సాధారణంగా దేశంలోని మెట్రో సిటీస్‌తో పోల్చితే.. హైదరాబాద్‌లో కాస్ట్ ఆఫ్ లివింగ్ కాస్త తక్కువే అని గతంలో చెప్పేవాళ్లు. కానీ.. ఇప్పుడున్న పరిస్థితుల్లో హైదరాబాద్‌లో లివింగ్ కూడా చాలా కాస్ట్లీగా మారిందనిపిస్తోంది.ఐటీ రంగం పుణ్యమా అని నగరంలోని కొన్ని ప్రాంతాలు యమా కాస్లీగా మారాయి. సామాన్యుడికి ఊహలో కూడా అందనంత.. కనీసం ఊహించనంత ఖరీదుగా ఇండ్ల ధరలు ఉన్నాయి. ఇండ్లు కొనటం అంటుంచితే.. కనీసం రెంట్‌కి ఉండాలన్న లక్షలు చెల్లించాల్సిన పరిస్థితి. ఎందుకంటే.. ఆయా ప్రాంతాల్లో ఇండ్ల అద్దెనే రూ.4 నుంచి 5 లక్షలుంటుంది. ఇక విల్లాల అద్దెలైతే.. రూ.5 లక్షల పైమాటే. మరి హైదరాబాద్ నగరంలోని ఏఏ ప్రాంతాల్లో ఖరీదైన అద్దెలున్నాయో ఓ లుక్కేద్దాం పదండి..!హైదరాబాద్ నగరంలోని ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, కోకాపేట, హైటెక్ సిటీ ప్రాంతాల్లోని లగ్జరీ అపార్ట్‌మెంట్లు అత్యంత ఖరీదైన అద్దెలు వసూలు చేస్తున్నట్టు తెలుస్తోంది. మరి ఈ ప్రాంతాల్లోని అత్యంత ఖరీదైన కొన్ని అపార్ట్ మెంట్ల వివరాలు చూద్దాం..

1. జయభేరి ది పీక్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్
అద్దె: రూ.4- 4.5 లక్షలు/నెలకు
నర్సింగిలో ఉన్న ఈ ప్రాజెక్ట్ అత్యాధునిక సౌకర్యాలతో రూపొందించబడింది. క్లబ్ హౌస్, ల్యాండ్‌స్కేప్డ్ గార్డెన్స్, రూఫ్‌టాప్ స్విమ్మింగ్ పూల్ లాంటి సదుపాయాలు అందుబాటులో ఉంటాయి.

2. ఫార్చ్యూన్ సోంటాలియా స్కై విల్లాస్, కోకాపేట
అద్దె: రూ.3.5-4.5 లక్షలు/నెలకు
6,333-7,333 చదరపు అడుగుల 4bhk స్కై విల్లాలు అందుబాటులో ఉన్నాయి. గండిపేట్ చెరువు అందాలను ఆస్వాదించేందుకు ఇది బెస్ట్ ప్రాపర్టీ.

3. మై హోం భూజా, హైటెక్ సిటీ
అద్దె: గరిష్ఠంగా రూ. 3.2 లక్షలు/నెల
హైటెక్ సిటీలోని ఈ అపార్ట్‌మెంట్ 3, 4, 5bhk అపార్ట్‌మెంట్లతో లగ్జరీ లివింగ్ అనుభూతిని అందిస్తుంది. స్కై లాంజ్, స్విమ్మింగ్ పూల్, స్పా లాంటి ఫీచర్లు ఉన్నాయి.

ఇక.. అపార్ట్‌మెంట్ల సంగతి అంటుంచితే.. లగ్జరీ విల్లాల అద్దెలు వింటేనే షాక్ కొడుతుంది. మరి లగ్జరీ విల్లాల అద్దెలు ఎలా ఉన్నాయో చూద్దాం..

1. జయభేరి టెంపుల్ ట్రీ, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్
అద్దె: రూ.5-5.8 లక్షలు/నెలు
లగ్జరీ విల్లాలు, ఆధునిక డిజైన్, ఆకర్షణీయమైన గ్రీన్ ల్యాండ్‌స్కేప్‌తో ఈ ప్రాజెక్ట్ ప్రత్యేకమైంది.

2. ఆదిత్య కాసా గ్రాండ్, గండిపేట
అద్దె: రూ.4.5 లక్షల పైమాటే
4, 5bhk విల్లాలు, స్పేషియస్ ఇంటీరియర్స్, ప్రీమియం సౌకర్యాలతో టాప్ లగ్జరీ విల్లాల్లో ఇదీ ఒకటి.

3. మై హోం అంకుర్, తెల్లాపూర్
అద్దె: రూ.3.5-4.5 లక్షలు/నెలకు
తెల్లాపూర్‌లో 4bhk విల్లాలు, ఆధునిక సౌకర్యాలు, హై-ఎండ్ లివింగ్ అనుభూతితో ప్రత్యేకమైన ప్రాజెక్ట్ ఇది.

కేవలం ఇవే కాకుండా.. నగరంలోని ఆయా ప్రాంతాల్లో వెలిసిన ఆకాశాన్ని తాకే టవర్లలో ఇల్లు కొనటమే కాదు అద్దెకు ఉండటం కూడా చాలా ఖరీదుగా మారింది. లక్షల్లోనే అద్దె చెల్లించాల్సిన పరిస్థితి ఉంది.

# భగత్ సింగ్ స్ఫూర్తితో పోరాడాలి




నర్సంపేటప్రతి విద్యార్థి భగత్ సింగ్ రచనలను అధ్యయనం చేస్తూ, భగత్ సింగ్ స్ఫూర్తి తో పోరాడాలని సినియర్ జర్నలిస్ట్ రాఘవ శర్మ పిలుపునిచ్చారు.భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్‌ల 94వ వర్ధంతి సందర్భంగా ఎస్వీ యూనివర్సిటీ ఎస్వీ ఆర్ట్స్ ఆడిటోరియంలో పిడిఎస్ఓ జిల్లా నాయకులు స్రవంతి ఆధ్వర్యంలో పిడిఎస్ఓ జిల్లా కార్యదర్శి ఆర్.ఆష అధ్యక్షతన సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా రాఘవ శర్మ మాట్లాడుతూ, సామ్రాజ్యవాద దోపిడీని సాధ్యమైనంత ఎక్కువ కాలం కొనసాగించే గాంధీ అహింసవాద పద్ధతుల్ని భగత్ సింగ్ వ్యతిరేకించారని వివరంచాడు.భగత్ సింగ్ సామ్రాజ్యవాదాన్ని తరిమివేయటమే కాక,వారి నీడ కూడా ఈ దేశం మీద పడకూడదని, అప్పుడే ఈ దేశ ప్రజలు కార్మిక,కర్షక రాజ్యాన్ని, సంపూర్ణ స్వాతంత్ర్యాన్ని సాధించు కున్న వారం అవుతామన్నారు.సామ్రాజ్యవాద వ్యతిరేక చైతన్యాన్ని ప్రజల్లో వ్యాపించేట్టు తీవ్రంగా కృషి చేశారు. టెర్రరిజం నుండి మార్క్సిస్టు దాకా ఎదిగాడని,గాంధీ మార్గానికి భిన్నంగా మార్క్సిస్టు మార్గాన్ని యువతరానికి భగత్ సింగ్ సూచించాడని తెలిపాడు.గాంధీ, నెహ్రూలు సామ్రాజ్యవాదులకు తొత్తుగా వ్యవహరించారని, ఆనాడు భగత్ సింగ్ ఉరిశిక్ష తప్పించడానికి ప్రయత్నం చేయకపోగా ముందుగానే ఉరిశిక్ష వేయాల్సిందిగా సలహా ఇచ్చారని విమర్శించాడు. ఈనాడు పాలకులు పెంచి పోషిస్తున్న నిరుద్యోగాన్ని, పేదరికాన్ని ప్రశ్నించకుండా ఉండటం కోసం, భగత్ సింగ్ గురించి విద్యార్థి యువకులకు తెలియనివ్వకుండా జాగ్రత్త పడుతున్నారని అన్నాడు.నేటి విద్యార్థి, యువత భగత్ సింగ్ ను చదవాలని, ఆయనను స్ఫూర్తిగా తీసుకుని, దేశంలో ఉన్న అసమానతలకు వ్యతిరేకంగా పోరాడాలన్నారు.పిడిఎస్ఓ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.సురేష్ మాట్లాడుతూ, షహీద్ భగత్సింగ్ తన ఏడేళ్ల రాజకీయ జీవితకాలంలో బ్రిటీష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా, ప్రపంచంలోని సామ్రాజ్యవాదం సమూలంగా అంతం కావాలని, భారతదేశానికి సంపూర్ణ స్వరాజ్యం కావాలని పోరాడాడన్నారు.అంతేకాక మత కలహాలు అంతం అవ్వాలని,మతాచారాల పేరిట సాగుతున్న మూఢ విశ్వాసాలు తొలగిపోవాలని అన్నాడు.కుల వ్యవస్థ రద్దు కావాలని అన్నాడు.స్వాతంత్ర్యం అంటే జెండా మారడం కాదని, ప్రజలపై జరిగే అన్ని రకాల దోపిడీ అంతం కావడం అని ఆనాడే దేశ ప్రజలకు భగత్ సింగ్ స్పష్టం చేశాడని వివరించాడు.నేడు మన పాలకులు విద్యా, వైద్యం మొదలుకొని అన్ని రంగాలను ప్రైవేటీకరిస్తూ కార్పొరేట్లకు దేశ సంపదను దోచిపెడుతున్నారన్నారు. జాతీయ విద్యా విధానం 2020 పేరుతో కేంద్ర ప్రభుత్వం విద్యారంగంపై సాగిస్తున్న దాడి పేద, మధ్యతరగతి విద్యార్థుల్ని డ్రాపౌట్లుగా మిగల్చడానికి మాత్రమే తోడ్పడుతుందనీ, పాఠ్యాంశాల్లోకి కాషాయికరణను,మూఢ విశ్వాసాలను చొప్పిస్తూ, చరిత్ర వక్రీకరిస్తున్నారన్నారు.విద్యార్థులు తప్పకుండా చదువుకోవాలి. చదువుతోపాటు సమాజంలోని సమస్యలపై పోరాడాలని అన్నాడు.లేదంటే వారికి మనుగడ ఉండదని అన్న భగత్ సింగ్ నుండి విద్యార్థులు స్ఫూర్తిని పొంది , సామాజిక సమస్యలపై పోరాడాలన్నారు.ఎన్.వి.యూనివర్సిటీ డా.డి.గోవిందులు మాట్లాడుతూ, అయోధ్య రామ మందిరం వివాదం, ఆర్టికల్ 370 రద్దు, పౌరసత్వ చట్టాలు తీసుకువస్తూ, పాలకులు పెంచి పోషిస్తున్న మత దురహంకార ప్రవాహంలో నేటి యువత కొట్టుకుపోతోందన్నారు. హిందువుల ఓటు బ్యాంకు కోసం మతపరమైన అంశాలను పాలకుల ఉద్దేశ్యపూర్వకంగా లేవనెత్తుతున్నారని, సోషల్ మీడియా మాధ్యమాలను మత విద్వేష ప్రచారానికి వేదికగా వాడుతున్నారని,గో రక్షణ పేరుతో దళితులపై, ముస్లింలపై అమానుషంగా దాడులకు సైతం పాల్పడుతున్నారన్నారు. ప్రజల పక్షాన నిలబడి పోరాడుతున్న రచయితలు, ప్రజాతంత్ర వాదులు, సామాజిక కార్యకర్తలపై తప్పుడు కేసులు బనాయిస్తున్నారని,తిరుపతి బుక్ ఫెయిర్లో బుక్ హౌస్ మీద దాడి చేశారని,హైదరాబాద్ బుక్ ఫెయిర్లో కూడా ఇలాంటి దాడే జరిగిందని,ఈ విధంగా మతం పేరుతోనో, దేవుడు పేరుతోనో దాడులు, మత విద్వేషాలకు పాల్పడటం వంటి చర్యలు, ఘటనలు కో కొల్లలుగా ఉన్నాయన్నారు. ఏ జాతి వారైనా,ఏ కులం వారైనా,ఏ జాతీయతకి చెందిన వారైనా, ఏ దేశం వారైనా ప్రపంచంలోని పేద ప్రజల హక్కులన్నీ ఒక్కటే. మతం,రంగు,కులం, జాతీయత,దేశం అనే తేడాలను చెరిపెయ్యాలన్నాడు.ఈ మార్పు యువతలో వస్తే ఈ దేశ భవిష్యత్తు ఉజ్వలంగా మారుతుందన్న భగత్సింగ్ స్ఫూర్తితో మతోన్మాదాన్ని పెంచిపోషిస్తున్న పాలకుల విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలన్నారు.పిడిఎస్ఓ రాష్ట్ర అధ్యక్షులు ఎన్ భాస్కర్ మాట్లాడుతూ, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రతి సంవత్సరం రెండు కోట్ల ఉద్యోగాలు భర్తీ చేస్తామని, మన రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం 20 లక్షల ఉద్యోగాలను కల్పిస్తామని యువతను నమ్మించి అధికారంలోకి వచ్చారని, ఇప్పటివరకు దేశంలో 5 లక్షలకి మించి ఉద్యోగాలు భర్తీ చేయలేదని, రాష్ట్రంలో అయితే నోటిఫికేషన్ల విడుదల తప్ప పోస్టులు భర్తీ చేయడం జరగడం లేదన్నారు. అంతేకాక సామ్రాజ్యవాద బహుళజాతి కంపెనీలకు కావాల్సిన కారుచౌక కూలీలు దొరికే మార్కెట్టుగా భారతదేశాన్ని మార్చారన్నారు. పాలకులు అనుసరిస్తున్న ఈ విధానాలను ప్రశ్నించకుండా ఉండడానికి మద్యం, మత్తుపదార్థాలు, అశ్లీల సినిమాలు, వీడియోలు వంటి విష సంస్కృతి మత్తులో యువతను ముంచుతున్నారన్నారు.పిడిఎస్ఓ రాష్ట్ర నాయకులు కె.తిరుమలేష్ ఈ సభను ముగిస్తూ మాట్లాడగా,సభలో యూనివర్సిటీలోని వివిధ డిపార్ట్మెంట్ల నుండి 250 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

# బద్వేల్ రూరల్ సీఐ కి ప్రతిష్టాత్మక సేవా పథకం



బద్వేల్ రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ గా పనిచేస్తున్న నాగభూషణ్ , ఈ ఏడాది తెలుగు నూతన సంవత్సరం ఉగాది పండుగను పురస్కరించుకొని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వము ఈ రోజు ప్రకటించిన ఉగాది పురస్కారములలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పోలీస్ మహోన్నత సేవా పథకమును ప్రకటించినారు. ఈ మహోన్నత సేవా పథకమును ఈ ఏడాది నవంబరు 1 వ తేదీన అమరావతిలో జరిగే ఆంధ్ర రాష్ట్ర అవతరణ ఉత్సవములలో భాగంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా నాగభూషణ్, ఇన్స్పెక్టర్ అందుకోనున్నారు. . నాగాభుషణ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పోలీసు శాఖలో నిస్వార్థముగా చేసిన సేవలను గుర్తించి ఈ అవార్డుకు ఎంపిక చేయటము జరిగినది.

గతంలో చిత్తూరు జిల్లా చంద్రగిరి పోలీస్ స్టేషన్, నంద్యాల జిల్లా ఆత్మకూరు రూరల్, కడప జిల్లా పులివెందుల అర్బన్, మైదుకూరు రూరల్, కడప తాలూకా ఇంటలిజెన్స్, టాస్క్ ఫోర్సు లలో సమర్థవంతంగా పనిచేసి అనేక రివార్డులు,అవార్డులు పొందారు. ప్రస్తుతం బద్వేల్ రూరల్ సర్కిల్ నందు డ్యూటీ చేస్తున్నారు.. నాగభూషణ్ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర పోలీసు మహోన్నత సేవా పథకం రావడము పట్ల మైదుకూరు డి.ఎస్.పి. జి. రాజేంద్ర ప్రసాద్ అభినందనలు తెలిపినారు.

# ప్రతి నీటి చుక్కనూ ఒడిసి పట్టాలి

## ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా

## జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి




**కరీంనగర్ ప్రజాబలం ప్రతినిధి**ప్రతి వర్షం నీటి చుక్కను ఒడిసి పట్టాలని నీటి వృధాను పూర్తిగా అరికట్టాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు.తిమ్మాపూర్ మండలంలోని ఎల్ ఎం డి కాలనీలో గల మిషన్ భగీరథ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం ప్రపంచ నీటి దినోత్సవం నిర్వహించారు.మిషన్ భగీరథ శాఖ ఆధ్వర్యంలో, యూనిసెఫ్ సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి హాజరయ్యారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ మానవ మనుగడకు నీటి లభ్యత కోసం వెతకాల్సిన పరిస్థితి రావడం బాధాకరమని అన్నారు వర్షాధార నీటిని కాపాడుకోవాల్సిన అవసరం ప్రతి ఒక్కరి పైనా ఉందని అన్నారు. మురుగునీరు వెళ్లేందుకు ఇంటిలో పకడ్బందీ ఏర్పాట్లు చేసుకుంటున్నట్టుగానే ప్రతి ఇంట్లో వర్షాధార నీటిని నిల్వ చేసే ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. నీటి సంరక్షణ చర్యల్లో భాగంగా మరిన్ని చెక్ డ్యాములు, ఇంకుడు గుంతల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని అన్నారు. మిషన్ భగీరథ ద్వారా స్వచ్ఛమైన, విలువైన తాగునీరుని సరఫరా చేస్తున్నామని, ఈ నీటిని వృధా చేయరాదని సూచించారు. మిషన్ భగీరథ సిబ్బంది ఎప్పటికప్పుడు గ్రామాల్లో ప్రజల ముందే నీటి నాణ్యత పరీక్షలు నిర్వహించాలని అన్నారు. వేసవి తీవ్రత దృష్ట్యా అసిస్టెంట్ ఇంజనీర్లు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంటూ తాగు నీటి సరఫరా సజావుగా సాగేలా చూడాలని అన్నారు. మొక్కల సంరక్షణకు చర్యలు చేపట్టాలని సూచించారు.

అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ మిషన్ భగీరథ తాగునీటి సరఫరాలో ఎక్కడైనా లోపాలు ఉంటే గుర్తించి సరిచేయాలని అన్నారు. నీటి వృధాను అరికట్టేందుకు గ్రామ కార్యదర్శులు ప్రతి ఇంటిలోని నల్లాకు ఆన్ ఆఫ్ ఉండేలా గ్రామస్తులకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఓవర్ హెడ్ ట్యాంకులు, సరఫరా చేసే పైపుల నుండి నీరు వృధా కాకుండా చూడాలని, ఎప్పటికప్పుడు మరమ్మతులు చేయాలని ఆదేశించారు. వేసవి దృశ్య చివరి ఇంటి వరకు తాగు నీరు అందేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.ఈ సందర్భంగా నీటిని వృధా చేయరాదని ప్రతిజ్ఞ చేశారు.ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ ఎస్.ఇ కే.రాములు. ఇ.ఇలు అంజన్ రావు, రామ్ కుమార్, ప్రభుత్వ వసతి గృహాల విద్యార్థులు పాల్గొన్నారు.

# అక్రమ అరెస్టులను సహించేది లేదు బయపడేది లేదు

## బీఆర్ఎస్ వై చొప్పదండి నియోజకవర్గం

## అధ్యక్షులు బంధారపు అజయ్ కుమార్ గౌడ్



చొప్పదండిబీ ఆర్ ఎస్ వై,బీ ఆర్ ఎస్ వి ఆధ్వర్యంలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి పిలుపునివ్వడంతో ముందస్తుగా పలువురు బీ ఆర్ ఎస్ వై,బీ ఆర్ ఎస్ వి నాయకులను శనివారం అరెస్టు చేసి కరీంనగర్ జిల్లా చొప్పదండి మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ లో ఉంచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇలాంటి అరెస్టులకు భయపడేది లేదు, సహించేది లేదంటూ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఇలాంటి అరెస్టుల వళ్ళ ప్రతిపక్షాల గొంతు నొక్కడం తప్ప వేరే ఏమీ లేదని అన్నారు. ప్రజల తరపున ప్రభుత్వాన్ని అడుగుతే అక్రమ అరెస్టులా అని తీవ్రంగా ఖండించారు. అలాగే ఉస్మానియా యూనివర్సిటీలో జారీ చేసిన సర్కులర్ ను వెంటనే వెనక్కు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కును కాల రాస్తున్నారని ప్రజలు అన్నీ గమనిస్తున్నారని,త్వరలో బుద్ధి చెప్తారని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.ముందస్తు అరెస్ట్ అయిన వారిలో లోచొప్పదండి యువజన విభాగం నియోజకవర్గం ఇంచార్జ్ బంధార అజయ్ కుమార్ గౌడ్, చొప్పదండి మండల యువజన విభాగం అధ్యక్షుడు మారం యువరాజ్, నియోజకవర్గ ఉపాధ్యక్షుడు భక్తి విజయ్ కుమార్,చొప్పదండి మండల ప్రధాన కార్యదర్శి జనప శేఖర్, చొప్పదండి విద్యార్థి విభాగం మండల అధ్యక్షుడు సిరవేణి శ్రీకాంత్,చొప్పదండి విద్యార్థి భాగం పట్టణ అధ్యక్షుడు నరేష్, రావణ్, మండల్ జనరల్ సెక్రెటరీ దాసరి అనిల్, మోదుంపల్లి రాజేందర్, పోరండ్ల నితీష్, ఎండి షరీఫ్, తదితరులు పాల్గొన్నారు

# నెల్లూరు లో మంత్రి నారాయణ పర్యటన

నెల్లూరులో పురపాలకశాఖా మంత్రి పొంగూరు నారాయణ తెల్లవారుజామున సుడిగాలి పర్యటన చేశారు. మున్సిపల్ పార్కులు ,స్కూల్స్ లో అభివృద్ధి పనులను పరిశీలించి పలు సూచనలు ఇచ్చిన మంత్రి నారాయణ ,పనుల్లో అలసత్వం వహించవద్దని హెచ్చరించారు. నిర్దేశిత సమయంలో పనులు పూర్తి చేయాలని ఆదేశం జారీ చేసారు. ప్రతీ లే అవుట్ లో పార్కుకి స్థలం వదలాలన్నారు. 2014 లో మంత్రిగా ఉన్నప్పుడే పార్కుల అభివృద్ధిని యజ్ఞంలా చేపట్టామని ,గతప్రభుత్వ నిర్లక్ష్యంతో పార్కులు నిర్వీర్యం అయ్యాయని చెప్పారు.

# ముంతాజ్ హోటల్ అనుమతులు రద్దు

## స్వాగతించిన బీజేపీ

తిరుపతి తిరుమల ముంతాజ్ హోటల్ అనుమతులు రద్దు చేయడాన్ని స్వాగతిస్తున్నామని టీటీడీ బోర్డు మెంబర్ భాను ప్రకాష్ అన్నారు. అలిపిరి రహదారిని టెంపుల్ కారిడార్ గా ప్రకటించి.. భవిష్యత్ లో కమర్షియల్ కట్టడాలు నిర్మించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అదే విధంగా గత ప్రభుత్వ హయాంలో పరకామణిలో 100 కోట్ల ఫారిన్ కరెన్సీ దోచుకున్నా రని చెప్పారు. దీనిపై విచారణ చేపట్టి కఠినమైన చర్యలు తీసుకోవాలన్నారు. సీఐడీ ఎంక్వయిరీ వేయాలని.. అవకతవకలు బయటపెట్టాలని కోరారు.తిరుమల శ్రీవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

# ట్రాఫిక్ జామ్ తో - వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు

శంకర్ పల్లి మండలంలో శుక్రవారం రాత్రి భారీ వర్షం కురిసింది ... సుమారు గంటపాటు కురిసిన వర్షానికి వికారాబాద్, సంగారెడ్డి,చేవెళ్ల వెళ్లే రోడ్లపై వర్షపు నీరు నిలువడం, పెద్ద ఎత్తున ట్రాఫిక్ జామ్ కావడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

# టెన్త్ఎగ్జామ్ సెంటర్లో సీసీ కెమెరాల దొంగతనం

శ్రీకాకుళం రణస్థలం మండలం పైడిభీమవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎనిమిది గదులలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఆ కెమెరాలను చోరీ చేశారు. ఈ విషయమై ఉపాధ్యా యులు చుట్టూ పక్కల ఆరా తీసినా.. సీసీ కెమెరాలు ఎవరు తీశారన్నది తేలలేదు. దీనిపై సీఎస్ జగన్నాథరావు జె.ఆర్ పురం పిఎస్ లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎస్. చిరంజీవి తెలిపారు.

# ఓయూ సర్క్యులర్ ను వ్యతిరేకించిన ఏబీవీపీ

హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధిఉస్మానియా యూనివర్సిటీ లో ఓయూ అధికారులు అప్రజాస్వామికంగా ఇచ్చిన సర్క్యులర్ ను ఏబీవీపీ నాయకులు తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ మేరకు ఆర్ట్స్ కళాశాల అవరణలో పత్రిక సమావేశం నిర్వహించి మాట్లాడారు. 2025 మార్చ్ 13 వ తేదీని ఉస్మానియా యూనివర్సిటీ లో బ్లాక్ డే గా ప్రకటిస్తున్నాం అని అన్నారు. వందేమాతరం ఉద్యమం నుండి తెలంగాణ ఉద్యమం వరకు రాష్ట్రంలో ఏ సమస్యా ఉన్న కానీ తీర్చి దిద్దే గడ్డ ఉస్మానియా యూనివర్సిటీ అని అన్నారు. వర్సిటీలో ధర్నాలు, నిరసనలు చేయొద్దు అంటూ అధికారులు ఇచ్చిన సర్క్యులర్ ను విడుదల చేయడం సిగ్గు చేటు అని మండిపడ్డారు. ఇప్పటికే సర్క్యులర్ ఇచ్చి పది రోజులు అయినప్పటికి వర్సిటీ అధికారులు స్పందించకపోవడం గమనార్హం అని అన్నారు. చట్టాన్ని కాపాడాల్సిన పోలీసులు ఓయూ అధికారులు ఇచ్చిన సర్క్యులర్ కు వత్తాసు పలుకుతూ ఉస్మానియా యూనివర్సిటీ పోలీస్ స్టేషన్లో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడ్డం సిగ్గుచేటు అన్నారు. ఈస్ట్ జోన్ డిసిపి బాలస్వామి ఓయూ లో చట్ట వ్యతిరేక కార్యకలాపాలు జరగడానికి అవకాశం ఉందని మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. మనమేమైనా ఛత్తీస్ ఘడ్ అడవులలో ఉన్నామా లేదా విశ్వవిద్యాలయంలో ఉన్నామా అని ధ్వజమెత్తారు. ఇప్పటికైనా ఓయూ అధికారులు స్పందించి సర్క్యులర్ ను వెనక్కి తీసుకోకపోతే రానున్న రోజుల్లో విసి బిల్డింగ్ ను అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు.

## మార్చి 24 న తల పెట్టిన సాగునీరు త్రాగునీరు ధర్నాను జయప్రదం చేయండి

## కన్వీనర్ కొత్తకాపు శేషాద్రి రెడ్డి

దేవనకొండ మార్చి 22 పందికోన రిజర్వాయర్ కింద ఆయకట్టుకు సాగునీరు త్రాగునీరు గ్రామాలకు అందించాలని ఈ నెల 24 న తలపెట్టిన ధర్నాను జయప్రదం చేయాలని పందికొన రిజర్వాయర్ ఆయకట్టు సాధన సమితి కన్వీనర్ కొత్తకాపు శేషాద్రి రెడ్డి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన శనివారం పాత్రికేయులతో మాట్లాడుతూ రాష్ట్రంలోనే అత్యంత వెనుకబడిన ప్రాంతం కర్నూలు జిల్లా ప్రాంతమైన దేవనకొండ పత్తికొండ ఆస్పరి గోనెగండ్ల ప్రాంతాలన్నారు. పందికోన రిజర్వాయర్ వస్తే తమ కష్టాలు తీరుతాయని ప్రజలు ఎంతో ఆశపడ్డారు అన్నారు. కానీ పరిమితుల సమస్యల వల్ల పందికొన రిజర్వాయర్ లక్ష్యం నెరవేరలేదన్నారు. ప్రజలకు రైతులకు త్రాగునీరు సాగునీరు కోసం చాలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పందికోన రిజర్వాయర్ కింద 61,400 ఎకరాలకు సాగునీరు రావాల్సి ఉన్న కేవలం 10,000 ఎకరాలకు మించి నీరు అందడం లేదన్నారు. మిగతా 51,400 ఎకరాలకు సాగునీరు అందించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.ఈ నెల 24 న ఉదయం 10 గంటలకు రైతులు ప్రజలు పత్తికొండ తహసీల్దార్ కార్యాలయం ముందు జరిగే ధర్నాలో అందరూ పాల్గొనాలని ఆయన కోరారు.

# కాలుష్యంతో అల్లాడుతున్న మూల స్వయంవరం గ్రామం

## గ్రామస్థులను వెంటనే తరలించాలని డిమాండ్



పరవాడ పరవాడ మండలం కలపాక పంచాయతీ మూల స్వయంవరం గ్రామాన్ని వెంటనే సురక్షితమైన ప్రాంతానికి తరలించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి జి కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. శనివారం ఆయన గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా మహిళలు వృద్ధులు గ్రామంలో ఎన్టిపిసి కాలుష్యం వలన పడుతున్న ఇబ్బందులను వివరించారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ మూల స్వయంవరం గ్రామం అత్యంత కాలుష్య కారకమైన గ్రామంగా ఉందని వెంటనే తరలించడానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. కిడ్నీ, చర్మ సంబంధిత, కంటి, ఊపిరితిత్తులు, గుండె, క్యాన్సర్ వంటి వ్యాధులతో తీవ్రమైన కాలుష్యంతో ప్రజల అల్లాడుతున్నారని కూటమి ప్రపంచం ఇచ్చిన హామీ ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఈ గ్రామాన్ని తరలించాలని కోటేశ్వరరావు డిమాండ్ చేశారు లేనిపక్షంలో సిపిఎం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని ఆయన హెచ్చరించారు. నివాసముంటని ఇండ్లు కూడా ఈ ఉప్పునీటి వలన పై కప్పులు పడిపోతున్నాయని ఇల్లులు నివాసయోగ్యం కాకుండా తయారవుతున్నాయని వ్యవసాయం పడడం లేదని మంచినీరు దొరకడం లేదని ప్రజలు తెలియజేస్తుంటే గుండె తరుక్కుపోతుందని ప్రభుత్వాలు ఇప్పటికైనా ప్రజల సమస్యలను పట్టించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీను, ఆదిలక్ష్మి, పార్వతమ్మ, పద్మ, అప్పల నరసమ్మ, గని శెట్టి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు

# విద్యార్థుల, ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తే అక్రమ అరెస్టులా.

## బిఆర్ఎస్వి జమ్మికుంట పట్టణ అధ్యక్షులు కొమ్ము నరేష్...




జమ్మికుంటప్రజా ప్రభుత్వం అని చెప్పుకునే రేవంత్ రెడ్డి ప్రజా సమస్యల కోసం ప్రశ్నిస్తే అక్రమ అరెస్టులు చేస్తున్నారని బిఆర్ఎస్వి టౌన్ ప్రెసిడెంట్ కొమ్ము నరేష్, అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 2025- 26 సంవత్సరంకు గాను ప్రవేశపెట్టిన బడ్జెట్లో విద్య రంగానికి తగిన బడ్జెట్ కేటాయించకపోవడంలో నిర్లక్ష్యం వ్యవహరించి విద్యా వ్యవస్థకు అన్యాయం జరిగిందని శనివారం రోజున విద్యా సంఘాల నాయకులతో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమం ఉన్నందున శనివారం ఉదయం పోలీసులు తన స్వగృహం ఆబాది జమ్మికుంటలో అక్రమంగా అరెస్టు చేశారని వారు తెలిపారు. ఈ సందర్భంగా కొమ్ము నరేష్, మాట్లాడుతూ విద్యారంగానికి మంత్రి
కూడా లేని ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేయకపోవడం సిగ్గుచేటు అని రాష్ట్రంలో గురుకులాలో ఆహారంలో నాణ్యత లోపించి, సరియైన సదుపాయాలు లేక జరుగుతున్న విద్యార్థుల మరణాలకు కారణం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డే నని , తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక ఎన్నో రకాలైన ఇబ్బందులు ప్రజా ప్రభుత్వాన్ని చెప్పుకోవడమే తప్ప పేద ప్రజలకు కనీసం న్యాయం కూడా జరగకపోవడం ఇలా చెప్పకుండా పోతే కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక ప్రజలలో కేవలం 18 నెలల లోనే తీవ్ర వ్యతిరేకత రావడం జీర్ణించుకోలేక తెలంగాణ ప్రజల పైన సీఎం రేవంత్ రెడ్డి కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని, తెలంగాణ ప్రజలు గత కెసిఆర్ ప్రభుత్వంలో రైతులు గాని విద్యార్థులు గాని ప్రతి ఒక్కరు బాగుపడడం జరిగిందని, తెలంగాణ రాష్ట్ర ప్రజలు ప్రస్తుతం బిఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడితేనే మళ్లీ పేద ప్రజల జీవితాలు బాగుపడతాయని అన్నారు. ఇలా ప్రశ్నిస్తే అక్రమ అరెస్టులు చేసి మా ఉద్యమాన్ని ఆపలేరని, తెలంగాణ ప్రజలు అంటేనే ఉద్యమకారులని ఉద్యమకారుల పట్ల ఈ కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు దుర్మార్గకరమని కొమ్ము నరేష్, అన్నారు...

# ప్రధాని మోడీకి వైఎస్ జగన్ లేఖ

విజయవాడ నియోజకవర్గాల పునర్విభజనపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి మాజీ ముఖ్యమంత్రి, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైయస్ జగన్మోహన్రెడ్డి లేఖరాసారు. సదరు లేఖను వైయస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీనేత వైవీ సుబ్బారెడ్డి డీఎంకే నాయకులకు పంపించారు.

లోక్సభ లేదా రాజ్యసభలో ఇప్పుడున్న సీట్ల పరంగా ఆయా రాష్ట్రాలకు ఉన్న వాటాను కుదించకుండా పునర్విభజన (డీలిమిటేషన్) కసరత్తు చేపట్టాలి. కొన్ని రాష్ట్రాల ప్రాతినిధ్యం సహా, ఆయా రాష్ట్రాల్లోని ప్రజల మనోభావాలను డీలిమిటేషన్ ప్రక్రియ ప్రభావితం చేసే అవకాశం ఉన్నందున ఈ లేఖ రాస్తున్నట్లు వెల్లడించారు. అందుకే డీలిమిటేషన్ ప్రక్రియను అత్యంత జాగ్రత్తగా చేయాల్సిన అవసరాన్ని ఆ లేఖలో వైయస్ జగన్ పేర్కొన్నారు.

రాజ్యాంగంలో 84వ రాజ్యాంగ సవరణ ప్రకారం 2026లో డీలిమిటేషన్ ప్రక్రియను చేపట్టాల్సి ఉంది. కాని, దీనికి ముందుగా 2021లో చేపట్టాల్సిన జనాభా లెక్కింపు ప్రక్రియ కోవిడ్ కారణంగా వాయిదా పడింది. 2026 నాటికి జనాభా లెక్కల ప్రక్రియను పూర్తి చేయడానికి ఇప్పటికే అన్ని రకాల చర్యలు తీసుకున్నారు. ఇది జరిగిన వెంటనే డీలిమిటేషన్ ప్రక్రియ జరుగుతుందన్న ఊహ అనేక రాష్ట్రాల్లో తీవ్ర చర్చకు దారి తీస్తోంది. ముఖ్యంగా ఈ ప్రక్రియ ద్వారా తమ ప్రాతినిథ్యం తగ్గిపోతుందని దక్షిణాది రాష్ట్రాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. జనాభా నియంత్రణ కోసం వివిధ రాష్ట్రాలు అనేక విధానాలు అమలు చేశాయి. అయితే వాటి ఫలితాలు ఆయా రాష్ట్రాల్లో వేర్వేరుగా ఉన్నాయి. దీని వల్ల జనాభా పెరుగుదల వివిధ రాష్ట్రాల్లో వివిధ రకాలుగా ఉంది. దేశవ్యాప్తంగా జనాభా వృద్ధి ఒకే తరహాలో లేదు. అసమతుల్యత ఉంది. దీని వల్ల డీమిలిటేషన్ అంశం విస్తృతస్థాయిలో ఆందోళనకు దారి తీస్తోంది. 42 మరియు 84వ రాజ్యాంగ సవరణల ద్వారా ఆయా రాష్ట్రాలకు సీట్ల కేటాయింపును నిలిపేశారు. కాలక్రమేణా అన్ని రాష్ట్రాల్లో జనాభా నియంత్రణ కసరత్తులో భాగంగా ఒకేస్థాయిలో ఫలితాలు సాధిస్తాయని భావించి ఈ సీట్ల కేటాయింపును నిలిపేశారు. దేశ జనాభాలో ఆయా రాష్ట్రాల వాటా 1971 నాటి స్థాయికి చేరుకుంటుందని భావించారు. కానీ, 2011 జనాభా లెక్కల గణాకాంలను చూస్తే దశాబ్దాల తరబడి జనాభా వృద్ధి, దాని అంచనాలు అన్ని రాష్ట్రాల్లో ఒకేలా లేవని తేలింది. 1971 మరియు 2011 మధ్య 40 సంవత్సరాల్లో దేశ జనాభాలో దక్షిణాది రాష్ట్రాల వాటా తగ్గింది. ఈ 15 సంవత్సరాల్లో మరింత తగ్గిందని మేం నమ్ముతున్నాం. . జనాభా నియంత్రణను జాతీయ ప్రాధాన్యతగా తీసుకున్నందున దక్షిణాది రాష్ట్రాలు నిజాయితీగా తమ విధానాలను అమలు చేయడం వల్ల ఈ వాటా తగ్గింది. 1971 జనాభా లెక్కల ప్రకారం దక్షిణాది రాష్ట్రాల జనాభా వృద్ధి రేటు 24.08 శాతం అయితే, 2011 జనాభా లెక్కల ప్రకారం దక్షిణాది రాష్ట్రాల జనాభా వృద్ధి రేటు 20.88 శాతం. ఈ నేపథ్యంలో రాష్ట్రాల్లో ఇప్పుడున్న జనాభా లెక్కలను ఆధారంగా చేసుకుని డీలిమిటేషన్ ప్రక్రియ జరిగితే దేశ విధానాల రూపకల్పన సహా శాసన ప్రక్రియలో దక్షిణాది రాష్ట్రాల భాగస్వామ్యం గణనీయంగా తగ్గే అవకాశం ఉంది. ఇదే విషయాన్ని మీ దృష్టికి తీసుకు వస్తున్నానని జగన్ లేఖలో పేర్కొన్నారు.

డీలిమిటేషన్ ప్రక్రియపై వస్తున్న అభ్యంతరాలు దేశ సామాజిక, రాజకీయ సామరస్యాన్ని దెబ్బ తీసే అవకాశం ఉన్నందున ఈ అంశం తీవ్రతను దృష్టిలో ఉంచుకోవాలని కోరుతున్నాను. ఈ విషయంలో ప్రధానిగా మీ నాయకత్వం, మార్గనిర్దేశం చాలా ముఖ్యం. మీరిచ్చే హామీ అనేక రాష్ట్రాలకున్న భయాలను, అపోహలను తొలగించడానికి దోహదపడుతుందని అన్నారు.

# స్థానిక ఎన్నికలు అప్పుడే

హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధిస్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ తేదీలపై మరోసారి ప్రచారం మొదలైంది ఇన్నాళ్లు బీసీ రిజర్వేషన్, ఎస్సీ వర్గీకరణను పూర్తి చేయాలనే లక్ష్యంతో స్థానిక సంస్థల ఎన్నికలను తాత్కాలికంగా వాయిదా వేశారు.

ఈ రెండింటికీ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం చట్టబద్ధత కల్పించింది. అసెంబ్లీలో బీసీ, ఎస్సీ వర్గీకరణ బిల్లులను ప్రవేశపెట్టి ఆమోదించారు. ఒకటి రెండు రోజుల్లో గవర్నర్సంతకం చేశాక గెజిట్ విడుదల కానుంది. రాష్ట్రంలోని అన్ని స్థానిక సంస్థల పాలకవర్గాల గడువు ఇప్పటికే ముగిసింది. దీంతో ఒక్కొక్క దానికి ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం పట్టుదలతో ఉంది. రాష్ట్రంలోని ఏ స్థానిక సంస్థలకూ పాలకవర్గాలు లేవు. వచ్చే ఏడాది జనవరి, ఫిబ్రవరిలో జీహెచ్ఎంసీకి సైతం ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ఆ సమయం వరకు అన్ని స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోంది. అందుకే జూలైలో స్థానిక ఎన్నికలు నిర్వహించాలని ప్రాథమికంగా నిర్ణయించారు. మొదటి జెడ్పీటీసీ, ఎంపీటీసీ. ఆ తరువాత సర్పంచ్, అనంతరం మున్సిపల్ ఎన్నికలు నిర్వహించనున్నారు. ఇలా వరుసగా మూడు రకాల ఎన్నికలు జరగనున్నాయి.

ప్రధాని మోడీకి వినతిపత్రం..

బీసీ బిల్లుపై ప్రధానమంత్రి నరేంద్రమోడీని కలిసి వినతిపత్రం ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ సందర్భంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరనున్నారు. అన్ని రాజకీయ పార్టీలు కలిసి అసెంబ్లీలో తీర్మానం చేసినందున, ఆయాపార్టీల ప్రతినిధులు వినతి మేరకు బీసీ బిల్లులకు ఆమోదం వస్తుందనే అంచనాలో కాంగ్రెస్ అధినాయకత్వం ఉన్నట్లు తెలుస్తోంది. దీనిపై స్పష్టత రావడానికి మరికొంత సమయం పడుతుందని, అప్పటివరకు స్థానిక సంస్థల ఎన్నికల జోలికి వెళ్లవద్దని, కేంద్రానికి 2, 3 నెలల సమయం ఇచ్చాక.. అప్పటికీ కేంద్రం షెడ్యూల్-9లో చేర్చకుంటే తదుపరి కార్యాచరణపై ఆలోచించాలని ప్రభుత్వ పెద్దలుత చూస్తున్నారు.

ముగిసిన పాలకవర్గాలు:

గ్రామ పంచాయతీలకు పాలకవర్గాలు లేక ఏడాది కావొస్తోంది. ఇక జెడ్పీ, మండల పరిషత్లకు 8 నెలలు కావొస్తుంది. మున్సిపాలిటీల పాలకవర్గాల గడువు ముగిసి రెండు నెలలు అయ్యింది. వీటితో పాటు సహకార సంఘాల పదవీకాలాన్ని 6 నెలల పాటు పొడగించారు. ఇవన్నీ పూర్తయిన తర్వాత సహకార సంఘాల ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది.

బీసీ గణనతో మార్చిలో ఎన్నికలు మిస్.

అనుకున్న షెడ్యూల్ ప్రకారం మార్చిలో ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. ఎన్నికల నిర్వహణకు అన్నిరకాల ఏర్పాట్లు జరిగాయి.కానీ, చివరి నిమిషంలో బీసీ గణనకు మరో సారి గడువు ఇవ్వడం, దానికి చట్టబద్ధత కల్పించడం కోసం ఎన్నికలు వాయిదా పడ్డాయి. ఇప్పుడు బీసీ బిల్లుపై కేంద్రం స్పష్టత, మరోవైపు వేసవిలో తాగు, సాగునీరు , విద్యుత్ సమస్యలు సహజంగానే ఉండే అవకాశం ఉన్నది. అందుకే జూన్మధ్య నుంచి ఎన్నికల రిజర్వేషన్అధికారిక ప్రక్రియను ప్రారంభించడంతో జులైలో ఎన్నికలు జరుగుతాయని పార్టీ నాయకులు చెబుతున్నారు. అప్పటికల్లా వర్షాలు కురుస్తాయని, విద్యుత్, సాగు, తాగు నీటి సమస్యలు తీరుతాయని పార్టీనాయకులు అంచనా వేస్తున్నారు. ఫలితంగా అధికార పార్టీకి అనుకూలమైన వాతావరణం ఏర్పడుతుందని భావిస్తున్నారు. ఇలా చేయడం వలన పార్టీకి సానుకూల ఫలితాలు వస్తాయని విశ్లేషిస్తున్నారు.

నిధుల రావాలంటే ఎన్నికలు జరగాల్సిందే,

స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించకపోవడంతో కేంద్ర ప్రభుత్వం నిధుల విడుదలను నిలిపేసింది. మరోవైపు గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టాలంటే పాలకవర్గం ఆమోదం తప్పనిసరి. అత్యవసరమైన పనులు మినహా మిగిలిన పనులు చేయడానికి అవకాశం లేదు. ఇక కేంద్రం నుంచి రావాల్సిన నిధులు ఏడాదిగా నిలిచిపోయాయి. దీంతో స్థానిక సంస్థలు నిధుల కొరతతో ఇబ్బందులు పడుతున్నాయి. ప్రత్యేక అధికారులు 2 రకాల విధులు నిర్వహించడం కష్టంగా మారిందని టాక్. అదే సమయంలో రాజకీయంగా పార్టీ కోసం కష్టపడ్డ నాయకులకు గుర్తింపు ఇవ్వడానికి స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించి వారికి అవకాశం కల్పించాలని అధికార పార్టీ చూస్తుంది. ఏ రిజర్వేషన్ కింద ఎవరిని బరిలో నిలబెట్టాలనే దానిపై ఇప్పటికే క్లారిటీ వచ్చినట్లు తెలిసింది. దీంతో ఎన్నికల బరిలో నిలవడానికి అధికార పార్టీ పూర్తిస్థాయి సన్నద్ధతో ఉన్నట్లు తెలుస్తోంది.

# ప్రమాదకరమైన వ్యర్థ పదార్థాల డంప్ యాడ్ ను

## తొలగించి ప్రజల ప్రాణాలు కాపాడాలి: సిపిఐ

ఎమ్మిగనూరు సోగునూరు రోడ్డు సమీపంలో ఉన్న వ్యర్థ పదార్థాల డంప్ యాడ్ ను తక్షణమే తొలిగించి ఆ ప్రాంత ప్రజల ప్రాణాలను కాపాడాలని భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) పట్టణ కార్యదర్శి జి రంగన్న తెలిపారు.శనివారం రోజు సిపిఐ ఆధ్వర్యంలో జోగి కాలనీ ప్రజలతో కలసి ప్రమాదకరమైన వ్యర్థ పదార్థాల డంప్ యాడును సందర్శించడం జరిగింది.ఈ సందర్భంగా సిపిఐ పట్టణ కార్యదర్శి జి రంగన్న మాట్లాడుతూ ఎమ్మిగనూరు పట్టణంలోని వ్యర్థ పదార్థాలను తీసుపోయి జోగి కాలనీ, జగనన్న కాలనీ,టిడ్కో గృహాల సమీపంలో డంపు చేయడం వల్ల ఆ ప్రాంత ప్రజలు దుర్వాసన ను పీల్చుతో అనారోగ్యాల పాలవుతున్నారని,పైగా డంపు యాడు లోని వ్యర్థ పదార్థాలను తగలబెట్టడంతో వచ్చే ప్రమాదకరమైన పొగ వల్ల పక్కనే ఉన్న జోగి కాలనీలో నిరుపేదలు జీవనం గడుపుతున్నారని,ఆ పొగను పీల్చడం ద్వారా ఊపిరి ఆడక అనేక అనారోగ్య సమస్యలతో బాధ పడుతున్నారనీ, ఈ పొగ వల్ల ఆ కాలనీలో సంవత్సర క్రితం ఇద్దరు చిన్నారులు మరణించడం జరిగిందని కాలనీ ప్రజలు ఆవేదనను వ్యక్తం చేశారు. అదేవిధంగా ఈ డంపు యాడ్ లో ఉన్న వ్యర్థ పదార్థాలను తినడానికి కుక్కలు వందల సంఖ్యలలో వస్తున్నాయని, ఆ కుక్కలు దారిన పోయే ప్రజలపై దాడి చేయడం జరిగిందని కాలనీ ప్రజలు తెలిపారు.కాబట్టి మున్సిపల్ అధికారులు తక్షణమే స్పందించి ప్రజల ప్రాణాలకు ముప్పు పొంచి ఉన్న వ్యర్థ పదార్థాల డంపు యాడును తక్షణమే తొలగించి చుట్టుపక్కల నివసిస్తున్న ప్రజల ప్రాణాలను కాపాడాలని,అదేవిధంగా డంపు యాడును పట్టణానికి దూరంగా ఏర్పాటు చేయాలని లేనిపక్షంలో సిపిఐ ఆధ్వర్యంలో దశలవారి పోరాటాలకు శ్రీకారం చుడతామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు మల్లికార్జున గౌడ్, నరసింహులు, రాజు, ఎల్లప్ప, మరియు కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

# కాకినాడలో అపరేషన్ గరుడ

కాకినాడ ఆపరేషన్ గరుడలో భాగంగా ఔషధ నియంత్రణశాఖ, విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ శాఖలు సంయుక్తంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా శుక్రవారం మందుల దుకాణాలపై దాడులు నిర్వహించారు.. ఈగల్ టీంతో కలిసి కాకినాడ, రాజమహేంద్రవరం,అమలాపురం ప్రాంతాల్లోని 16 ఔషధ దుకాణాలపై దాడి చేసినట్లు అందులో కొన్ని దుకాణాల్లో నార్కోటిక్(మత్తు) మందులు బిల్లులేకుండా, అర్హత కలిగిన వైద్యుడి ప్రిస్క్రిప్షన్ లేకుం విక్రయాలు జరపడం గమనించిన అధికారులు ఆయమందుల షాపులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు...

## అసెంబ్లీ లాబీ లో ఆంక్షలు

హైదరాబాద్ తెలంగాణ అసెంబ్లీ లాబీలో ఆంక్షలు విధించారు. మంత్రుల చాంబర్ల ముందు నిల్చోవద్దని అదేశాలు జారీ అయ్యాయి. ప్రతీ మంత్రి ఛాంబర్ ముందు ప్రత్యేకంగా మార్షల్స్ ను ఏర్పాటు చేసారు. లాబీ పాస్ లు ఉన్నా జర్నలిస్ట్ లకు లాబీకి నో ఎంట్రీ. మంత్రుల చాంబర్ల ముందు మీడియా ఉండవద్దని ఓరల్ అదేశాలు జారీ అయినట్లు సమాచారం.

## రాష్ట్రం నుండి హజ్ కి వెళ్లే సౌకర్యం రద్దు చేసిన ఎన్డీఏ ప్రభుత్వాలు

## జిల్లా ఇన్చార్జి కలెక్టర్ కు కాంగ్రెస్ పార్టీ ఫిర్యాదు



బద్వేలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విజయవాడ నుండి ఈ ఏడాది హజ్ యాత్రకు వెళ్లే హాజీలకు ఉన్న ఎంబర్కేషన్ పాయింట్ సౌకర్యాన్ని కేంద్ర రాష్ట్రాల్లోని ఎన్డీఏ ప్రభుత్వాలు రద్దు చేయడంపై కాంగ్రెస్ పార్టీ అభ్యంతరం వ్యక్తం చేస్తూ కడప జిల్లా ఇన్చార్జి కలెక్టర్, జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ కు ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి పటాన్ మహమ్మద్ అలీ ఖాన్ , కాంగ్రెస్ పార్టీ జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు మయాన రహమతుల్లా ఖాన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కమల్ భాష, కాంగ్రెస్ పార్టీ నేత హమీద్ శుక్రవారం లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. కేవలం మత విద్వేషం తో ప్రత్యేకంగా విజయవాడ నుండి బయలుదేరే హజ్ యాత్రికుల సౌకర్యాన్ని రద్దు చేయడం తగదని స్పష్టం చేశారు . వెంటనే విజయవాడ నుండి హజ్ యాత్రికులు వెళ్లే విధంగా కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరారు . కేంద్ర, రాష్ట్ర హజ్ కమిటీల సిఫార్సు మేరకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి తెలియజేయడాన్ని కాంగ్రెస్ పార్టీ తప్పు పట్టింది. ఈ ఏడాది హజ్ కు వెళ్లే యాత్రికులు తక్కువగా ఉన్నారని, విమానయాన చార్జీలు ఎక్కువగా ఉన్నట్లు కారణాలుగా చూపి విజయవాడ నుండి బయలుదేరే సౌకర్యాన్ని రద్దు చేయడం మత్తవిద్వేషానికి నిదర్శనమని కాంగ్రెస్ నేతలు ఆరోపించారు. దీనికి ప్రధాని నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పూర్తిగా బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. రాజకీయ పార్టీలు లేదా మైనార్టీల అభిప్రాయాలను పరిగణ లోనికి తీసుకోకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రతి ఏటా హజ్ కి వెళ్లే సౌకర్యాన్ని రద్దు చేయడానికి కక్షపూరిత చర్యగా విమర్శించారు. వెంటనే కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు ఎంబర్కేషన్ పాయింట్ విజయవాడ సౌకర్యాన్ని పునరుద్ధరించని పక్షంలో ఆందోళన చేపడతామని వారు హెచ్చరించారు.

## ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ని కలిసిన టిడిపి బద్వేల్ నియోజకవర్గ సమన్వయకర్త రితేష్ రెడ్డి



బద్వేలు తెలుగుదేశం పార్టీ బద్వేల్ నియోజకవర్గ సమన్వయకర్త రితేష్ రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా కాశీనాయన ఆలయ పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం అందించిన సహాయ సహకారాలకు కృతజ్ఞతలు తెలియజేశారు.
అలాగే, నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు వారు తెలిపారు. ముఖ్యంగా, సాగునీటి వనరుల అభివృద్ధికి అవసరమైన ప్రాజెక్టులపై చర్చించగా, తాగునీటి సమస్య పరిష్కారానికి మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టులను ప్రోత్సహించి ట్యాంకులు నిర్మించాలని కోరినట్లు తెలియజేశారు. బద్వేల్ నియోజకవర్గంలో చెక్‌డ్యామ్‌ల నిర్మాణానికి అనుమతులు మంజూరు చేయాలని, అలాగే, తెలుగు గంగా ప్రాజెక్టు పనులను త్వరితగతిన పూర్తి చేయడానికి అవసరమైన నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేసినట్లు పేర్కొన్నారు.
మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టులకు నీటిని సరఫరా చేయడానికి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌ల ఆమోదం కోరినట్లు పేర్కొన్నారు. అలాగే, భాక్రాపేట-తాటిచెర్ల మోటు రోడ్డును జాతీయ రహదారిగా అప్‌గ్రేడ్ చేసి జాతీయ ప్రాజెక్టులలో చేర్చేందుకు కేంద్ర రవాణా మంత్రి నితిన్ గడ్కరీ కలిసి వినతిపత్రం సమర్పించిన విషయాన్ని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున ప్రతిపాదనలు పంపిన వెంటనే పనులు ప్రారంభం కానున్నట్లు వెల్లడించారు.
రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రితేష్ రెడ్డిరి ప్రతిపాదనలపై సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. బద్వేల్ నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందని వారు స్పష్టం చేశారు.



## కీ.శే.కొక్కిరాల రఘుపతి రావు చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రంజాన్ కానుకగా తోఫా పంపిణీ

**ప్రజాబలం మంచిర్యాల నియోజకవర్గం రిపోర్టర్ మార్చి 22** : దండేపల్లి, లక్షెట్టిపేట మండలం, లక్షెట్టిపేట పట్టణంలో ముస్లిం సోదరీమణులకు రంజాన్ తోఫా పంపిణీ చేసిన మంచిర్యాల శాసన సభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు,మంచిర్యాల జిల్లా డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ ఆధ్వర్యంలో పంపిణీ, శనివారం ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు, జిల్లా డీసీసీ అధ్యక్షురాలు సురేఖ మాట్లాడుతూ... ఎన్నికలకు సంబంధం లేకుండా ప్రతి సంవత్సరం రంజాన్ పండుగ సందర్భంగా రంజాన్ తోఫా ఇస్తున్నామని తెలిపారు
అనంతరం ముస్లీం సోదరిమణులకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు,మహిళా నాయకురాలు,యువజన కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## తూప్రాన్ హనుమాన్ దేవాలయంలో అర్ధమండల దీక్షలు....




**ప్రాజబలం న్యూస్ తూప్రాన్ :-మెదక్ జిల్ల తూప్రాన్** మున్సిపల్ కేంద్రంలోని పెద్ద చెరువు కట్టపై వెలిసిన శ్రీ వీరాంజనేయ స్వామి హనుమాన్ దేవాలయంలో శనివారం అర్ధమండల దీక్షలను ఆలయ పురోహితులు సలాక ఆత్రేయ శర్మ ప్రారంభించారు. హనుమాన్ భక్తులకు అర్ధమండల దీక్షను వేశారు. భక్తులకు మాలలు వేసి ఇరవై ఒక రోజులపాటు హనుమాన్ జయంతి వరకు గావించే భక్తులు దేవాలయంలో మాలలు ధరించారు. అనంతరం స్వామివారికి ఆకు పూజ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు తదితరులు పాల్గొన్నారు..

## ఏ-2 సునీల్ యాదవ్‌కూ ప్రాణభయమే



బద్వేలువైఎస్ వివేకా హత్య కేసులో సాక్షులుగా ఉన్న వారికే కాదు నిందితులుగా ఉన్న వారికి కూడా ప్రాణభయం వెంటాడుతోంది. వివేకాను గొడ్డలితో నరికిన వ్యక్తిగా సీబీఐ చార్జిషీట్‌లో పేర్కొన్న సునీల్ యాదవ్ కడప ఎస్పీని కలిసి తనను వైసీపీ వాళ్లు బెదిరిస్తున్నారని రక్షణ కల్పించాలని కోరారు. సునీల్ యాదవ్ బెయిల్ మీద బయటకు వచ్చిన తర్వాత వైసీపీ క్యాంప్ కు వ్యతిరేకంగా మాట్లాడుతున్నారు. వివేకా హత్య వెనుక ఉన్నది అందరూ చెప్పుకుంటున్న వాళ్లే అన్నట్లుగా మాట్లాడుతున్నారు. కొన్ని మీడియా చానళ్లకు ఇంటర్వ్యూలు కూడా ఇచ్చారు. దస్తగిరి తరహాలో సునీల్ మాట్లాడుతూండటం సంచలనంగా మారింది.
ఈ క్రమంలో ఆయనకూ బెదిరింపులు వస్తున్నాయని ఎస్పీకి ఫిర్యాదు చేశారు. ఇప్పటికే సునీల్ యాదవ్ ఇంటి పోలీసులు పికెటింగ్ ఏర్పాటు చేశారు. రక్షణ కల్పించే అంశాన్ని పరిశీలిస్తున్నారు. మరో వైపు హత్య అనే సినిమాపై కూడా ఎస్పీకి సునీల్ యాదవ్ ఫిర్యాదు చేశారు. ఇందులో తన తల్లిని అసభ్యంగా..క్రూరంగా చూపించారని.. మండిపడ్డారు. ఈ సినిమాను తీయించింది వైసీపీ నేతలేనని.. హత్యలో ఎనిమిది మంది పాల్గొంటే.. నలుగురే పాల్గొన్నట్లుగా చూపించారన్నారు. ఈ సినిమాను నిలిపివేయించాలని.. చర్యలు తీసుకోవాలని కోరారు.
ఇప్పటికే అప్రూవర్ గా మారిన దస్తగిరి ప్రాణ భయం ఉందని చెప్పడంతో ఆయనకు భద్రత పెంచారు. వరుసగా సాక్షులు మరణిస్తూండటం.. మరో వైపు కేసు విచారణ ముందుకు సాగకపోవడంతో సాక్షులు, పాత్రధారులైన నిందితులు భయపడుతున్నారు. అసలు సూత్రధారులు సాక్ష్యాల్లేకుండా చేసేందుకు ఏం చేసేందుకైనా వెనుకాడరని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## విద్యరంగ సమస్యలపై పోరాటాలకు సిద్ధం కావాలి

### విద్యాశాఖ మంత్రి నియమించి విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు శనిగరపు రజనీకాంత్




**ప్రజాబలం ప్రతినిధి నిర్మల్ జిల్లా..** భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ నిర్మల్ జిల్లా ఐదవ మహాసభలు టిఎన్జీవో భవన్లో జరిగినాయి స్వాతంత్రం ప్రజాస్వామ్యం, సోషలిజం జెండాను ఆవిష్కరించి భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లర్పించడం జరిగింది
ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షులు శనిగారపు రజనీకాంత్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి పూర్తిగా విద్యారంగాన్ని నిర్వీర్యం చేసే కుట్ర జరుగుతుంది దాన్లో భాగంగానే రాష్ట్రంలో విద్యా రంగంలో అనేక సమస్యలు ఉన్న సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలం అయింది,అనేక శాఖలకు మంత్రులు ఉన్న విద్యాశాఖకు మాత్రం మంత్రులను కేటాయించకుండా ముఖ్యమంత్రి దగ్గరనే శాఖ పెట్టుకుని నిర్లక్ష్యం చేయడం సరైనది కాదని మండిపడ్డారు, పెండింగ్ లో ఉన్న స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్మెంట్ 7500 కోట్ల రూపాయలు పెండింగ్లో ఉన్నాయి సకాలంలో విడుదల చేయకపోవడం వల్ల విద్యార్థులు పై చదువులకు దూరం అవుతున్నారు కావున పెండింగ్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలి అదే విధంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న లెక్చరర్స్ పోస్టులను భర్తీ చేసి మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని అన్నారు, ప్రభుత్వ పాఠశాలల్లో శిథిలావస్థలో ఉన్న వాటిని మౌలిక వసతులు కల్పించి ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలి అద్దభవన్లో కొనసాగుతున్న సంక్షేమ హాస్టల్లో గురుకులాలకు సొంత భవనాలు నిర్మించాలి పెంచిన మెనూ అమలు చేయాలి విద్యార్థులకు పౌష్టికాహారమైన భోజనం అందించాలని డిమాండ్ చేశారు, తెలంగాణలో డివిజన్కు ఒక పాలిటెక్నిక్ కళాశాలను ఏర్పాటు చేస్తామని హామీ నిర్మల్ ప్రభుత్వం ఇంజనీరింగ్ కళాశాల ప్రభుత్వ ఐటిఐ కళాశాల ఏర్పాటు చేయాలి ఖానాపూర్ సెంటర్లో ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలి అదేవిధంగా బడ్జెట్ సమావేశాలలో విద్యారంగానికి తగిన ప్రాధాన్యత ఇవ్వకపోవడం సిగ్గుచేటు తెలంగాణ రాష్ట్రం కొట్లాడితే తెలంగాణలో విద్యను ఎందుకు పట్టించుకోవడంలేదని మండిపడ్డారు విద్యాశాఖ మంత్రి నియమించి విద్యారంగ సమస్యలు పరిష్కరించకుంటే భవిష్యత్తులో విద్యారంగ సమస్యల పైన పోరాటాలకు విద్యార్థులు సిద్ధం కావాలని పిలుపునివ్వడం జరిగింది
ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి దిగంబర్, నితిన్, శేఖర్, అరవింద్,శివ,మహేష్,అక్షిత్, తదితరులు పాల్గొన్నారు

## చదువుతోనే బంగారు భవిష్యత్తు డిసిసి అధ్యక్షులు శ్రీహరి రావు



**ప్రజాబలం ప్రతినిధి నిర్మల్ జిల్లా..** విద్యతోనే బంగారు భవిష్యత్తు సాధ్యమవుతుందని, విద్యార్థి దశనుంచే లక్ష్యాన్ని ఎంచుకొని ఆ దిశగా పట్టుదలతో కృషి చేయాలని డీసీసీ అధ్యక్షులు కూచాడి శ్రీహరి రావు గారు అన్నారు. మామడ మండలం దిమ్మదుర్తి గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు విజయ్ కుమార్ రెడ్డి నరేష్ రెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో బ్యాగులు పంపిణీ చేశారు. విద్యాభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పెద్దపీట వేస్తున్నారని, విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు తరగతిగదుల్లోనే నిర్మాణమవుతుందని తెలిపారు.ప్రతి విద్యార్థి శ్రద్ధగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాఠశాల ఉపాధ్యాయులు మండల పార్టీ అధ్యక్షులు బూజంగా శ్రీనివాస్ రెడ్డి,మాజీ ఎంపీపీ ఏనుగు లింగారెడ్డి,మాజీ వైస్ ఎంపీపీ పడాల శ్రీనివాస్ రెడ్డి,కారిటికల్ మాజీ సర్పంచ్ నల్ల లింగారెడ్డి,మాజీ సర్పంచులు సుంకరి రత్నయ్య,రమణ తదితరులు పాల్గొన్నారు

## శ్రీ తాతయ్యగుంట గంగమ్మ ఆలయాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తాం – అభివృద్ధి పనులను పరిశీలించిన టిటిడి చైర్మన్


తిరుపతి శ్రీ తాతయ్యగుంట గంగమ్మ ఆలయానికి భక్తుల రాక పెరుగుతోందని, ఈ ఆలయాన్ని అని విధాల అభివృద్ధి చేస్తామని టీటీడీ చైర్మన్ బీ ఆర్ నాయుడు తెలిపారు. ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులను చైర్మన్ శనివారం స్థానిక ఎంఎల్ఏ ఆరణి శ్రీనివాసులతో కలసి పరిశీలించారు.ఈ సందర్భంగా చైర్మన్ మీడియాతో మాట్లాడుతూ, తిరుపతి శ్రీ తాతయ్యగుంట గంగమ్మ తల్లి తిరుమల శ్రీ వేంటేశ్వరస్వామికి సోదరిగా చెబుతారన్నారు. శ్రీవారి దర్శనానికి విచ్చేసే భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారి దర్శనానికి వస్తున్నందున, వారికి ఎలాంటి అసౌకర్యం కలుగకుండా టీటీడీ అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిందన్నారు.ఆలయ పునర్నిర్మాణ పనులలో భాగంగా మొదటి విడతగా రూ.3.75 కోట్లతో అభివృద్ధి జరుగుతున్నాయని చెప్పారు. ఇందులో ఆర్చ్, ఎస్ఎస్ గ్రిల్స్, రాతి ఫ్లోరింగ్, డ్రైనేజ్ తదితర పనుల పురోగతిని చైర్మన్ పరిశీలించి పలు సూచనలు చేశారు.అదేవిధంగా రెండో విడత అభివృద్ధి పనులకు రూ.3.90 కోట్లతో ప్రతిపాదనలు వచ్చినట్లు తెలిపారు.
ఇందులో ముఖ మండపం, పోటు, తూర్పు, ఉత్తరం,
పశ్చిమ వైపు ప్రాకారాలు, మరుగుదొడ్లు తదితర పనులకు సంబంధించి రాబోవు టీటీడీ బోర్డు సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకోనున్నట్లు చెప్పారు.మే 6 నుండి 13వ తేదీ వరకు గంగమ్మ జాతర వైభవంగా నిర్వహించేందుకు టిటిడి అన్ని విధాల సహకారం అందిస్తుందని తెలిపారు.అంతకుముందు చైర్మన్ శ్రీ తాతయ్యగుంట గంగమ్మను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# పదవ తరగతి పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్



**రాజన్న సిరిసిల్ల జిల్లా, మార్చి - 22(ప్రజాబలం ప్రతినిధి)**సిరిసిల్ల పట్టణంలోని పదవ తరగతి పరీక్షా కేంద్రాలను జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.కుసుమ రామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కృష్ణవేణి టాలెంట్ పాఠశాల, సిద్ధార్థ ఇంగ్లీష్ మీడియం పాఠశాలల్లోని పరీక్షా కేంద్రాల్లోని అన్ని గదులను సందర్శించి, పరీక్షలు జరుగుతున్న సరళిని పరిశీలించారు. ఎంత మంది హాజరు.. గైర్హాజరు అయ్యారు అనే వివరాలను కలెక్టర్ ఆరా తీశారు. ఎలక్ట్రానిక్ పరికరాలను పరీక్షా కేంద్రం లోపలికి అనుమతించవద్దని అన్నారు. క్షేత్ర స్థాయిలో ఏమైనా ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు.

## మహనీయుల జయంతి వేడుకల నిర్వహణకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు :జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



**రాజన్న సిరిసిల్ల జిల్లా, మార్చి-22:(ప్రజాబలం ప్రతినిధి)**జిల్లాలో భారత రత్న అవార్డు గ్రహీతలు జగ్జీవన్ రామ్ జయంతి, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ వంటి మహనీయుల జయంతి వేడుకలు నిర్వహణకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ అన్నారు.శనివారం జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో మహనీయుల జయంతి వేడుకలు నిర్వహణపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రభుత్వ ఆదేశాలతో ఏప్రిల్ 5న బాబు జగ్జీవన్ రామ్ జయంతి, ఏప్రిల్ 14న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలను ఎస్సీ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో కట్టుదిట్టంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లను అధికారులు ప్రణాళికాబద్ధంగా పూర్తి చేయాలని అన్నారు.జిల్లా కేంద్రంలో మహనీయుల జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించడం జరుగుతుందని అన్నారు. జయంతి వేడుకలకు అన్ని వర్గాల ప్రజలను ఆహ్వానించాలని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వం నుంచి వేడుకలకు సంపూర్ణ ఏర్పాట్లు చేస్తామని అన్నారు. గ్రామ పంచాయతీ నిధుల నుంచి గ్రామాలలో ఉన్న అంబేద్కర్ విగ్రహాల వద్ద అలంకరణ, పూల మాల వేయడం వంటి పనులు చేయాలని కలెక్టర్ సూచించారు.వేములవాడ లో కాంస్య అంబేద్కర్ విగ్రహ ఏర్పాటు కోసం 16 లక్షల నిధులు మంజూరు చేసి టెండర్లు పిలిచామని కలెక్టర్ తెలిపారు. అంబేద్కర్ జయంతి, జగ్జీవన్ రామ్ జయంతి వేడుకల కార్యక్రమాల వివరాలతో కూడిన పోస్టర్లు తయారు చేయాలని కలెక్టర్ అన్నారు.

అంబేద్కర్ జయంతి, జగ్జీవన్ రామ్ జయంతి వేడుకల సందర్భంగా సాధారణ ప్రజల రవాణా కు ఎటువంటి ఇబ్బందులు కాకుండా రోడ్ బ్లాక్ జరగాలని, ప్రజలకు వాహనదారులకు ప్రత్యామ్నాయ మార్గాలు చూపాలని కలెక్టర్ తెలిపారు.ఈ సమావేశంలో డిఎస్పి చంద్రశేఖర్ రెడ్డి ఇన్చార్జి ఎస్సీ వెల్ఫేర్ అధికారి రాజా మనోహర్ ఈడిఎస్సీ కార్పొరేషన్ స్వప్న ఏ ఎస్. డబ్ల్యూ ఓ, విజయలక్ష్మీ , వివిధ ఎస్సీ ఎస్టీ కుల సంఘాల నాయకులు సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## పదవ తరగతి పరీక్ష కేంద్రాలను క్షేత్రస్థాయిలో పరిశీలించిన జిల్లా ఎస్పీ మహేష్ బి గితే ఐపిఎస్.

## పదవ తరగతి పరీక్ష కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు, 163 BNSS-2023 అమలు



**రాజన్న సిరిసిల్ల జిల్లా, మార్చి-22 (ప్రజాబలం ప్రతినిధి)**సిరిసిల్ల పట్టణంలోని కుసుమరాయ్య,%గ్లూనూ గీతనగర్ తో పాటు పలు పదవ తరగతి పరీక్ష కేంద్రాలను పరిశీలించి పరీక్షలు జరుగుతున్న తీరును పరిశీలించి,పరీక్ష కేంద్రాల వద్ద బందోబస్తు విధులలో ఉన్న పోలీస్ అధికారులకు,సిబ్బందికి పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా సలహాలు సూచనలు చేసిన జిల్లా ఎస్పీ..ఈ సందర్భంగా మాట్లాడుతూ.పదవ తరగతి పరీక్షల సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 35 పరీక్షా కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు 163 %దీచీూా%-2023 అమలులో ఉంటుందన్నారు. పరీక్షలు జరిగే సమయంలో సిబ్బంది అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పరీక్షా కేంద్రాలకు పేపరు వచ్చేటప్పుడు తీసుకొని వెళ్లేటప్పుడు తప్పకుండా ఎస్కార్ట్ ఉండాలని సూచించారు.పరీక్షలు జరిగే సమయంలో పరీక్ష కేంద్రాల పరిసర ప్రాంతాల్లో అధికారులు పెట్రోలింగ్ నిర్వహించడం జరుగుతుందన్నారు.ఎస్పీ వెంట సిరిసిల్ల డిఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి, సిరిసిల్ల పట్టణ ఇన్స్పెక్టర్ కృష్ణ ,సిబ్బంది ఉన్నారు.

# సీసీ రోడ్ల పనులు ప్రారంభం



**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి మార్చి 22 (ప్రజాబలం)** అందోల్ నియోజకవర్గం చౌటాకుర్ మండల పరిధిలోగల, గంగోజిపేట,గ్రామంలో నిన్న శనివారం నాడు గ్రామంలో మంత్రి దామోదర్ రాజనర్సింహ, ఆదేశానుసారం, సిసి రోడ్లు ప్రారంభించడం జరిగిందని మండల పార్టీ అధ్యక్షుడు నత్తి దశరథ్, తెలిపారు, గంగోజిపేట గ్రామానికి సీసీ రోడ్లు మరియు గ్రామ అభివృద్ధికి మంత్రి దామోదర్ రాజనర్సింహ, ఐదు లక్ష రూపాయలు మంజూరు, చేయడం జరిగిందని ,వాటితోఈసీసీరోడ్లపనులు పూజాకార్యక్రమాలు నిర్వహించి,ప్రారంభించామని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో ఈయనతో పాటు, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మరియు మాజీ సర్పంచ్, బాలగౌడ్, యువజన సంఘం నాయకుడు ప్రవీణ్ కుమార్, జై భారత్ అధ్యక్షుడు ఇమ్మయ్య, ఫీల్డ్ అసిస్టెంట్ సత్యానందం, గ్రామ పంచాయతీ సెక్రెటరీ మంజుల, పార్టీ నాయకులు ఈశ్వర్ గౌడ్, రాజశేఖర్, రమేష్, ప్రవీణ్,షఫీ, గౌస్, తదితరులు పాల్గొన్నారు.

## దోషులకు శిక్ష పడడంలో బాధ్యతగా వ్యవహరించాలి

## కన్వెన్షన్ శాతం పెంచాలి పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా



**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి మార్చి 22 :** నేరస్థులకు శిక్ష పడితేనే నేరాల సంఖ్య తగ్గుతుందని,బాధితులకు న్యాయం జరిగే విధంగా కోర్టు కానిస్టేబుళ్లు కృషి చేయాలని రామగుండం పోలీస్ కమీషనర్ అంబర్ కిశోరే ఝా అన్నారు.శనివారం రామగుండము కమిషనరేట్ కార్యాలయంలో పెద్దపల్లి, మంచిర్యాల జోన్ లలో పనిచేస్తున్న కోర్టు డ్యూటీ అధికారులు,లైజనింగ్ అధికారులతో సీపీ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపి మాట్లాడుతూ...నేరస్థులకు శిక్షపడే విధంగా సాక్షులను ప్రవేశపెట్టి ట్రయల్ సజావుగా జరిగేలా చూడాలని సీపీ సూచించారు.కోర్టులో బాధితులకు న్యాయం జరిగే విధంగా మానవత్వం తో మెదలాలి,దోషులకు శిక్ష పడడంతో కోర్టు కానిస్టేబుళ్ల బాధ్యత చాలా కీలకమైదని, నేరస్థులకు వారెంట్స్,సమన్లు సత్వరమే ఎగ్జిక్యూట్ అయ్యే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. కోర్టు ప్రాసిక్యూషన్‌కు సంబంధించిన సమాచారం ఎప్పటికప్పుడు సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్‌కు తెలియజేయాలని,పబ్లిక్ ప్రాసిక్యూటర్ సలహాలు, సూచనలు పాటించాలని,కోర్టులో పెండింగ్‌లో ఉన్న ట్రయల్ కేసులు,వారెంట్లు,సమన్లు సీసీటీఎన్ఎస్‌లో డాటా ఎంట్రీ చేయాలని సూచించారు. బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటే బాధితులపై మనపై నమ్మకం పెరుగుతుందన్నారు.మేజిస్ట్రేట్ బాధితులు కోర్ట్ డ్యూటీ కానిస్టేబుల్ మంచిగా క్రమశిక్షణ, నిబద్ధతతో పని చేస్తారని నిందితులకు శిక్ష పడడంలో చాలా కృషి చేశాడు అని చెప్పాలి.ఏదైనా నేరం చేసిన వారికీ చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులకు తప్పకుండా శిక్షపడేలా కృషి చేయాలి కోర్ట్ డ్యూటీ విధుల్లో క్రమశిక్షణ నిబద్ధతతో పనిచేస్తూ హత్య మరియు హత్య యత్నం,చీటింగ్ కేసు లలో నిందితులకు శిక్షలు పడే విధంగా కృషిచేసిన లోక్ అదాలత్ కేసులలో ప్రతిభ చూపిన కోర్టు డ్యూటీ ఆఫీసర్స్ కి సిపి చేతుల మీదుగా ప్రశంస పత్రాలు అందజేయడం జరిగింది.

సమీక్ష సమావేశంలో అదనపు డీసీపీ(అడ్మిన్)రాజు,స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్రరావు, టాస్క్ ఫోర్స్ ఏసీపీ మల్లా రెడ్డి, లీగల్ సెల్ ఇన్‌స్పెక్టర్ కృష్ణ, సీసీఆర్‌బీసీ ఇన్‌స్పెక్టర్ సతీష్, ఐటి సెల్ ఇన్స్పెక్టర్ చంద్రశేఖర్ గౌడ్, సిసి హరీష్ తో పాటు పెద్దపల్లి,మంచిర్యాల జోన్‌ల కోర్టు డ్యూటీ ఆఫీసర్లు పాల్గొన్నారు

## గుండెపోటుతో మరణించిన హెడ్ కానిస్టేబుల్ కుటుంబ సభ్యులకు భద్రత చెక్ అందజేత

## పోలీస్ కుటుంబాలకు అండగా నిలుస్తాం పోలీస్ కమీషనర్ అంబర్ కిషోర్ ఝా



**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి మార్చి 22 :** రామగుండం పోలీస్ కమిషనరేట్ మంచిర్యాల జోన్ మంచిర్యాల ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ లో హెడ్ కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తూ కె.నాగరాజు హెచ్ సి.444 గారు గుండెపోటుతో మరణించగా ఆయన భార్య విజయ కుమారి కి భద్రత ఎక్స్గ్రేషియా 7,84,762/- రూపాయల చెక్ ను ఈ రోజు రామగుండం పోలీస్ కమీషనర్ అంబర్ కిషోర్ ఝా తన కార్యాలయంలో అందజేయడం జరిగింది.ఈ సందర్భంగా మరణించిన హెడ్ కానిస్టేబుల్ కుటుంబ ప్రస్తుత స్థితిగతులను సీపీ అడిగి తెలుసుకోవడంతో పాటు,వారి కుటుంబానికి పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని,ప్రభుత్వపరంగా అందాల్సిన ఇతర బెనిఫిట్లను తక్షణమే అందజేసేవిదంగా చూస్తామని తెలియజేశారు. పోలీస్ సిబ్బంది కుటుంబాల సంక్షేమం పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబర్చడంతో పాటు వారి కుటుంబాలకి అండగా ఉంటామని సీపీ అన్నారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ సి.రాజు,ఏఓ శ్రీనివాస్, సూపరిండెంట్ సంధ్య, రామగుండం పోలీస్ కమిషనరేట్ పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షులు బోర్లాకుంట పోచలింగం పాల్గొన్నారు

# కానుకుంటలో ఘనంగా ప్రపంచ జల దినోత్సవం



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి మార్చ్ 22(ప్రజాబలం)**సంగారెడ్డి జిల్లా/గుమ్మడిదల మండలం కానుకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రపంచ జల దినోత్సవం ఘనంగా నిర్వహించారు,ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సమస్త జీవ రాశికి ఆధారమైన ప్రతి నీటి బొట్టును పొదుపుగా వాడుకొని జల సంరక్షణ చర్యలను చేపట్టడం ద్వారా భవిష్యత్ తరాలకు నీటి ఎద్దడి నుండి కాపాడాలని ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు రమేష్ పేర్కొన్నారు,విద్యార్థులచే నీటి పొదుపుపై ప్రతిజ్ఞ చేయించి నీటి పొదుపై అవగాహన కల్పించ్చారు,విద్యార్థులు జల ప్రాముఖ్యత తెలిపే నినాదాలు ప్లకార్డులుగా ప్రదర్శించారు

ఈ సందర్భంగా విద్యార్థులు నీటి బిందువు ఆకారంలో ఉన్న చిత్ర%శీ% ఆకట్టుకుంది.ఈ కార్యక్రమంలో ప్రభాకర్ రెడ్డి, సువర్చల,రజిని, జ్యోతి, రత్న,తదితర ఉపాధ్యాయ బృందం మరియు విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

# సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి మార్చి 22 (ప్రజాబలం )** తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి, దామోదర రాజనర్సింహ, సహకారంతో పలు ఆసుపత్రుల్లో చికిత్సలు చేసుకొని ముఖ్యమంత్రి సహాయ నిధి కొరకు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు, అందోల్ నియోజకవర్గం లోని, మునిపల్లి మండల (ఎంపీడీవో) ఆఫీసులో శనివారం నాడు చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు, మునిపల్లి మండలానికి, 18, మంది లబ్ధిదారులకు 7, లక్షల 15 వేల రూపాయలు, మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు, ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ మంతూర్ సుధాకర్ రెడ్డి,పిల్లోడి సతీష్ కుమార్, పార్టీ మండల అధ్యక్షులు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు,న్యాల కంటి వీరన్న, తదితరులు పాల్గొన్నారు

# “జీవుల మనుగడ కోసం జలం “ పోస్టర్ ఆవిష్కరణ.



**కరీంనగర్ ప్రజాబలం ప్రజాబలం ప్రతినిధి:**జీవుల మనుగడ కోసం జలం “గోదప్రతి ని మానేరు పర్యావరణ సమితి, సర్వోదయ సేవా సమితి, కరీంనగర్ జిల్లా ఆవోప ల బాధ్యులు ఆవిష్కరించారు. శనివారం స్థానిక వైశ్య భవన్ లో మానేరు పర్యావరణ సమితి, సర్వోదయ సేవా సమితి, కరీంనగర్ జిల్లా ఆవోప ల బాధ్యులు తోట లక్ష్మణ్ రావు, గంజి స్వరాజ్ బాబు, కన్న కృష్ణ,
సామనారాయణ, కొమురవెల్లి వెంకటేశం లు హాజరై మాట్లాడారు భూగర్భ జలాలను పెంచడం, వర్షపు నీటిని ఒడిసిపట్టి ఆ నీటిని సక్రమంగా వినియోగించడం, దుర్వినియోగాన్ని అరికట్టడం , అంతేగాక నీటి విలువను తెలియజేస్తూ భావితరాలకు తాగు, సాగునీరు లభ్యంగా ఉండే విధంగా చూసుకోవాలనీ, ప్రతి ఒక్కరు బాధ్యతగా మొక్కలు నాటి వాటి సంరక్షణ చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టి దశరథం, కొత్త ప్రకాష్, రామేశం, శేఖర్, శివ కుమార్, సుదర్శన్, నవీన్ తదితరుల పాల్గొన్నారు .

# పాత్రికేయులకు లీగల్ నోటీసులు పంపడం సరికాదు

## -మందమర్రి ప్రెస్ క్లబ్ ప్రెసిడెంట్ గాండ్ల సంజీవ్



**ప్రజాబలం చెన్నూరు నియోజకవర్గ రిపోర్టర్ మార్చి 22:**ప్రెస్ క్లబ్ లో జరిగిన సమావేశం నిర్వహించిన విషయాన్ని పలుపర్తికల్లో ప్రసిద్ధంగా ఉండాలి పలు పత్రికల్లో ప్రచురితమవదంపై పాత్రికేయులకు లీగల్ నోటీసులు ఇవ్వడం తగదని మందమర్రి ప్రెస్ క్లబ్ ప్రెసిడెంట్ గాండ్ల సంజీవ్ అన్నారు. శనివారం ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మందమర్రి పట్టణంలోని అంగడి బజార్ ప్రాంతానికి చెందిన నస్పూరి వినయ్ గత ఫిబ్రవరి మాసంలో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న విషయం అందరికి తెలిసిందే. ఇట్టి ఘటనపై వినయ్ భార్య భాగ్యలక్ష్మి, మార్చి 19న మందమర్రి ప్రెస్ క్లబ్ లో పత్రిక సమావేశం ఏర్పాటు చేసిందన్నారు. తన భర్త వినయ్ మృతికి అంగడి బజార్ ప్రాంతానికి చెందిన వొడ్నాల శ్రీనివాస్, అతని భార్య మమత తోపాటు మరో నలుగురు కారకులని ఆరోపించారు, నా భర్తపై అనుమానంతో వోడ్నాల శ్రీనివాసతో పాటు అతని మిత్రులు దాడి చేశారని పేర్కొన్నారు. ఇట్టి వార్తను ప్రెస్ క్లబ్ పత్రిక మీడియా సభ్యులు. విధినిర్వహణలో భాగంగా ప్రచురించడం జరిగిందన్నారు.
ఇట్టి వార్తను కవరేజీ చేసిన క్లబ్ సభ్యులు వజీర్ హుస్సేన్, గుడికందుల రమేష్ లకు న్యాయవాది సదన్ కుమార్ ద్వారా వొడ్నాల శ్రీనివాస్ లీగల్ నోటీసులు పంపించడం తగదన్నారు. వార్తలను ప్రచురించిన పాత్రికేయులకు నోటీసులు పంపించడం పత్రికా స్వేచ్చకు భంగం కలిగించడమేనన్నారు. దీనిని పూర్తిగా ఖండిస్తున్నామని దీనిపై సదరు న్యామవాది, క్లయింట్ వొడ్నాల శ్రీనివాస్ పునః సమిక్షించాలని ఆయన కోరారు. ఈసమావేశంలో ప్రధాన కార్యదర్శి కదారి శ్రీధర్, కోశాధికారి బూర్ల రాజ్ కుమార్ లు పాల్గొన్నారు.

# పల్లె పల్లెన బీసీ జెండా ఎగురవేస్తాం

## -బీసీ అజాది ఫెడరేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ కుడికాల భాస్కర్



**ప్రజాబలం చెన్నూరు నియోజకవర్గ రిపోర్టర్ మార్చి 22:**గ్రామ గ్రామాన సంస్థాగత నిర్మాణం చేసి బీసీల ఉద్యమ పోరాటాన్ని బలోపేతం చేస్తామని, ప్రతి పల్లెలో బీసీ జెండాను ఎగురవేస్తామని బీసీ ఆజాది ఫెడరేషన్ కార్యనిర్వాక అధ్యక్షులు కుడికాల భాస్కర్ అన్నారు. శనివారం బీసీ ఆజాది ఫెడరేషన్ మంచిర్యాల జిల్లా అధ్యక్షులుగా మందమర్రి మండలం, మందమర్రి గ్రామానికి చెందిన చిదురాల సతీష్ ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా కుడికాల భాస్కర్ మాట్లాడుతూ గ్రామ గ్రామాన బీసీలను సంఘటితం చేస్తూ సంస్థాగతంగా నిర్మాణం చేస్తామని సంస్థాగత నిర్మాణంతో బీసీ ఉద్యమాన్ని బలోపేతం చేస్తామని తెలిపారు. జనాభాలో 52%నికిపైగ ఉన్న బీసీలు విద్య, ఉద్యోగ, వ్యాపార, రాజకీయ రంగాల్లో వెనుకబడి ఉన్నారని వారిని అభివృద్ధి చేయడమే దేశ అభివృద్ధి అవుతుందని అన్నారు, బీసీలకు విద్య, ఉద్యోగ వ్యాపార రాజకీయ రంగాల్లో జనాభా ప్రాతిపదికన వాటకోసం, చట్ట సభల్లో బీసీలకు రిజర్వేషన్ల కోసం, దేశ వ్యాప్త కుల గణన కోసం, బీసీ అట్రాసిటీ చట్టం కోసం నిరంతరం పోరాడుతామని రాజీలేని ఉద్యమాల వలన బీసీల హక్కుల సాధనే తమ ధ్యేయమని అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ ఆజాది ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మధుసూదన్ రాజు, రాష్ట్ర అధికార ప్రతినిధి సాగర్, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇంచార్జి జినుకల లక్ష్మణరావు, వరంగల్ జిల్లా అధ్యక్షుడు గజవెల్లి మనోహర్ కరీంనగర్ జిల్లా అధ్యక్షులు చిలుకమరి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు అందజేత



**కూకట్పల్లి (ప్రజబలం)మార్చ్ 22:**కూకట్పల్లి నియోజక వర్గం కూకట్పల్లి డివిజన్ లో నివాసం ఉంటున్న %+%.రామారావు %ూ/శీ% లక్ష్మయ్య. వయస్సు 51 సంవత్సరాలు, లివర్ సమస్యతో నిమ్స్ హాస్పిటల్ లో చేరడం జరిగింది. వారి కుమారుడు మిథిల్ కూకట్పల్లి లోని గొట్టిముక్కల వెంకటేశ్వరరావు కార్యాలయం లో సంప్రదించగా వారికి కూకట్పల్లి నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి బండి రమేష్ ద్వారా ముఖ్యమంత్రి సహాయ నిది కి అప్లై చేయడం జరిగింది. వారికి 1,50,000 రూపాయల ఎల్ ఓ సి మంజూరు అయ్యింది. ఆ ఎల్ ఓ సి లెటర్ ను కూకట్పల్లి నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి బండి రమేష్ కూకట్పల్లి నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గొట్టుముక్కల వెంకటేశ్వర రావు చేతుల మీదుగా రామారావు భార్య అంజమ్మ వారి కుమారుడు మిథిల్ కు అందజేయడం జరిగింది.

# డ్రంక్ అండ్ డ్రైవ్ లో పట్టుబడిన 91 మందిలో 50 మందికి జరిమానా, 41 మందికి జైలు శిక్షలు, జరిమానులు.

## మద్యం సేవించి వాహనాలు నడిపితే జైలు శిక్ష, జరిమానా తప్పదు,
## వేములవాడ పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ వీరప్రసాద్.



**వేములవాడ టౌన్, ( ప్రజాబలం )** వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు 14 రోజులుగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించగా 91 మంది మందుబాబులు పట్టుబడగా పోలీసులు శనివారం రోజున వేములవాడ కోర్టులో ప్రవేశపెట్టగా 50 మంది మందుబాబులకు జరిమానా, 41మందికి జైలు శిక్షలు ( ఇద్దరికీ ఏడు రోజుల జైలు శిక్ష ), ఏడుగురికి మూడు రోజుల జైలు శిక్ష, ఐదుగురికి ఐదు రోజుల జైలు శిక్ష, 27 మందికి రెండు రోజుల జైలు శిక్ష మొత్తంగా (1,99,600/– రూపాయల ) జరిమానా విధిస్తూ వేములవాడ జేఎఫ్ సీఎం మెజిస్ట్రేట్ జ్యోతిర్మయి తీర్పు వెల్లడించినట్లు వేములవాడ పట్టణ ఇన్స్పెక్టర్ వీరప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు.

వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్లో పట్టుబడిన మందుబాబులకు పట్టణ ఇన్స్పెక్టర్ ఆదేశాల మేరకు ట్రాఫిక్ ఎస్ఐ ఆధ్వర్యంలో కౌన్సిలింగ్ నిర్వహించి వారితో ఇంకెప్పుడు మద్యం సేవించి వాహనాలు నడపమని ప్రతిజ్ఞ చేపించారు.

ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ప్రతిరోజు పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు, వాహన తనిఖీలు నిర్వహించడం జరుగుతుందని, మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారికి వారి తల్లిదండ్రుల లేదా కుటుంబ పెద్దల సమక్షంలో కౌన్సిలింగ్ ఇవ్వడం జరుగుతుందన్నారు. మద్యం సేవించు వాహనాలు నడిపి పట్టుబడితే భవిష్యత్తులో వచ్చే ఉద్యోగ అవకాశాలు కానీ, ఉపాధి అవకాశాలకు పోలీస్ వెరిఫికేషన్ సమయంలో ఇబ్బందులు కలుగుతాయని, ట్రాఫిక్, రోడ్డు భద్రత నియమ నిబంధనలను ఉల్లంఘిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

# బీసీ బిల్లును తొమ్మిదో షెడ్యూల్లో చేర్చాలి.

## జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు మేకల పరశురాం డిమాండ్.



**వేములవాడ టౌన్, ( ప్రజాబలం ),** శనివారం రోజున జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు మేకల పరశురాం అధ్యక్షతన వేములవాడ అర్బన్ మండలం శ్రీ కన్వెన్షన్ హాల్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ అధ్యక్షతన విద్యా, ఉద్యోగాలలో స్థానిక సంస్థల ఎన్నికలలో 42 శాతం రిజర్వేషన్ బిల్లు ఆమోదం తెలిపినందుకు, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ కు, వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ బీసీ బిల్లును తొమ్మిదవ షెడ్యూల్లో చేర్చితే చట్టబద్ధత రక్షణ ఉంటుందని ఆయన అన్నారు. అదేవిధంగా పార్టీలకు అతీతంగా తెలంగాణ ఎంపీలు మరియు అఖిలపక్ష ఎంపీలు అందరూ ఈ బిల్లుకు మద్దతు ఇవ్వాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం బీసీ బిల్లును ఆమోదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా మండలాల మహిళా విభాగం, వివిధ మండలాల అధ్యక్షులు, కమిటీ సభ్యులు, సోషల్ మీడియా వారియర్స్, తదితరు బీసీ నాయకులు పాల్గొన్నారు.

# గ్రామాలు శరవేగంగా అభివృద్ధి చెందాలన్నదే బిజెపి లక్ష్యం. జిల్లా కౌన్సిల్ సభ్యులు జక్కుల తిరుపతి.



**వేములవాడ టౌన్, ( ప్రజాబలం ),** వేములవాడ రూరల్ మండలం చెక్కపల్లి గ్రామంలో గౌడ సంఘానికి కేంద్ర హెూం శాఖ సహాయ మంత్రి, కరీంనగర్ పార్లమెంటు సభ్యుడు బండి సంజయ్ కుమార్ మంజూరు చేసిన మూడు లక్షల రూపాయల సిసి రోడ్డును చెక్కపల్లి గ్రామస్తులతో కలిసి ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా జక్కుల తిరుపతి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం గ్రామాలను అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ముందుకు వెళు తుందని, కేంద్ర ప్రభుత్వం లక్ష్యాన్ని శరవేగంగా ముందుకు తీసుకువెళ్లి, గ్రామాలను అభివృద్ధి చేయాలని కరీంనగర్ పార్లమెంటు సభ్యులు కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కృత నిశ్చయంతో ఉన్నారని, బండి సంజయ్ ప్రజాహిత యాత్రలో ఇచ్చిన వాగ్దానం మేరకు గ్రామాలలో సిసి రహదారులు మంజూరు చేయించి, వేములవాడ రూరల్ మండలంలో 1,04( కోటి నాలుగు లక్షల రూపాయలు) మంజూరు చేపించి గ్రామాలను అభివృద్ధి చేసే లక్ష్యంతో ఉన్నారని రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి చేయడానికి ఎంపీ సహకారంతో మనమందరం కలిసికట్టుగా ముందుకు వెళ్దామని ఆయన తెలియజేశారు. ఎంపీ నిధుల మంజూరుకు కృషి చేసిన వేములవాడ నియోజకవర్గ బిజెపి పార్టీ ఇన్చార్జ్ చెన్నమనేని వికాస్ రావుకు, రాజన్న సిరిసిల్ల జిల్లా బిజెపి పార్టీ అధ్యక్షులు రెడ్డబోయిన గోపికి, బిజెపి సీనియర్ నాయకుడు ప్రతాప రామకృష్ణకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు వంగ పరశురాములు గౌడ్, వంగ సత్తయ్య, మల్యాల రాజు గౌడ్, గంగరాజు, ఎల్లయ్య, దేవయ్య, సత్తయ్య, నారాయణ, పొన్నం శ్రీనివాస్, బిజెపి నాయకులు కట్ట శ్రీధర్ బాబు, అడ్డిక సంతోషం రెడ్డి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# ట్రస్మా నిర్మల్ శాఖ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు



**ప్రజాబలం ప్రతినిధి నిర్మల్ జిల్లా..**పవిత్ర రంజన్ మాసాన్ని పురస్కరించుకుని ట్రస్మా నిర్మల్ శాఖ ఆధ్వర్యంలో ట్రస్మాలో గల తోటి ముస్లిం సోదర స్కూల్ కరెస్పాండెంట్లకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు.కార్యక్రమంలో ట్రస్మా నిర్మల్ జిల్లా అధ్యక్షులు గొల్లపల్లి శ్రీనివాస్ గౌడ్, ట్రస్మా జిల్లా ఉపాధ్యక్షుడు అబ్బాస్,నిర్మల్ జిల్లా టౌన్ ప్రెసిడెంట్ అయ్యనగారి శ్రీధర్, జిల్లా సెక్రటరీ శ్యామ్ ప్రకాష్,స్టేట్ ఈసీ మెంబర్ షబ్బీర్ మరియు ముస్లిములు సోదరులు పాల్గొన్నారు

## గ్రామాలు శరవేగంగా అభివృద్ధి చెందాలన్నదే బిజెపి లక్ష్యం. జిల్లా కౌన్సిల్ సభ్యులు జక్కుల తిరుపతి.



**వేములవాడ టౌన్, ( ప్రజాబలం ),** వేములవాడ రూరల్ మండలం చెక్కపల్లి గ్రామంలో గౌడ సంఘానికి కేంద్ర హెూం శాఖ సహాయ మంత్రి, కరీంనగర్ పార్లమెంటు సభ్యుడు బండి సంజయ్ కుమార్ మంజూరు చేసిన మూడు లక్షల రూపాయల సిసి రోడ్డును చెక్కపల్లి గ్రామస్తులతో కలిసి ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా జక్కుల తిరుపతి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం గ్రామాలను అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ముందుకు వెళుతుందని, కేంద్ర ప్రభుత్వం లక్ష్యాన్ని శరవేగంగా ముందుకు తీసుకువెళ్లి, గ్రామాలను అభివృద్ధి చేయాలని కరీంనగర్ పార్లమెంటు సభ్యులు కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కృత నిశ్చయంతో ఉన్నారని, బండి సంజయ్ ప్రజాహిత యాత్రలో ఇచ్చిన వాగ్దానం మేరకు గ్రామాలలో సిసి రహదారులు మంజూరు చేయించి, వేములవాడ రూరల్ మండలంలో 1,04( కోటి నాలుగు లక్షల రూపాయలు) మంజూరు చేపించి గ్రామాలను అభివృద్ధి చేసే లక్ష్యంతో ఉన్నారని రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి చేయడానికి ఎంపీ సహకారంతో మనమందరం కలిసికట్టుగా ముందుకు వెళ్దామని ఆయన తెలియజేశారు. ఎంపీ నిధుల మంజూరుకు కృషి చేసిన వేములవాడ నియోజకవర్గ బిజెపి పార్టీ ఇన్చార్జ్ చెన్నమనేని వికాస్ రావుకు, రాజన్న సిరిసిల్ల జిల్లా బిజెపి పార్టీ అధ్యక్షులు రెడ్డబోయిన గోపికి, బిజెపి సీనియర్ నాయకుడు ప్రతాప రామకృష్ణకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు వంగ పరశురాములు గౌడ్, వంగ సత్తయ్య, మల్యాల రాజు గౌడ్, గంగరాజు, ఎల్లయ్య, దేవయ్య, సత్తయ్య, నారాయణ, పొన్నం శ్రీనివాస్, బిజెపి నాయకులు కట్ట శ్రీధర్ బాబు, అడ్డిక సంతోషం రెడ్డి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## బి ఆర్ ఎస్ వి జిల్లా నాయకుల ముందస్తు అరెస్ట్







**ఖమ్మం ప్రతినిధి మార్చి 22 (ప్రజాబలం)** ఓయూ లో ఉద్యమాలను నిషేధిస్తూ రాజ్యాంగ విరుద్ధంగా ఇచ్చిన సర్క్యులర్ ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు చలో ఓయూ విద్యార్థి సంఘాల జేఏసీ చలో హైదరాబాద్ కార్యక్రమంలో భాగంగా ఖమ్మం జిల్లా బి ఆర్ ఎస్ వి నేతలను ముందస్తు అరెస్ట్ చేశారు అరెస్ట్ అయినవారు విద్యార్థి విభాగం జిల్లా నాయకులు లింగనబోయిన సతీష్ కోడిరెక్క ఉమాశంకర్ దరిపల్లి వీరబాబు బెల్లంకొండ గోపి వాసంశెట్టి సాయిలను రెండవ పట్టణ ఖానాపురం పోలీసులు ముందస్తు అరెస్ట్ చేసి స్టేషన్ కు తరలించారు

## ఇంటిని సీజ్ చేయడంతో పన్ను వసూళ్లు



**ప్రజాబలం మంచిర్యాల నియోజకవర్గం రిపోర్టర్ మార్చి 22 :** మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ లో 100 ఫీట్ల రోడ్డు ఏరియాలో గత ఐదు సంవత్సరాలు నుండి పన్ను చెల్లించకపోవడంతో మున్సిపల్ అధికారులు ఇంటిని సీజ్ చేయడంతో ఇంటి పన్ను వసూళ్లు.శనివారం ఈ సందర్భంగా మున్సిపల్ అధికారులు మాట్లాడుతూ... గత గత ఐదు సంవత్సరాల నుండి ఇంటి పన్ను చెల్లించకపోవడంతో ఇంటిని సీజ్ చేయడంతో వెంటనే స్పందించి గంట లోపల పన్ను చెల్లించడం జరిగింది.ఈ కార్యక్రమం లో మున్సిపల్ మేనేజర్ విజయ కుమార్,రెవిన్యూ అధికారి శ్రీనివాస్ రెడ్డి,మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## వేములవాడలో యువ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం.

### రక్తదాన శిబిరమును ప్రారంభించిన వేములవాడ టౌన్ రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్లు.
### యువ ఫౌండేషన్ సేవలు అభినందనీయం, డాక్టర్ చికోటి సంతోష్ కుమార్.
### రక్తదానం చేసిన వేములవాడ మున్సిపల్ కమిషనర్ అన్వేష్.



**వేములవాడ టౌన్, ( ప్రజాబలం ),** శనివారం రోజున రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణం నందు ప్రపంచ ఆరోగ్య దినోత్సవ ఏప్రిల్ 7వ తేదీని పురస్కరించుకొని ముందుగానే రక్తదాన శిబిరం నిర్వహించడం జరిగింది. ఈ రక్తదాన శిబిరంలో 60 మంది దాతలు రక్తదానం చేయడం జరిగింది అని యువ ఫౌండేషన్ అధ్యక్షులు గొడిశాల తిరుపతి గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీ చీకోటి సంతోష్ కుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు మంచి నడవడిక కలిగి ఉండాలని, ఆరోగ్యంగా ఉండాలంటే మంచి ఆహారపు అలవాట్లు కలిగి ఉండాలని, యువత చెడు వ్యసనాలకు లోను కాకుండా డ్రగ్స్ ( గంజాయి ) కి అలవాటు పడి ఆరోగ్యం పాడు చేసుకుని బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దు అని, సమాజ సేవలో భాగంగా యువత ముందుకు వచ్చి స్వచ్ఛందంగా రక్తదానం చేయడం అభినందనీయమని యువ ఫౌండేషన్ ద్వారా చేస్తున్న సేవా కార్యక్రమాలను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో యువ ఫౌండేషన్ వ్యవస్థాపకులు గొడిసెల రాజశేఖర్ గౌడ్, ఫౌండేషన్ ఉపాధ్యక్షులు బోంగోని శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి గడ్డం ప్రశాంత్, దూలం రాంకుమార్, రాకేష్, రాహుల్, గణేష్, హేమంత్, ప్రశాంత్ మరియు రక్తదాతలు పాల్గొన్నారు.



**కరీంనగర్ (ప్రజాబలం ప్రతినిధి)** హైదరాబాద్ మినిస్టర్ క్వార్టర్స్ లో మంత్రి పొన్నం ప్రభాకర్ ని మర్యాద పూర్వకంగా కలిసిన కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం




**యాకుత్ పురా ప్రజాబలం ప్రతినిధి:** శుక్రవారం రాత్రి కురిసిన చిన్న వర్షానికి ఓల్డ్ సిటీ, న్యూ సిటీలో రాత్రి 12 గంటలకు కరెంట్ పోతే శనివారం మధ్యాహ్నంవరకు రాలేదు రాత్రి కరెంట్ లేకపోవడంతో ఉపవాసాలు ఉండే వాళ్ళకి ఇబ్బందులు కలిగాయి చిన్న వర్షానికి ఇంత ఇబ్బంది వస్తే ఎలా?.. ప్రభుత్వం దగ్గర కరెంట్ వెంటనే రిస్టోర్ చేయడానికి సరైన మెకానిజం ఉందా?అసెంబ్లీ లో డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకుని వెళ్లిన - యాకుత్ పురా ఎంఐఎం ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్

## ఇందిరమ్మ రాజ్యంలో అరెస్టులు నిర్బంధాలా

### విద్యార్థుల సమస్యలపై పోరాడుతున్న బీఆర్ఎస్వి నాయకులను అర్ధరాత్రి అరెస్టులు చేయడం న్యాయమా బిఆర్ఎస్ సీనియర్ నాయకులు నిమ్మశెట్టి విజయ్



**వేములవాడ మార్చి -23 (ప్రజా బలం న్యూస్)** విద్యార్థుల సమస్యలపై పోరాడుతున్న బీఆర్ఎస్వి నాయకుల పై పోలీసులచే అర్ధరాత్రి అరెస్టులు చేయడం ఇదేనా ఇందిరమ్మ రాజ్యం అని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు నిమ్మషెట్టి విజయ్ అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న ఈ ప్రభుత్వం వారికి అందించే ఫీజు రియంబర్స్మెంట్ ఉద్యోగ అవకాశాలు కల్పించాలని బీఆర్ఎస్వి నాయకులు చేస్తున్న పోరాటాన్ని అక్రమ అరెస్టులతో అంచివేస్తున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే ఇందిరమ్మ రాజ్యంలో అక్రమ అరెస్టులు నిర్బంధాలు ఉండవని మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి నీకు రానున్న రోజుల్లో తగిన బుద్ధి ప్రజలు చెప్తారని అన్నారు.
బీఆర్ఎస్వి నాయకులు పోతు అనిల్ కుమార్ మాట్లాడుతూ అక్రమ అరెస్టులతో మా పోరాటాన్ని ఆపలేరని ఆనాడు తెలంగాణ ఉద్యమాన్ని ఆపేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన కుట్రలన్ని చిప్పికొట్టిన సంగతి మర్చిపోలేదా అని ప్రశ్నించారు. ఇప్పుడు ఉస్మానియా యూనివర్సిటీలో ధర్నాలను నిషేధిస్తూ జీవో తేవడం ఉద్యమాన్ని అనచి వేత చేయడం కాదా ప్రభుత్వం నిరకుశంగా వ్యవహరిస్తుందని అధికారంలోకి రావడానికి విద్యార్థులకు ఉద్యోగులకు ఎన్నో హామీలను ఇచ్చి అధికారం రాగానే 2 లక్షల ఉద్యోగాలు జాబ్ క్యాలెండర్ అని మాయమాటలు చెప్పి మోసం చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు నరాల శేఖర్ ,ముద్రకోల వెంకన్న విద్యార్థి నాయకులు పాల్గొన్నారు

## అధిక ఉష్ణోగ్రతల కారణంగా జిల్లాలోని మారుమూల ప్రాంతాల ప్రజల సహాయార్థం ప్రతి సోమవారం టెలిఫోన్ ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు



**ప్రజా బలం ప్రతినిధి నిర్మల్ జిల్లా..**వేసవి కాలం అధిక ఉష్ణోగ్రతల నేపథ్యంలో 24.03.2025 నుండి ప్రతీ సోమవారం ప్రజలు ప్రజావాణి కార్యక్రమానికి తమ అర్జీలను సమర్పించేందుకు వీలుగా ఉదయం 10:30 నుంచి 11 గంటల వరకు టెలి ఫోన్ ప్రజావాణి నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఇందులో భాగంగా ప్రజలు తమ ఇంటి వద్ద నుంచే 91005 77132 ఫోన్ నంబర్ ను సంప్రదించడం ద్వారా నేరుగా తమ సమస్యలను తెలిపి, దరఖాస్తులను వాట్సప్ ద్వారా పంపవచ్చునన్నారు. టెలిఫోన్ ప్రజావాణి ద్వారా స్వీకరించిన దరఖాస్తులను పరిశీలించి,ఆన్ లైన్ లో నమోదు చేసి పరిష్కరిస్తామని తెలిపారు. అలాగే 11:00 గంటల నుంచి మధ్యాహ్నం 1:00 గంట వరకు యధావిధిగా సాధారణ ప్రజావాణి కార్యక్రమం జరుగుతుందని తెలిపారు.జిల్లాలోని దూర ప్రాంత ప్రజలు టెలిఫోన్ ప్రజావాణి కార్యక్రమాన్ని వినియోగించుకొని తమ సమస్యలను పరిష్కరించుకోవాలని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు

## రాజీవ్ యువ వికాస్ పథకంలో రేషన్ కార్డు తప్పనిసరి అనే నిబంధన తొలగించాలి.



**వేములవాడ టౌన్, ( ప్రజాబలం ),** భారతీయ జనతా పార్టీ వేములవాడ రూరల్ అధ్యక్షుడు బూరుగుపల్లి పరమేష్ మీడియా సమావేశంలో మాట్లాడుతూ రాజీవ్ యువ వికాస్ పథకంలో రేషన్ కార్డు తప్పనిసరి అనే నిబంధనను తొలగించాలని ఆయన కోరారు. రాష్ట్ర ప్రభుత్వ పథకాన్ని ఉద్దేశించి నిరుద్యోగ యువత కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాస్ పథకాలలో రేషన్ కార్డు తప్పనిసరి చేయడం వల్ల అనేకమంది యువత నష్టపోతున్నారు. బి ఆర్ఎస్ 10 సంవత్సరాల పాలనలో రేషన్ కార్డులు ఇవ్వకపోవడం, కాంగ్రెస్ ప్రభుత్వంలో కొత్త రేషన్ కార్డులకు అప్లై చేయడం కోసం, పాత రేషన్ కార్డులలో పేర్లను తొలగించారు. అనేకమంది నిరుద్యోగులు రాజీవ్ యువ వికాస్ పథకానికిఅప్లై చేయలేకపోతున్నారు. కావున రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఈ నిబంధనను ఎత్తివేయాలని ఆయన డిమాండ్ చేశారు.

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com